ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

విశాఖపట్నం

fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-5-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 93 పేజీలు: 14 వెల: 6.50


అంతరిక్షయానంలో 'మిషన్ దృష్టి' మైలురాయి

నెదర్లాండ్స్‌లో యువరాణుల హత్యకు కుట్ర

5లో



# కింగ్‌లెవరో.. కింగ్ మేకర్లెవరో!

## తీవ్ర ఉత్కంఠకు తెర నేడే

బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో ఉ. 8 గంకు ఓట్ల లెక్కింపు ఆరంభం

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఇసి పకడ్బందీ ఏర్పాట్లు

ర్యాలీలు, విజయోత్సవాలపై నిషేధం

**న్యూఢిల్లీ, మే 3:** పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి అసెంబ్లీ ఓట్ల లెక్కింపు సోమవారం జరుగనుంది. ఉదయం 8గం.లకు ప్రారంభం కానుంది. వారాల తరబడి సాగిన ప్రచారాలు, ఆరోపణలు, వాగ్దానాలు, ర్యాలీలతో ప్రారంభమై నేడు కౌంటింగ్‌తో ముగియనుంది. ఉత్కంఠభరితమైన నాటకీయతకు తెరపడనుంది. ఐదు రాష్ట్రాల్లో విభిన్న రాజకీయ పరిణామాలు, ఐదు విభిన్న పోటీలు. ఎనిమిది వందల ఇరవై నాలుగు స్థానాల ఫలితాలు ఏకకాలంలో తేలుతున్నాయి. ఈ ఫలితాలు ప్రతి రాష్ట్ర ప్రాంతీయ సరిహద్దులను దాటి ప్రతి

>>2

# సంజీవని ఆరోగ్యదాయిని

## రూ. 2.5 లక్షల దాకా ప్రజలకు ఉచిత వైద్య సేవలు

ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రి

రాష్ట్రానికి నెగిటివ్ ఇమేజ్ సృష్టించిన గత ప్రభుత్వం

పర్యాటకానికి పారిశ్రామిక హోదా: సిఎం చంద్రబాబు



**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే తొలిసారి ప్రజలందరికీ వర్తింప చేసేలా యూనివర్సల్ హెల్త్ పాలసీ తీసుకువస్తున్నామని సిఎం చంద్రబాబునాయుడు పునరుద్ఘాటించారు. రూ.2.5 లక్షల వరకూ ఉచితంగా వైద్య సేవలు అందించేలా ఈ విధానం ఉంటుంది.అతి తక్కువ వ్యయంతోనే వైద్య చికిత్సలు అందేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. పిపిపి విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో వీటిలో బోధన అందుబాటులోకి వచ్చే దిశలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగాల కల్పన, వైద్య, విద్య తదితర రంగాలకు సంబంధించి సామాజిక మాధ్యమం "ఎక్స్"లోని తన ఖాతాలో వివిధ పోస్టుల ద్వారా కీలక సమాచారం అందించారు.గత పాలకులు కనీసం వైద్య కళాశాలలకు భూమి కూడా చూపించలేదు.ప్రతీ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పిపిపి అంటే ప్రైవేటు కాదని మరోమారు ప్రజలకు చెబుతున్నాం. ఇది పూర్తిగా ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుంది.అన్ని మెడికల్ కళాశాలల్లోనూ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సేవలు అందుతాయి.సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రతీ ఒక్కరి ఆరోగ్యం కోసం డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తున్నాం. ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యంగా వివరించారు.

గత పాలకులవల్ల విద్యారంగం దిగజారి పోయింది. ప్రాథమిక విద్య ఎక్కడైనా మాతృభాషలోనే ఉంటుంది. ఇంగ్లీష్ అని చెప్పి అటూ ఇటూ కాకుండా విద్యార్థులను గందరగోళ పరిచారు. ప్రపంచానికి తెలివైన యువతను అందించటంతో పాటు తెలుగును కాపాడుకునే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుంది అన్నారు.2019- 24 మధ్య ఏపీ బ్రాండ్ పూర్తిగా దెబ్బతింది. జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ లాంటి కంపెనీలు రాష్ట్రాన్ని వదిలిపెట్టి పోయాయి.వైసీపీ అధికారంలో ఉన్నంత వరకూ ఎపికి తిరిగి రామని చెప్పి మరీ ఆ కంపెనీలు వెళ్లిపోయాయి.పూర్తిగా నెగెటివ్ ఇమేజ్‌ని సృష్టించి గత పాలకులు వెళ్లారు. 2019 నుంచి 2023-2024 ఆర్థిక సంవత్సరంలో 913 కంపెనీలు మూతపడినట్టు ఆర్బీఐ నివేదికలో పేర్కొంది. ఇప్పుడా పరి

>>2

# అమరావతి కృష్ణా కరకట్టపై నాలుగు లేన్ల రహదారి

## రూ. 443 కోట్లతో నిర్మాణం

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా ప్రస్తుత కృష్ణానది కరకట్టను నాలుగు లైన్లుగా విస్తరించనున్నారు. దీనికోసం రూ.443 కోట్లు వెచ్చించనున్నారు. కృష్ణానది వరదల నుండి భద్రతతోపాటు తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. మూడు

>>2

# ప్రశాంతంగా 'నీట్' పరీక్ష

## 98% పైగా విద్యార్థులు హాజరు




**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ద్వారా నిర్వహించిన జాతీయస్థాయి వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్ (యూజీ) 2026 ఆదివారం రాష్ట్రంలో ప్రశాంతంగా ముగిసాయి.మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నీట్ పరీక్ష నిర్వహించారు.. రాష్ట్రంలో 45 వేల మంది అభ్యర్థులు 180 కేంద్రాల్లో నీట్ పరీక్ష రాయవలసి ఉండగా పలు చోట్ల కొందరు హాజరు కాలేదు, ప్రతి చోట నీట్ నిబంధనలను అనుసరించి పరీక్షలు జరిగాయి. అర్థగంటలకు ముందే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు.పరీక్షా ఎన్‌టిఆర్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో 32 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా మొత్తం 11,496 మంది అభ్యర్థులకుగాను 11,345 మంది (98.69 శాతం) హాజరైనట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీ ్మశ పరీక్ష ప్రక్రియను

>>2

# క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్స్‌కు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ,మే3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అమరావతి రాజధాని ప్రాంతంలోని క్వాంటం వ్యాలీలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించతలపెట్టిన ట్విన్ ఆఫీస్ టవర్ల నిర్మాణానికి అధికారికంగా పరిపాలన అనుమతులు లభించాయి. రాజధాని నగరంలో మౌలిక సదుపాయాల కల్పన, పరిపాలనా యంత్రాంగానికి అవసరమైన కార్యాలయాల కోసం ఈ ట్విన్ టవర్లను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ట్విన్ టవర్ల షెల్ అండ్ కోర్ నిర్మాణ పనుల కోసం రూ. 1208.41 కోట్లు కేటాయిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల (ఏప్రిల్) 23వ తేదీన జరిగిన 60వ ఎపిసిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ నిధులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టును 'డిజైన్ బిల్డ్ లంప్సమ్' పర్సంటేజ్ టెండర్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల నిర్మాణ సంస్థ ప్లానింగ్, డిజైనింగ్, ఎగ్జిక్యూషన్

>>2




4-5pg2ExHMNWJQEf.qxd:4-5pg2ExHMNWJQEf.qxd 1/1/02 7:26 AM Page 1





# ఎన్నికల ఫలితాలకుముందే ఇల్లు ఖాళీచేస్తున్న సిఎం మమత

**కోల్‌కత్తా, మే 3:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తికాకముందే, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన నివాసాన్ని ఖాళీ చేస్తున్నారన్న వార్త రాజకీయ దుమారం రేపింది. సాధారణంగా ఎన్నికల ఫలితాలు వెలువడి, గెలుపోటములు ఖరారైన తర్వాతే ముఖ్యమంత్రులు తమ నివాసాల మార్పుపై నిర్ణయం తీసుకుంటారు. కానీ, బెంగాల్ ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీ ఫలితాలకు ముందే తన నివాసాన్ని ఖాళీ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న ఆమె ఇల్లు వాస్తవానికి ఒక చిన్న గది వంటిది. ఆమె ముఖ్యమంత్రి అయినప్పటికీ, విలాసవంతమైన అధికారిక బంగ్లాకు వెళ్లకుండా అక్కడే నివసించడం ఆమె నిరాడంబరతకు నిదర్శనంగా నిలిచింది. మమతా బెనర్జీ తన పూర్వ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్జీ తరహాలోనే సాధారణ జీవితాన్ని గడపడానికి ఇష్టపడతారు. ఆమె నివసిస్తున్న ఇల్లు చాలా చిన్నది కావడంతో భద్రతా సిబ్బంది గతంలోనే ఆమెకు హెచ్చరికలు జారీ చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా అధికారిక నివాసానికి మారాలని అధికారులు పలుమార్లు కోరినా, ఆమె తన కాళీఘాట్ నివాసాన్ని వీడటానికి ఇష్టపడలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఆమె ఇల్లు ఖాళీ చేస్తున్నారనే వార్తలు రావడంతో, ఇది రాజకీయ వ్యూహమా లేక వ్యక్తిగత నిర్ణయమా అనే కోణంలో విశ్లేషణలు మొదలయ్యాయి. ఈ నిర్ణయం వెనుక ఉన్న అసలు కారణం ఏంటన్నది ఇంకా స్పష్టంగా తెలియలేదు. కొందరు దీనిని ఎన్నికల ఫలితాలపై ఆమెకు ఉన్న ముందస్తు సంకేతంగా భావిస్తుంటే, మరికొందరు మాత్రం భద్రతా పరమైన మార్పుల్లో భాగంగానే ఇది జరుగుతోందని అంటున్నారు. ఏది ఏమైనా, బెంగాల్ ఎన్నికల ఫలితాల వేళ మమతా బెనర్జీ తీసుకున్న ఈ నిర్ణయం హాట్ టాపిక్‌గా మారింది.

# ట్విన్ టవర్స్‌కు గ్రీన్ సిగ్నల్

>> బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఈ భారీ నిర్మాణ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌ను ఎపి ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు పర్యవేక్షణ, అమలు బాధ్యతలను ఏజీఐసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. క్వాంటం వ్యాలీ ప్రాంతంలో ఈ టవర్లు రావడం వల్ల ఐటీ, పరిపాలన, వాణిజ్య రంగాలు మరింత వేగంగా వృద్ధి చెందే అవకాశం ఉంది. అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఇవి ఐకానిక్ కట్టడాలుగా నిలవనున్నాయి.

# కొత్త విద్యాసంవత్సరంలో స్కూళ్లకు 87 సెలవులు

**విజయవాడ మే 03 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో 2026-27 విద్యాసంవత్సరానికి సంబంధించి అకడమిక క్యాలెండర్‌ను సిద్ధం అయింది. పాఠశాల విద్యాశాఖ ఈ క్యాలెండర్‌ను రూపొందించింది. ఈ క్యాలెండర్ ప్రకారం పాఠశాలలకు మొత్తం 87 రోజుల సెలవులు ఉండనున్నాయి. అదనంగా ఐదు ఇచ్ఛిక సెలవులు, స్థానిక పండుగలు మరియు జాతరల కోసం మూడు స్థానిక సెలవులు కూడా ఇవ్వనున్నారు. విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులు పాఠశాలలు పని చేయనున్నాయి. ఈ క్యాలెండర్ రూపకల్పనకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించి వారి సూచనలు, సలహాలను విద్యాశాఖ స్వీకరించింది. ఉపాధ్యాయుల పని భారం సమతుల్యం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రతి ఉపాధ్యాయుడు వారానికి కనీసం 24 బోధనా పీరియడల్లు నిర్వహించాలి. గరిష్ఠంగా 30 పీరియడ్లు మించకూడదలని విద్యాశాఖ స్పష్టం చేసింది. అవసరమైతే భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు గణితం కూడా బోధించేలా మార్పులు చేపట్టనున్నారు.

ఇక జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థుల ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు. అలాగే ప్రతి శనివారం నో బ్యాగ్ డే గా నిర్వహించి విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. విద్యార్థులను కొత్త తరగతులను సిద్ధం చేయడానికి తరగతి సంసిద్ధత కార్యక్రమాలను అమలు చేస్తారు. 1,2,6 తరగతులకు జూన్ 12 నుంచి ఆగస్టు 3 వరకు 36 రోజులపాటు 3,4,5,7,8 తరగతులకు జూన్ 12 నుంచి 30 వరకు 13 రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెలవుల విషయానికి వస్తే, సాధారణ పాఠశాలలకు అక్టోబర్ 12 నుంచి 21 వరకు దసరా సెలవులు ఉంటాయి. మైనారిటీ పాఠశాలలకు అక్టోబర్ 15 నుంచి సెలవులు ప్రారంభమవుతాయి. క్రిస్మస్ సందర్భంగా మైనారిటీ విద్యాసంస్థలకు డిసెంబర్ 20 నుంచి 27 వరకు సెలవులు ఉండగా, సాధారణ పాఠశాలలకు డిసెంబర్ 25న ఒకరోజు మాత్రమే సెలవు ఉంటుంది. సంక్రాంతి సెలవులు 2027 జనవరి 11 నుంచి 17 వరకు ఉంటాయి. ఇక , పరీక్షల షెడ్యూల్ విషయానికి వస్తే, ఫార్మేటివ్-1 పరీక్షలు ఆగస్టు 3 నుంచి 6 వరకు, ఫార్మేటివ్-2 అక్టోబర్ 5 నుంచి 8వరకు నిర్వహిస్తారు.

సమ్మేటివ్ పరీక్షలు నవంబర్ 9 నుంచి 20 వరకు జరగనున్నాయి. ఫార్మేటివ్ - 3 జనవరి 4 నుంచి 7 వరకు, ఫార్మేటివ్ -4 ఫిబ్రవరి 8 నుంచి 11 వరకు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 8 నుంచి 18 వరకు గ్రాండ్ టెస్ట్ మరియు తొమ్మిదో తరగతి సమ్మేటివ్-2 పరీక్షల ఫిబ్రవరి 24 నుంచి మార్చి 9 వరకు జరుగుతాయి. 1 నుంచి 8 తరగతులు సమ్మేటివ్-2 పరీక్షలు 2027 ఏప్రిల్ 3 నుంచి 17 వరకు నిర్వహిస్తారు.

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 15 నుంచి 31 వరకు జరగనున్నాయి. ఈ అకడమిక్ క్యాలెండర్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు స్పష్టమైన ప్రణాళిక లభించడంతో పాటు, విద్యా వ్యవస్థ మరింత క్రమబద్ధకంగా సాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# ప్రశాంతంగా 'నీట్' పరీక్ష

>> నిరంతరం పర్యవేక్షించడంతోపాటు కొండపల్లిలోని జెడ్‌పీ బాలికల పాఠశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్ష ముగిసిన అనంతరం కలెక్టర్ లక్ష్మీ మ్మశ మాట్లాడుతూ మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు పరీక్ష జరిగిందని.. అభ్యర్థుల ధ్రువీకరణ, బయోమెట్రిక్ హాజరు, భద్రత.. ఇలా ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకున్నామని, ఏర్పాట్ల విషయంలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూశామన్నారు. వేసవి నేపథ్యంలో ప్రతి పరీక్ష కేంద్రం వద్ద తాగునీటితో పాటు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష విజయవంతానికి కృషిచేసిన నీట్ కోఆర్డినేటర్లు, అబ్జర్వర్లు, పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లతో పాటు రెవెన్యూ, మునిసిపల్, విద్యుత్, ప్రజా రవాణా తదితర సమన్వయ శాఖల అధికారులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. గుంటూరు. విశాఖ,కాకినాడ ప్రాంతాల్లో నీట్‌కు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

# సంజీవని ఆరోగ్యదాయిని

>> స్థితి లేదు. విద్యా రంగంలో మరింత మెరుగైన ఫలితాల కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటున్నాం,ఆ క్రమంలో మంత్రి నారా లోకేష్ రూపొందించిన 100 రోజుల ప్రణాళిక టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించడానికి కారణమైందన్నారు.గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస పోయిన పరిస్థితి. ఎవరికీ నైపుణ్యాలను కల్పించలేకపోయారు.20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి దానిపై ఓ కమిటీని కూడా నియమించాం,ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఎపి ఉండేదన్నారు.

ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఎపి ఉంది అన్నారు.26 పాలసీలతో వేగంగా పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నాం. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నామన్నారు.175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం అన్నారు.పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్ల మేర విడుదల చేశాం అన్నారు.ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటిద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయిఅన్నారు.ఎంఎస్ఎంఇలో 2.48 లక్షల మందికి, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 1.46 లక్షలు, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్లో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి.అని తెలిపారు.మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుళ్లు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 మందికి వచ్చాయి అన్నారు. మొత్తంగా 6.28 లక్షల మందికి ఉద్యోగాల కల్పన ఇప్పటి వరకూ జరిగింది అన్నారు. పెట్టుబడులకు ప్రిఫర్డ్ డెస్టినేషన్‌గా ఎపి మారుతుంది అన్నారు.అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది.

విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ జోన్స్‌తో అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047కు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి తయారవుతుందన్నారు. విశాఖ ఐటీ, జీసీసీల కేంద్రంగా తయారవుతుంది. ఎవరూ ఊహించనన్ని పెట్టుబడులు విశాఖకు వచ్చాయన్నారు. అమరావతికి క్వాంటం లాంటి ఎకోసిస్టం విస్తరిస్తుంది. తిరుపతిని కూడా స్పేస్, ఎలక్ట్రానిక్స్, డిఫెన్సు పరిశ్రమలతో అభివృద్ధి చేస్తాం అన్నారు. గూగుల్, టాటా టిసిఎస్ లాంటి పెద్ద కంపెనీలు విశాఖకు వచ్చాయి అన్నారు. ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ వచ్చిందన్నారు. రెండేళ్ళల్లోనే ప్రపంచంలోనే పేరున్న పరిశ్రమలు కంపెనీలు ఎపికి వచ్చాయి. అన్నారు.గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసుకున్నాం.

ఎఎం గ్రీన్ ద్వారా గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి కూడా శ్రీకారం చుట్టాం అన్నారు.ఎన్టీపీసీ ద్వారా 1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ తయారీ కోసం కూడా ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. టాటా సంస్థ కూడా రూ.6 వేల కోట్ల పెట్టుబడులతో యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. ఇలా ప్రముఖ సంస్థలన్నీ రాష్ట్రానికి పెట్టుబడులతో ముందుకు వచ్చాయి అన్నారు.భవిష్యత్తులో ఈ పెట్టుబడులను సుస్థిరం చేయడానికి పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం అన్నారు.

# గోండా పోటీల్లో ఏదైనా జరిగితే ప్రభుత్వానిదే బాధ్యత!

## రెజ్లింగ్ క్రీడాకారిణి వినేశ్ ఫొగట్

**చండీగఢ్, మే 3:** భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ కంచుకోట అయిన గొండాలో జరగబోయే నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ పై ఏస్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో తనకు గానీ, తన బృందానికి గానీ ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖనే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె తీవ్ర స్వరంతో హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేసిన వినేశ్ ఫోగాట్, మే 12 నుంచి 14 వరకు గొండాలో జరగనున్న టోర్నమెంట్‌లో తాను పాల్గొననున్నట్టు తెలిపింది. బ్రిజ్ భూషణ్, ఆయన మనుషుల నియంత్రణలో జరిగే ఈ టోర్నీలో కష్టపడి ఆడే అథ్లెట్లకు న్యాయం జరగడం అసాధ్యం. ఎవరి మ్యాచ్‌కు ఎవరు రిఫరీగా ఉంటారు, ఎవరికి ఎన్ని పాయింట్లు వేస్తారు అనేదంతా వాళ్లే నిర్ణయిస్తారని ఆమె ఆరోపించింది. క్రీడాకారుల వెయిట్ చెకింగ్ ప్రక్రియ కూడా పారదర్శకంగా జరగదనే అనుమానాన్ని ఆమె వ్యక్తం చేసింది.

ఇదే వీడియోలో, బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలతో కోర్టులో ఫిర్యాదు చేసిన ఆరుగురు మహిళా రెజ్లర్లలో తానూ ఒకరినని వినేశ్ తొలిసారిగా వెల్లడించింది. లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా మేము మూడేళ్ళ క్రితమే గళమెత్తాం. కేసు విచారణలో ఉన్నందున ఇప్పటివరకు మాట్లాడలేదు. కానీ ఫిర్యాదు చేసిన ఆ ఆరుగురిలో నేనూ ఒక బాధితురాలినని ఆమె స్పష్టం చేసింది.

బ్రిజ్ భూషణ్‌ను అధికారికంగా డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ పదవి నుంచి తొలగించినప్పటికీ, ఫెడరేషన్‌పై తనకే పట్టుందని ఆయన బహిరంగంగా చెబుతున్నా క్రీడా మంత్రిత్వ శాఖ ప్రేక్షకపాత్ర వహిస్తోందని వినేశ్ ఫోగాట్ విమర్శించారు.

## వారం - వర్జ్యం

04-05-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
తదియ తె.5.24
అనూరాధ ఉ.9.58
వర్జ్యం : సా.4.15-సా.6.03
దు.ము.12.30-మ.1.21, 2)మ.3.03-మ.3.54
శుభసమయం : ఉ.8.30-9.30
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ఆరోగ్య సమస్యలు ఎదురైన అధిగమిస్తారు.

**వృషభం:** మీ మేధస్సుతో ప్రయోజనాలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకో గలుగుతారు.క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మిథునం:** ఉద్యోగస్థులకు మధ్యస్త ఫలితాలు గోచరిస్తున్నాయి. మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు అధికమవుతారు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. వివాదాలకు మాత్రం దూరంగా ఉండటం మంచిది. ఆరోగ్యం జాగ్రత్త.

**సింహం:** అనుకోని అవకాశాలు కలిసి వస్తాయి. తద్వారా లాభపడతారు. యోగాభ్యాసాలు చేయటం వలన లాభపడతారు.

**కన్య :** కోర్టు సంబంధిత కేసులు మీకు అనుకూలంగా మారతాయి. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త అవసరం.

**తుల :** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు. వాహన సౌఖ్యం.

**వృశ్చికం:** వీసా, పాస్‌పోర్టులకు సంబంధించిన విషయాలలో సాంకేతిక లోపాలు ఎదురవుతాయి.ఆరోగ్యం విషయం జాగ్రత్త.

**ధనుస్సు:** కుటుంబంలో స్పర్థలు రాకుండా జాగ్రత్తలు పాటించండి. స్పష్టంగా ఉన్న కొన్ని విషయాలలో స్పష్టత ఏర్పడుతుంది.

**మకరం:** వ్యాపార విషయాలలో భాగస్వాముల నిజాయితీ మీద అతి నమ్మకం నిర్లక్ష్యం వద్దు. శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** సంతానానికి సంబంధించిన విషయ వ్యవహారాలు మీ కనుసన్నలలో నడుస్తాయి. శ్రమకు తగిన ఫలితం.

**మీనం:** మీ వాళ్ళకు సరియైన అవకాశాలు కల్పించడానికి లేక వాళ్ళ ప్రతిభతో తెచ్చుకున్న అవకాశాలు దుర్వినియోగం అవుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# కింగ్ మేకర్లెవరో!

>> ధ్వనిస్తాయి. జాతీయ చర్చను రూపుదిద్దుతాయి, పార్టీ వ్యూహాలను పునఃసమీక్షి స్తాయి, 2029 లోక్‌సభ ఎన్నికలకు తొలి దిశానిర్దేశం చేస్తాయి. ప్రతి ఎగ్జిట్ పోల్ రేపు ఎలా ఉండవచ్చో దాని స్వంత అంచనాను అందించింది. లెక్కలోకి వచ్చే ఏకైక అంచనా ఉదయం కౌంటింగ్ కేంద్రాల వద్ద మొదలుకానుంది.

ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులోకి తీసుకొచ్చారు. విజయోత్సవాలు, సభలు, ర్యాలీలపై నిషేధం విధించింది. అలాగే ఆయా రాష్ట్రాలలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బలగాలను కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దించింది.

ఇక గెలుపుపై అన్ని పార్టీలూ ధీమాతోనే ఉన్నాయి. బెంగాల్‌లో నాల్గోసారి సంపూర్ణ మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నామని సిఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు. ఈసారి టిఎంసి విధ్వంసక పాలనకు ప్రజలు చరమగీతం పాడారని, తామే అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తున్నామని ప్రతిపక్ష నేత, బిజెపి అగ్రనేత సువేందు అధికారి తెలిపారు. అటు అసోంలో మళ్లీ తామే అధికారంలోకి వస్తున్నామని సిఎం బిశ్వంత్ శర్మ ధీమా వ్యక్తం చేశారు. అసోంలో విభజన రాజకీయాలకు తావులేదని, బిజెపికి ఈసారి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేరళలో మూడోసారి విజయం తమదేనని సిఎం పినరయి విజయన్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి వ్యతిరేకత లేదని, నేటి ఫలితాల్లో అది రుజువుకానుందని అభిప్రాయపడ్డారు. ఖచ్చితంగా ఈసారి యుడిఎఫ్ అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తుందని ఆ కూటమి పక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సతీషన్ ధీమా వ్యక్తం చేశారు. తమిళనాడులో మరోమారు తామే అధికారంలోకి వస్తున్నామని డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ కూడా చెప్పాయని ఆయన గుర్తుచేశారు. ఎఐఎడిఎంకె నేతృత్వంలోని ఎన్‌డియే భారీ విజయం సాధించబోతున్నది, ఖచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నామని మాజీ సిఎం పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల్లో తామే కింగ్‌లు, కింగ్ మేకర్లమని టివికె అధినేత, సినీ నటుడు విజయ్ పేర్కొన్నారు.

ఇక రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే, పశ్చిమ బెంగాల్‌కు ఉన్నంత జాతీయ ప్రాధాన్యత లేదు. దశాబ్దానికి పైగా బిజెపి నిరంతర విస్తరణ ప్రయత్నాన్ని ప్రతిఘటించిన రాష్ట్రం ఇది. సంక్షేమ పథకాల పంపిణీ, బెంగాలీ గుర్తింపు, ప్రతి ఎన్నికను రాష్ట్ర ఆత్మ కోసం జరిగే నాగరిక పోరాటంగా చిత్రీకరించగల సామర్థ్యంలో పాతుకుపోయిన వ్యక్తిగత ప్రజాదరణను మమతా బెనర్జీ రాజకీయ సంస్థకు అతీతమైన దానిని నిర్మించిన రాష్ట్రం ఇది. ఆమె వరుసగా నాలుగోసారి పదవిని కోరుకుంటున్నారు.2011లో ముప్పై నాలుగేళ్ల లెఫ్ట్ ఫ్రంట్ పాలనను కూల్చివేసినప్పటి నుండి తృణమూల్ కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇది భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత చెప్పుకోదగిన ఎన్నికల మార్పులలో ఒకటి. బిజెపి ఇప్పటివరకు బెంగాల్‌లో అత్యంత అధునాతన వ్యూహంతో ఈ ఎన్నికల్లోకి ప్రవేశిస్తోంది. 2021 నుండి నిర్మించిన సంస్థాగత పటిష్టత, ఓటర్లకు భరోసా ఇచ్చేందుకు కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించడం, నదీ తీరంలో మోడీ జలమురి కార్యక్రమం నుండి డార్జిలింగ్‌లోని గోర్ఖా సమాజానికి అమిత్ షా గడువులోగా ఇచ్చిన హామీల వరకు జాగ్రత్తగా రూపొందించిన ప్రచారం. ఇవన్నీ రేపటి ఓట్ల లెక్కింపు కోసమే జరుగుతున్నాయి.

ఇక తమిళనాడు విషయానికొస్తే, ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె వరుసగా రెండోసారి అధికారంలోకి వస్తుందా, లేక ఐదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న ఎఐఎడిఎంకె నేతృత్వంలోని ప్రతిపక్షం, బిజెపితో కలిసి ఎన్‌డియే పతాకం కింద తిరిగి అధికారాన్ని చేజిక్కించుకుంటుందా అనే విషయాన్ని తమిళనాడు ఎన్నికలు తేల్చనున్నాయి. ఈ పోటీకి గతంలో జరిగిన ఏ తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకూ లేని విధంగా మూడో కోణం ఉంది. అదే తమిళ సినిమా రంగంలోని అగ్రశ్రేణి నటులలో ఒకరైన విజయ్, 2024లో ప్రారంభించిన "తమిళగా వెట్రి కజగం" పార్టీ ఉనికి. విజయ్ స్వయంగా పెరంబూర్ నుంచి పోటీ చేస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పుడు, అధికార పార్టీ డిఎంకె వ్యతిరేక ఓట్లను ఏకీకృతం చేయడంలో టివికె సామర్థ్యం లేదా వాటిని చీల్చడంలో దాని పాత్ర నిర్ణయాత్మక అంశాలలో ఒకటిగా ఉంటుంది.



ఆదివారం కడపలోని ఓ హోటల్‌లో సామాన్యులతో అల్పాహారం చేస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

# సామాన్యుడిలా ప్రజలతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి పార్థసారథి

**కడప మే 3 ప్రభాతవార్త :** రాష్ట్ర సమాచార పౌర సంబంధాల మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తన నిరాడంబరతను చాటుకున్నారు. ఎటువంటి ఆడంబరాలు లేకుండా సామాన్య ప్రజలతో మమేకమై వారిని ఆశ్చర్యపరిచారు. రాయచోటి పర్యటనలో భాగంగా ఆదివారం ఉదయం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి బయలుదేరి కడప రైల్వే స్టేషన్ మార్గంలోని వీరయ్య హోటల్‌ను మంత్రి సందర్శించారు. అక్కడ సామాన్య ప్రజలు, స్థానిక నాయకులతో కలిసి కూర్చుని అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా హోటల్‌కు వచ్చిన వారితో సరదాగా సంభాషిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అధికారిక హోదా పక్కన పెట్టి, సామాన్యుడిలా ప్రజల మధ్యకు వచ్చి వారితో కలిసి సమయాన్ని గడపడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు నిరంతరం చేరువగా ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.

# నాలుగు లేన్ల రహదారి

>> దశల్లో సీతానగరంలోని ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ నుండి వైకుంఠపురం వరకూ కరకట్టను విస్తరించనున్నారు. రివర్ ఫ్రంట్ పేరుతో డిపిఆర్ కూడా సిద్ధం చేశారు. ప్రస్తుతం సింగిల్ లైనుగా ఉన్న కరకట్టను నాలుగు లైన్ల రోడ్డుగా మార్చడంతోపాటు మధ్య డివైడర్ ఏర్పాటు ద్వారా సుందరంగా తీర్చిదిద్దనున్నారు. 24 మీటర్ల వెడల్పున దీన్ని నిర్మించనున్నారు. మొత్తం మూడు దశల్లో నిర్మించే ఈ రోడ్డును తొలిదశలో 6.9 కిలోమీటర్లు నిర్మించనున్నారు. సెంట్రల్ లైటింగ్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఒకవైపు ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ప్రతిపాదించారు. తొలిదశలో రోడ్డును ఫ్లడ్ పంపింగ్ స్టేషన్ నుండి వెంకటపాలెం సమీపంలో జాతీయ రహదారి వరకూ విస్తరిస్తారు. 37వ ప్యాకేజీగా నిర్మించే ఈ రోడ్డు కోసం రూ.149.82 కోట్లు కేటాయించారు. ఇటీవల క్యాబినెట్లోనూ దీనికి ఆమోదం లభించింది. త్వరలోనే అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్లు పిలవనుంది. ఇప్పటికే సర్వే కూడా పూర్తి చేశారు. గతంలో కరకట్టను ఒకవైపే విస్తరించాలని నిర్ణయించినా కొత్త ప్రతిపాదనలో రెండువైపులా విస్తరించనున్నారు.

**కొండవీటివాగుపై రెండులైన్ల వంతెన..**

కరకట్ట విస్తరణలో భాగంగా కొండవీటివాగుపై రెండు వరుసల వంతెన నిర్మించనున్నారు. దీనికి షిప్ లాక్ కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కృష్ణా పశ్చిమ కాలువ మీద నిర్మిస్తున్న స్టీలు వంతెన పనులు పూర్తయి అందుబాటులోకి రాగానే కరకట్టపై రాకపోకలు నిలిపేసి ప్రస్తుతం ఉన్న గేట్ల వద్ద కొత్తవంతెన, గేట్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం రూ.93 కోట్లు ఖర్చవుతుందని ఎగ్జిక్యూటివ్ కమిటీలో నిర్ణయించారు.కృష్ణానది కుడి కరకట్ట రోడ్డును నాలుగులైన్లుగా విస్తరించడం ద్వారా అక్కడ రవాణాతోపాటు పర్యాకటంగానూ ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వెంకటపాలెం తాళ్లాయపాలెం సమీపంలో రివర్ ఫ్రంట్ అభివృద్ధి కోసం భూమిని కూడా కేటాయించారు. టెండర్లనూ ఆహ్వానించారు. ప్రకాశం బ్యారేజీ నుండి వెంకటపాలెం జాతీయ రహదారి వరకూ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేయడంతోపాటు నగరవాసులకు అహ్లాదకర వాతావరణం ఉండేలా సదుపాయాలు కల్పించనున్నారు.

# బస్సుబోల్తాపడి 26 మందికి తీవ్రగాయాలు

**కాంగ్రా(హిమాచల్), మే 3:** హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రాలో ఆదివారం జరిగిన బస్సు ప్రమాదంలో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో చంబా నుంచి ఉనా వెళ్తోన్న క్రమంలో నుర్పూర్ సమీపంలోని నియాజ్‌పూర్ వద్ద బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 26 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ గుండె పోటుకు గురికావడం, ఈ సమయంలో బస్సును నియంత్రించలేకపోవడం వల్లే బోల్తాపడి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. బస్సు అదుపుతప్పుతున్న సమయంలోనే కొందరు ప్రయాణికులు గమనించి తమను తాము రక్షించుకునేందుకు అప్రమత్తమయ్యారు. బస్సు బోల్తా పడినే వెంటనే స్థానికులు స్పందించారు. అధికారులకు వెంటనే సమాచారం అందించారు. వెంటనే అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని బయటకు తీశారు. గాయపడ్డవారిని నుర్పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందుతోంది. ఈ 26 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని మెరుగైన చికిత్సకోసం టాండా మెడికల్ కాలేజీకి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి గాయాలైనప్పటికీ, ప్రాణాపాయం లేదని తెలిపారు. నుర్పూర్ ఎస్పీ ఆధ్వర్యంలోని పోలీసుల బృందం ఈ ఘటనపై విచారణ జరుపుతోంది. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ ఘటనను రాజకీయాలకు వాడుకోవద్దు: టీనాచౌదరి

**ముంబయి, మే 3:** ముంబైలో బిజెపి ర్యాలీ కారణంగా ఏర్పడిన ట్రాఫిక్‌లో మంత్రి గిరీశ్ మహాజన్‌ను నిలదీసి సోషల్ మీడియాలో వైరల్ అయిన మహిళ టీనా చౌదరి ఆ ఘటనపై తొలిసారి స్పందించారు. ఈ వివాదాన్ని రాజకీయాలకు వాడుకోవద్దని కోరారు. నా భుజంపై తుపాకీ పెట్టి ఎవరినీ లక్ష్యంగా చేసుకోవద్దని కోరుతూ శనివారం ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. గతనెల 21న వర్లీ ప్రాంతంలో జరిగిన ఆ ఘటన గురించి టీనా వివరిస్తూ నా కూతురిని మ్యూజిక్ క్లాస్ నుంచి తీసుకురావడానికి వెళ్తుండగా, ర్యాలీ వల్ల గంటన్నర పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాను. అక్కడ ఉన్న పోలీసులను ఎంత వేడుకున్నా స్పందించలేదు. వారి దృష్టిని ఆకర్షించేందుకే నీళ్ల బాటిల్‌ను నేలపైకి విసిరాను కానీ, ఎవరి మీదా కాదని స్పష్టం చేశారు. ఆ సమయంలో మంత్రి గిరీశ్ మహాజన్ మాత్రమే తన సమస్యను అర్థం చేసుకున్నారని టీనా తెలిపారు. మంత్రి గారు నా మాట విని, వెంటనే అక్కడి బస్సులను తొలగించాలని ఆదేశించారు. ఆయన వల్లే మాకు దారి దొరికిందని ఆమె వివరించారు. ప్రజల పట్ల అన్ని రాజకీయ పార్టీలూ ఒకేలా నిర్లక్ష్యంగాగా వ్యవహరిస్తాయని టీనా విమర్శించారు. తన తండ్రి సహా కుటుంబంలో 8 మంది భారత సైన్యంలో పనిచేశారని గుర్తుచేస్తూ యూనిఫాం ధరించడం అంటే ప్రజా సేవ చేయడమే కానీ, ప్రజలను భయపెట్టడం కాదని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా, పబ్లిక్‌లో గందరగోళం సృష్టించారని ఆరోపిస్తూ టీనాపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

# ఇజ్రాయెల్‌ను కలవరపెడుతున్న హెజ్బొల్లా కొత్తడ్రోన్లు!



**బీరూట్, మే 3:** ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఘర్షణలో హిజ్బుల్లా సరికొత్త, ప్రమాదకరమైన ఆయుధాన్ని ప్రయోగిస్తోంది. ఎలక్ట్రానిక్ జామింగ్‌కు ఏమాత్రం చిక్కని ఫైబర్ ఆప్టిక్ గైడెడ్ క్వాడ్‌కాప్టర్ డ్రోన్లతో దాడులకు పాల్పడుతూ ఇజ్రాయెల్ సైన్యాన్ని విస్తుపోయేలా చేస్తోంది. ఇటీవల ఇలాంటి దాడిలోనే 19 ఏళ్ల ఐడీఎఫ్ సార్జెంట్ ఇడాన్ ఫూక్స్ మరణించగా, మరికొందరు సైనికులు గాయపడ్డారు. ఈ దాడికి సంబంధించిన వీడియోను హిజ్బుల్లానే స్వయంగా విడుదల చేసింది. సాధారణంగా డ్రోన్లను రేడియో సిగ్నల్స్ ద్వారా నియంత్రిస్తారు. ఇజ్రాయెల్ తన సాంకేతికతతో ఆ సిగ్నల్స్‌ను జామ్ చేసి డ్రోన్లను నిర్వీర్యం చేస్తుంది. హిజ్బుల్లా వాడుతున్న ఈ కొత్త డ్రోన్లు ఆపరేటర్‌కు ఒక సన్నని ఫైబర్ ఆప్టిక్ కేబుల్‌తో అనుసంధానమై ఉంటాయి. దాదాపు 15 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ కేబుల్ కంటికి కనిపించకపోవడంతో, డ్రోన్‌ను గుర్తించడం, దానిపై దాడి చేయడం ఇజ్రాయెల్ సైన్యానికి కష్టంగా మారింది. చైనా లేదా ఇరాన్ నుంచి తెప్పించిన ఈ డ్రోన్లకు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో వాడిన ఫైబర్ ఆప్టిక్ పరిజ్ఞానాన్ని హిజ్బుల్లా జతచేసింది. ఈ డ్రోన్లు చాలా చిన్నవిగా ఉండి, గ్రెనేడ్ల వంటి పేలుడు పదార్థాలను మోసుకెళతాయి. వీటిని చౌకైన, అదృశ్య, కచ్చితమైన కిల్లర్లుగా అభివర్ణిస్తున్నారు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్ సైన్యం సరిహద్దుల్లో వలలు, ఇతర భౌతిక అడ్డంకులు ఏర్పాటు చేస్తోంది. ఎలక్ట్రానిక్ యుద్ధంలో ఆరితేరినప్పటికీ, ఈ తక్కువ ఖర్చు ఆయుధం తమకు పెను సవాల్‌గా మారిందని, దీనిని ఎదుర్కొనేందుకు ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నామని ఇజ్రాయెల్ అధికారులు అంగీకరిస్తున్నారు.

4-5Pg3exHMNWJQE.qxd:4-5Pg3exHMNWJQE.qxd 1/1/02 5:57 AM Page 1



# ఎపిలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని తీసుకురానుంది. ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి ఈ పాలసీని అధికారికంగా అమలులోకి తీసుకుని వచ్చేందుకు కార్యచరణ చేపట్టింది. ఇందుకోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.782 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.




అలానే సంతానోత్పత్తిని పెంచేందుకు కూటమి సర్కార్ ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు రెడీ అయ్యింది. ఆరోగ్యాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ పేరుతో కొత్త విధానం అమలు చేయనుంది. సంతానోత్పత్తిని పెంచడంపై ప్రధానంగా దృష్టి పెట్టనున్నారు.

ఈ నూతన పాలసీలో భాగంగా ఇకపై ప్రతీ ఏటా 50 వేల మంది దంపతులకు ఉచితంగా ఐవీఎఫ్ చేయించనున్నారు. నిరుపేద దంపతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పలు కారణాల వల్ల సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఇది పండగలాంటి వార్త అని చెప్పవచ్చు. ప్రస్తుతం బయట ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఐవీఎఫ్ చికిత్సకు రూ.లక్షలు ఖర్చు అవుతున్నాయి. ఇది పేదలకు పెను భారంగా మారింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఇకపై వారికి ఉచితంగా ఐవీఎఫ్ చికిత్స అందించేందుకు నిర్ణయించింది. దీని వల్ల సంతానోత్పత్తి పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రస్తుతం జననాల రేటు అనేది తగ్గుతుంది. ఎపిలో సంతానోత్పత్తి రేటు 1.5 శాతానికి తగ్గిపోయింది. ఇది 2.1 శాతంగా ఉండాల్సి ఉండగా.. ప్రతి ఏటా పడిపోతూ వస్తుంది. దీంతో సంతానోత్పత్తి పెంచేందుకు పిల్లల సంపద పేరుతో ప్రతీ నెలా నాలుగో శనివారం గ్రామ సభలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా మహిళా ఉద్యోగులకు 12 నెలల పాటు ప్రసూతి సెలవులు ఇవ్వనున్నారు.

ఇక మహిళల కోసం వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, శిశు సంరక్షణ కేంద్రాలు ఈ పాలసీలో భాగంగా ఏర్పాటు చేయనున్నారు. అలాగే వృద్ధుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2036 నాటికి ఎపిలో వృద్ధుల జనాభా 19శాతానికి చేరుకుంటుందనే అంచనాలు వస్తున్నాయి. దీంతో వృద్ధుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు.



## వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యం

**• రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**కడప, మే 3 ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల అభ్యున్నతే లక్ష్యమని, వారి విద్యా, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం రాయచోటి పర్యటనలో భాగంగా స్థానిక కడప ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు మంత్రి పార్థసారథి విచ్చేశారు. ఈ నేపథ్యంలో స్థానికులు, కార్యకర్తలు, నాయకులు పుష్పగుచ్ఛాలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాలోని వెనుకబడిన తరగతులు, యాదవ సంఘాల అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను మంత్రి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో ఫోన్ ద్వారా ప్రస్తావించారు.

**బిసి స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి:** కడప జిల్లాలో శాశ్వత ప్రాతిపదికన బిసి స్టడీ సర్కిల్ భవనాన్ని నిర్మించాలని, అందుకు తగిన ప్రపోజల్స్ సిద్ధం చేయాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు. గోకుల సేవా సమితి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గాను 3.5 ఎకరాల స్థలాన్ని తక్కువ ధరకే కేటాయించే విషయంపై కలెక్టర్‌తో చర్చలు జరిపారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నందు పలువురు బిసి సంఘాల నేతలు, యాదవ సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల నేతలు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వారి సమస్యలను విన్నవించగా అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

## ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలి

**• ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియను అమలు చేయండి**

**• రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం, ఆదేశాలు జారీ**

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసే దిశలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తక్షణం ప్రమోషన్లతో పాటు ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియను అములు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను రేపటి లోపే పూర్తి చేయాలని డెడ్‌లైన్ విధించింది. ముఖ్యంగా కమర్షియల్ టాక్స్ శాఖతో పాటు అన్ని హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ లో గెజిటెడ్ పోస్టుల భర్తీపై ప్రత్యేక దృష్టి సారించింది. లోకల్ క్యాడర్ పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన క్రొ ఎంప్లాయ్ మెంట్ ఆర్డర్ చట్టం అమల్లోకి రాకముందే ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో భవిష్యత్తులో సీనియారిటీకి సంబంధించిన సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

ఈ నేపథ్యంలో ప్రత్యేక క్లియరెన్స్ డ్రైవ్‌ను చేపట్టిన, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో ప్రమోషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.

ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయి. పని తనాన్ని మెరుగు పరిచేలా చేస్తాయి. ఈ విషయం లో వారికి ఎలాంటి అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ - డిపిసి విధానం అమల్లోకి తెచ్చింది. పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు మరింత పారదర్శకం చేసింది. ఈ-డిపిసి వల్ల ఏప్రిల్ వల్ల ఏప్రిల్, ఆగస్టులో పదోన్నతులు రావాల్సి వారికి ముందుగానే నవంబరు, డిసెంబరులో వచ్చాయి. కానీ అన్ని స్థాయిలో అన్ని శాఖల్లో ఇది జరగడం లేదు. సచివాలయంలోని ఆర్థిక శాఖ దాని పరిధిలోని హెచ్‌వోడీలు, అసెంబ్లీలో రెండేళ్ల నుంచి పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వంలో పదోన్నతులు పెండింగ్‌లేని శాఖ ఒక్కటి కూడా లేదని ఉద్యోగులు అభియోగిస్తున్న క్రమంలో ప్రభుత్వం పై నిర్ణయం తీసుకుంది.

## పివి సింధుకు థ్యాంక్స్ చెప్పిన పవన్ కల్యాణ్

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధుకు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ "ఎక్స్" వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. అస్తవ్యస్తమైన డ్రెయినేజీ వ్యవస్థ, అడుగడుగునా అపరిశుభ్రంతో అల్లాడుతున్న గ్రామాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంకల్పం వెలుగులు నింపిందని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు ప్రశంసిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసారు. ఈ సందర్భంగా ఇంకుడు కాలువలతో కూడిన మ్యాజిక్ డ్రెయిన్లు మురుగు రహిత పల్లెలను ఆవిష్కరిస్తున్నాయని ఆమె గుర్తుచేశారు. సింధు సిమెంట్ డ్రెయిన్లతో పోలిస్తే 80శాతం ఖర్చును కూడా ఆదా చేస్తున్నాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వచ్ఛ సంకల్పం, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో నిర్మిస్తున్న ఈ మ్యాజిక్ డ్రెయిన్ల మ్యాజిక్‌పై తన విలువైన అభిప్రాయాన్ని వెలిబుచ్చిన పివి సింధుకి ఉప ముఖ్యమంత్రి పవన్ ధన్యవాదాలు తెలిపారు.

## జాతీయ లోక్‌అదాలత్ జులై 11కు వాయిదా

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ లోక్‌అదాలత్ జులై 11న జరుగుతుందని హైకోర్టు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ పేర్కొంది. రాజీపడదగ్గ కేసులను సులువుగా పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ లోక్‌అదాలత్ ఈ నెల 9న నిర్వహించనున్నట్లు గతంలో ప్రకటించినప్పటికి, అనివార్యకారణాలతో జులై 11న నిర్వహించడం జరుగుతుందని హైకోర్టు రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది.



## ఈదురుగాలుల వాన బీభత్సం

**• తిరుమలను ముంచెత్తిన వరుణుడు**

**• తిరుపతిలో కూలిన చెట్లు, 2 కార్లు ధ్వంసం**

**తిరుమల, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మండుతున్న వేసవిలో బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తిరుపతి జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వాన బీభత్సం సృష్టించింది. తిరుమలలో జోరువాన ముంచెత్తగా తిరుపతి నగరంలో గాలుల వానకు అనేక ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. నేలకొరిగి పార్కుచేసిన వాహనాలపై కూటడంతో కార్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.

తిరుపతి నగరంలోని బాలాజీకాలనీ, కెటిరోడ్డు, అన్నారావు కూడలి ప్రాంతాల్లో భారీ వృక్షాలు కూలడంతో ఈ సంఘటనలు జరిగాయి. అయితే ఎక్కడా ప్రాణనష్టం సంభవించలేదు. బలంగా కురిసిన వర్షానికి తిరుపతి నగరంలో విద్యుత్ సరఫరాకు అంతకాయం ఏర్పడింది. సాయంత్రా నికి విద్యుత్ పునరుద్ధరణ జరిగింది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో కొన్ని మండలాల్లో ఆదివారం మధ్యాహ్నం గాలివాన కురిసింది. తిరుపతి జిల్లాలో తిరుమల, తిరుపతి, చంద్రగిరి, రూరల్, రేణిగుంట మండలాల్లో ఓ మాదిరి వాన కురిసింది. నగరంలోని ప్రధాన రోడ్లన్నీ జలమయంగా మారాయి. చాలావరకు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్ళలోకి నీరు చేరింది. కాసేపటికే వరుణదేవుడు శాంతించడంతో మళ్ళీ ఎండ కనిపించింది.

లోతట్టుప్రాంతాల్లో కపిలతీర్థం, శివజ్యోతినగర్, తిలక్‌రోడ్డు, వివిమహల్ రోడ్డు, కొర్లగుంట, లక్ష్మీపురం, సంజయ్‌గాంధీ కాలనీ, జీవకోన, సుభాష్ నగర్, రైల్వేకాలనీ, ఎన్జీవోకాలనీ, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, కొత్తపల్లి, సుందరయ్య నగర్, ఆర్టీసి బస్టాండ్, డిఆర్ మహల్ రోడ్డు ప్రాంతాల్లో వరదనీరు పొంగి రోడ్లుచెరువులను తలపింపజేశాయి. మళ్ళీ అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని, రెండు రోజుల పాటు కొన్ని జిల్లాల్లో ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గి ఆకాశం మేఘావృతమై ఉంటుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. వాతావరణం కొంత చల్లగా మారుతుందని, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ పేర్కొంది. కొద్ది రోజులుగా ఎండవేడితో అల్లాడుతున్న ప్రజలకు వర్షాలు కాస్త ఉపశమనం కల్పించినా పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాల ధాటికి కోతికొచ్చిన వరి పంట చేలల్లోనే నేలవాలగా, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిముద్దవుతోంది.

# వేసవి సెలవుల్లో సామాన్యుడికే సకల సౌకర్యాలు

**తిరుమలలో విస్తృత ఏర్పాట్లు**



**తిరుమల, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవి సెలవులు, అధిక భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టిటిడి విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా అన్ని సదుపాయాలను అందుబాటు లో ఉంచింది. వేసవి రద్దీ నేపథ్యంలో ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఇందుకోసం సుమారు రెండు కోట్లతో భక్తులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కల్పించేందుకు బాటగంగమ్మ సర్కిల్ నుండి గోగర్భం డ్యామ్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్ వరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. అలాగే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2, మ్యూజియం ప్రాంగణం, నారాయణగిరి ఉద్యానవనాల్లో నీడనిచ్చే షెల్టర్లు ఏర్పాటు చేశారు. క్యూ లైన్లలో వేచి ఉండే భక్తుల కోసం కూల్ పెయింటింగ్ పనులు, అదనపు తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి ఆలయం పరిసరాలు, లడ్డూ కౌంటర్లు, భక్తుల రాకపోకలు అధికంగా ఉండే ప్రాంతాల్లో చలువ పందిళ్ల నిర్మాణం చేపట్టారు. ఇదే సమయంలో నాలుగు మాడ వీధుల్లో సింథటిక్ ఎనామెల్ కూల్ పెయింట్ వేయడం ద్వారా భక్తులు నేల వేడి నుండి ఉపశమనం పొందేలా చర్యలు తీసుకున్నారు. బాట గంగమ్మ గుడి సర్కిల్ నుండి ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు మొబైల్ వాటర్ డ్రమ్ములతో ఎప్పటికప్పుడు తాగునీరు పంపిణీ చేయడం జరుగుతోంది. వేసవి నేపథ్యంలో భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా శ్రీవారి సేవకులు నేరుగా భక్తుల వద్దకే వెళ్లి తాగు నీరు అందిస్తున్నారు. ఒక బ్యాచ్ లో 15 మంది వంతున, మొత్తం మూడు బ్యాచుల్లో రోజుకు 45 మంది శ్రీవారి సేవకులు భక్తులకు తాగునీరు అందిస్తున్నారు.

దర్శన క్యూలైన్లలో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తూ ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. తిరుమలలో మొత్తం 16 వైద్య కేంద్రాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రదేశాల్లో భక్తులకు అవసరమైన తక్షణ వైద్య సేవలు అందించబడతాయి. రద్దీకి అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డులో క్యూలైన్ల వెంబడి ఒక మొబైల్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అందుబాటులో ఉంచారు. నారాయణగిరి వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్ అందుబాటులో ఉంటుంది.

వేసవి రద్దీకి తగినవిధంగా భక్తులకు స్వామివారి లడ్డూలను విరివిగా అందుబాటులో ఉంచారు. సాధారణ రోజుల్లో 3.50 లక్షల లడ్డూలను అందుబాటు లో ఉంచగా, పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో 3.50 లక్షల లడ్డూలను బఫర్ స్టాక్‌గా అందుబాటులో ఉంచుకున్నారు. తిరుమలలో స్థలాభావం వల్ల పరిమిత సంఖ్యలో వసతి గదులు నిర్మిచబడ్డాయి. 60వేల మంది భక్తులకు మించి తిరుమలలో వసతి కేటాయించడానికి వీలుపడదు. ప్రస్తుతం తిరుమలలో దాదాపు 7,500 గదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. గదులు పొందలేని భక్తులు తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయాలు 1,2,3,5, పద్మనాభ నిలయంలలో ఉన్న దాదాపు తొమ్మిదివేల లాకర్లను వినియోగించుకునేలా చూస్తున్నారు.

భక్తులు స్వామివారికి తలనీలాల సమర్పణ కోసం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రధాన కల్యాణకట్టతో పాటూ పిఎసి1, పిఎసి2, పిఎసి3, పిఎసి 5, జిఎన్‌సి, హెచ్‌విసి, సప్తగిరి విశ్రాంతి గృహం, నందకం విశ్రాంతి గృహం, కౌస్తుభం విశ్రాంతి గృహం, వేంకటేశ్వర విశ్రాంతి గృహం, పద్మావతి విశ్రాంతి గృహం ప్రాంతాల్లో 11 మినీ కల్యాణ కట్టలు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 1,152 మంది క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నారు. వీరిలో 269 మంది మహిళలు ఉన్నారు.

## తిరుమల సమాచారం



### 'తరతరాలకు స్ఫూర్తినిచ్చే అన్నమయ్య సంకీర్తనల సాహిత్య సంపద'

**తిరుమల, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలు భక్తి, తాత్వికత, మానవీయ విలువల సమ్మేళనంగా తరతరాలకు స్ఫూర్తినిచ్చే అపూర్వ సాహిత్య సంపదగా నిలిచాయని హైదరాబాద్‌కు చెందిన ఆచార్య ఆంజనేయులు తెలిపారు. "ప్రాచీనాంధ్ర సాహిత్యంలో అన్నమయ్య ప్రత్యేకత" అంశంపై మాట్లాడుతూ తాళ్లపాక అన్నమాచార్యులను తొలి వాగ్గేయకారుడిగా అభివర్ణించారు. ఆయన సంకీర్తనలు భక్తిని గాఢం చేసే దివ్య మార్గదర్శకాలుగా నిలిచాయని పేర్కొన్నారు. అన్నమయ్య 618వ జయంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం సాహితీ సదస్సులు ప్రారంభమయ్యాయి. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన హైదరాబాద్‌కు చెందిన డా. అనంత పద్మనాభరావు "అన్నమయ్య సంకీర్తనల ప్రచారం-ప్రసారం"పై మాట్లాడుతూ టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్ ద్వారా సంకీర్తనల ప్రచారం సమర్థవంతంగా కొనసాగుతోందన్నారు. రేడియో, టివి, డిజిటల్ వేదికల ద్వారా ఈ కీర్తనలు ప్రపంచవ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. తిరుపతికి చెందిన ఆచార్య దామోదర నాయుడు తాళ్లపాక కవుల పదప్రయోగాల వైశిష్ట్యాన్ని వివరించగా, ఆచార్య చెన్నప్ప అన్నమయ్య కీర్తనల్లో సమానత్వం, మానవత్వం ప్రతిఫలిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి డాక్టర్ మేడసాని మోహన్, సంచాలకురాలు లత, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.




## సురక్షిత తిరుపతి ప్రధాన లక్ష్యం

**తిరుపతి, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం,ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుపతి నగరం సురక్షిత ప్రాంతంగా ఉండాలనేది ప్రధాన లక్ష్యంగా పోలీస్‌శాఖ కార్యాచరణ చేపట్టింది.నిత్యం వస్తున్న 70వేల మంది యాత్రికులకేగాక సామాన్య ప్రజలకు, భక్తులకు రక్షణ కల్పించడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. తిరుపతి నగరంలో తరచూ ఆపరేషన్ వజ్రపహార్ నిర్వహిస్తూ పోలీస్, ఎక్సైజ్, రవాణా, ఈగల్, రెవెన్యూ, ఆర్మ్డ్ రిజర్వ్, డాగ్ స్క్వాడ్ విభాగాల సమన్వయంతో భారీ తనిఖీలు చేస్తున్నారు. అనేక ప్రాంతాల్లోని రౌడీ షీటర్లు, గంజాయి వినియోగదారుల కదలికలపై నిఘా ఉంచుతున్నారు. మాదకద్రవ్యాల సరఫరా మూలాలను గుర్తించి సరఫరాదారులపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలతో నేరుగా మమేకమై జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడిన రౌడీషీటర్లు, గంజాయి వినియోగదారులు ఉన్న నేపథ్యంలో వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. వారి కార్యకలాపాలు నియంత్రణలో ఉంటే కాలనీకి మంచి పేరు వస్తుందని, ఆ బాధ్యత పోలీసులతో పాటు స్థానిక ప్రజలదేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అనుమానితులపై గంజాయి వినియోగ నిర్ధారణ కోసం టెస్ట్ కిట్లతో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పాజిటివ్‌గా గుర్తించిన వారికి ముందుగా కౌన్సెలింగ్, అవసరమైతే పునరావాసం కల్పిస్తామని, అయినప్పటికీ మళ్లీ అదే కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.తిరుపతిని అలజడి లేని, ప్రశాంతమైన, సురక్షిత నగరంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యమని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. మీ ప్రాంత భద్రత మీ చేతుల్లో కూడా ఉంది. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సహకరించాలని, మీ సహకారంతోనే సేఫ్ తిరుపతి సాధ్యం అవుతుందని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## 14న మిక్స్‌డ్ రైస్ ఈ-వేలం

**తిరుమల, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతో బాటు టిటిడి అనుబంధ ఆలయాలకు భక్తులు హుండీ ద్వారా సమర్పించిన బియ్యాన్ని ఈనెల 14న ఈవేలం ద్వారా విక్రయించనున్నారు. మొత్తం 41 లాట్లుగా ఉన్న మిక్స్‌డ్ రైస్‌లో ఉదయం సెషన్‌లో 21 లాట్లు, మధ్యాహ్నం సెషన్‌లో 20లాట్లు కలిపి సుమారు 16,338 కిలోల బియ్యాన్ని ఈవేలంలో ఉంచనున్నారు. ఈ వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు, ఉదయం, మధ్యాహ్నం సెషన్ లకు విడివిడిగా మే 13 సాయంత్రం లోపు ఆన్‌లైన్‌ల "కొనుగోళ్ళు" పోర్టల్ ద్వారా ప్రతి సెషన్‌కు రూ.50 వేలు ఇఎండి చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయాన్ని, 0877-2264429ను కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చు.





## కల్తీ నెయ్యి దొంగలను అరెస్ట్ చేయండి

**తిరుపతి, మే 3 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వెంకన్న లడ్డూలను కలుషితం చేసిన గత ప్రభుత్వం చేసిన పాపాలను ఇప్పటికీ గుర్తుతెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, కల్తీ నెయ్యి వ్యవహారం ప్రపంచాన్ని కుదిపేసిందని జనసేన పార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ఆందోళన వ్యక్తం చేశారు. దేవుని లడ్డూలకు కల్తీ నెయ్యి సూత్రధారులు దొరల్లా తిరుగుతున్నారని, ఏకసభ్య కమిషన్ నివేదికలో అసలు వ్యక్తుల పేర్లు బయటపెట్టారని, ధర్మారెడ్డి బెదిరింపులకు అనిల్ కుమార్ సింఘాల్ భయపడ్డారని, ధర్మారెడ్డి కల్తీ నెయ్యిని ప్రోత్సహించారని, డబ్బులకు కక్కుర్తి పడి శ్రీవారి మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. ధర్మారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డిలను వెంటనే అరెస్ట్ చేయాలని, వారిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని కిరణ్ డిమాండ్ చేశారు.

**కల్తీకేటుగాళ్ళను వెంటనే జైలుకు పంపండి:** తప్పు చేసి తెల్లచొక్కాలు వేసుకుని దర్జాగా తిరగడమేంటని ప్రశ్నించారు. ఆదివారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. ప్రకాష్ రాజ్ డ్రామాలు ఆడుతున్నాడని, మతిభ్రమించి ప్రకాష్ రాజ్ పవన్ కల్యాణ్ పై మాట్లాడుతున్నారని విమర్శించారు. విలువల్లేని వ్యక్తి ప్రకాష్‌రాజ్ మద్యం సేవించి విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రకాశ్‌రాజ్ ఓ పొలిటికల్ జోకర్ అని ఎద్దేవా చేశారు. ప్రకాశ్‌రాజ్ ఒక అపరిచితుడని, ఉత్తమమైన మనిషి కాదని, ఆయన ఉత్తమ నటుడు మాత్రమేనని చెప్పుకొచ్చారు. ఫిల్మ్‌ఛాంబర్ ఎన్నికల్లో మెగా ఫ్యామిలీ కాళ్లు పట్టుకున్నారని సెటైర్లు గుప్పించారు.

## కొడకంటి మురళికి జాతీయ స్థాయి గుర్తింపు



**తిరుపతి, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతికి చెందిన యువ దర్శకుడు కొడకంటి మురళి రూపొందించిన షార్ట్ ఫిల్మ్.. "పరిచయమిలా"కు జాతీయ స్థాయి గుర్తింపు దక్కింది. ఢిల్లీలో జరిగిన 16వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌లో జ్యూరీ మెన్షన్ లభించింది. పరిచయమిలా షార్ట్ ఫిల్మ్‌లో నిశ్శబ్దం, భావాలు, మనుషుల మధ్య ఉన్న చెప్పలేని అనుబంధాలను ప్రతిబింబిస్తుంది. సాదాసీదా కథనం ద్వారా నిజాయితీతో కూడిన భావాలను ప్రేక్షకులకు చేరువ చేసిందని న్యాయ నిర్ణేతలు తెలిపారు.

ఈ చిత్రంలో వరుణ్ ఆర్యన్ ప్రధాన పాత్రలో నటించగా, తేజస్వి హీరోయిన్‌గా నటించారు. సంగర్షణ్, వెంకీ ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించారు.

ఈ చిత్రాన్ని అశోక్ చల్లా నిర్మించగా, రచన, దర్శకత్వం కొడకంటి మురళి వహించారు. సినిమా రంగానికి సంబంధం లేని నేపథ్యం నుండి, కార్పెంటర్‌గా పనిచేస్తూ సినిమాల వైపు అడుగుపెట్టిన మురళి ప్రయాణం ప్రత్యేకంగా నిలిచింది. పరిమిత వనరులతో కూడా తన కలను నిజం చేసుకున్నాడు. ఈ అవార్డు అతని కృషికి గుర్తింపుగా నిలిచిందని తెలిపారు.

4-5pg4.qxd:4-5pg4.qxd 1/1/02 6:06 AM Page 1



వార్త

> బలీయమైన విశ్వాసాలకు, నైతిక సూత్రాలకు కట్టుబడని వారు ఏ పార్టీలో ఉన్నా వారికి ఆ పార్టీకి కూడా క్షేమం కలగదు.
>
> న- అండర్సన్

# చండ్ర నిప్పులు!

ఈ సారి ముందస్తు వానల కబురు మనసును తేలిక చేస్తుంటే, అదే సమయానికి నడి నెత్తి మీద ఎండవేడిమి వడదెబ్బ రూపంలో మొట్టికాయలు వేయడం కాకతాళీయమే కావచ్చు. తెలుగురాష్ట్రాల ప్రజలు ఎండ, వానలతో విచిత్ర అనుభవాలు ఎదుర్కొంటున్నారు. ఒక తెలుగు రాష్ట్రం తెలంగాణలో ఎండ తీవ్రత తట్టుకోలేని విధంగా ఉంది. కొన్ని జిల్లాల్లో ఎండ చండ్ర నిప్పులు కురుస్తోంది. ఎండలు నిప్పులు కొలిమిని తలపిస్తున్నాయి. పగలు కానీ రాత్రి కానీ పిల్లలు ఇళ్ళల్లో మగ్గిపోతున్నారు .భద్రాద్రి జిల్లాలో అకాల వర్షాలతో రైతాంగం విస్తుపోతోంది. శనివారం సాయంత్రం వడగండ్ల వాన, ఈదురు గాలులతో రోడ్ల పక్కన చెట్లన్నీ నేల వాలాయి. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాజమండ్రిలో ఎడతెరిపిలేని వర్షంతో గోదావరి జిల్లా వాసులు తడిసి ముద్దయ్యారు. పిడుగులు సంగతి మామూలే!మరో నాలుగు రోజులు ఇదే మాదిరి వాతావరణం చూస్తామని హెచ్చరికలు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మెండోరాలో గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్నరీతిలో 46 డిగ్రీ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అటుఏటా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు చేసుకునే పల్నాడుజిల్లా రెంటచింతల 45 డిగ్రీల నమోదుతో ఉష్ణోగ్రతలో కాస్తవెనకబడింది.ప్రతి రోజు సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతంలో 46, 47 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుంది, కనుక మధ్యాహ్నం 12గంటల నుంచి నాలుగు గంటల వరకుబయటకి కదల రాదన్న ఆంక్షలున్నాయి. శనివారం తెలంగాణ రాష్ట్రంలో 12 జిల్లాలలో సూరీడు నిప్పులు కక్కుతూ జనాన్ని ఉక్కపోతకు గురిచేశాడు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో వడదెబ్బకు గురై నలుగురు మృతి చెందారు. వారిలో ఇద్దరు రైతులు. వచ్చే రెండు రోజులు పాటు తెలంగాణలో గరిష్ట ఉష్ణోగ్రతలు తప్పవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిస్తోంది. ఏదైనా కాసింత ఉపశమనం పొందాలన్నా ఆరవ తేదీ తర్వాతనే. ఆ తర్వాత మాత్రమే రెండు నుంచి నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలకు తగ్గుతుందని సూచన. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటి నుంచి బయటికి వెళ్తే ఇబ్బందులు తప్పవని అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేస్తోంది. భవన నిర్మాణా కార్మికులు, అసంఘటిత కార్మికులు, ఉపాధి కార్మికులు అత్యధిక ఉష్ణోగ్రతల మధ్య ఎండల్లో పని చేస్తూ ఆపసోపాలు పడుతున్నారు. మొన్నో రోజు హైదరాబాద్‌లోవాషింగ్ మిషన్‌పేలిన సంఘటన, నిన్న తూర్పు ఢిల్లీలో ఎసి యూనిట్‌పేలి ఒక నివాస భవనంలో 9మంది చావుకు కారణమైనదుర్ఘట. కారణం బయటి వాతావరణంలో అత్యధిక వేడిమివల్లనే జరిగింది. ఈ స్థాయి వేడిమికి జంతుజాలానికి, ప్రత్యేకించి పక్షులకు ప్రమాదమే. ఇప్పటికేచాలా పక్షులు నేల రాలిన సంఘటనలు నమోదయ్యాయి. కొన్ని తూర్పు తీరప్రాంతాల్లో సాధారణంగా కన్నా ఎక్కువరోజులు వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇదంతా ఎల్‌నినో ఎఫెక్టే కారణం. కాగా హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ పెరగడమనేది పట్టణీకరణ వల్లే కావచ్చు. కానీ ఉష్ణోగ్రతలు పెరిగినప్పుడు దానికి తగ్గ ఉపశమనాలు పాటించకపోతే అనారోగ్యంపాలవుతామని డాక్టర్లు సైతంహెచ్చరిస్తున్నారు. ప్రభుత్వాలు హీట్ వేవ్ యాక్షన్‌ప్లాన్‌లను విడుదలచేసి వేడిమి ఉపశమన ద్రవాలు, మజ్జిగ, మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది.కానీ వడగాలులు ఎవరిని ఎప్పుడు ఎలా చుట్టుముడతాయో చెప్పలేం కనుక ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిందే! వేసవిలో ఎండతీవ్రత 45 డిగ్రీల సెల్సియస్ దాటితే సమస్యలు పెరుగుతున్నాయన్నమాటే. ఎండల ధాటి 45డిగ్రీల స్థాయికి చేరుకుంటే, ప్రమాద స్థాయిమరింతగా పెరుగుతుంది. ఎండవేడిమితో త్వరగా అలసట, నీరసం ఆవహించి, అతిసారం, వాంతులు తల తిరగడం వంటి అనారోగ్య లక్షణాలు వెంటాడతాయి. ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు దాటినట్లయితే, వడదెబ్బ సోకే అవకాశాలు ఎక్కువ.ఈ ఉష్ణోగ్రతలు ఒక్కోసారి ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు.అందుకే ముందు జాగ్రత్తలు అవసరం. గడచిన పదేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. భారత వాతావరణ శాఖ వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.5, 42.5 డిగ్రీలవరకు, తెలంగాణలో 41.5 నుంచి 43.5డిగ్రీల వరకు నమోదయ్యాయి. కానీ ఈసారి ఆ అంకెలు దాటిపోయి ప్రమాదకర పరిస్థితిలో పడ్డాయి. విజయవాడ, కర్నూలు, రామగుండం, భద్రాచలం వంటి కొన్ని ప్రాంతాల్లో వేసవి సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45, 47 డిగ్రీల వరకు కూడా నమోదయ్యాయి.

ఇదిలా ఉండగా నైరుతిరుతుపవనాల రాక గురించి వాతావరణశాఖ ఓ మంచి వార్త చెప్పింది. సాధారణంగా వచ్చే సమయం కన్నా ముందుగానే నైరుతి రుతుపవనాలు భారత్‌ను పలకరిస్తాయని పేర్కొంది. ఈనెల 14,15 తేదీలలో నైరుతి రుతుపవనాలు అండమాన్‌కి వస్తున్నాయి. ఈ సందర్భంగా పలుప్రాంతాల్లో సాధారణంగా అధిక స్థాయిలో వడగాలులు వీస్తాయి. మరికొన్ని ప్రాంతాల్లో అతిఎక్కువ వర్షపాతం నమోదవుతుందని వెల్లడిస్తోంది. గుజరాత్‌లోని సౌరాష్ట్ర, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరఖండ్‌లోని దక్షిణ ప్రాంతాలు, బీహార్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, ఒడిస్సా సహా కోస్తా తీరరాష్ట్రాల్లో ఎక్కువ స్థాయిలో వడగాలులు వీస్తాయి.దేశంలో రాత్రిపూట సాధారణంగా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర వివరించారు.

మేనెలలో సాధారణ వర్షపాతంకంటే 110శాతం ఎక్కువగా ఉండచ్చునని అంచనా.వర్షాలుఉన్నాయని చెప్పినా వేడిమిలో ఊరట ఉండబోదు. పైగా పగటి ఉష్ణోగ్రత ఎలా ఉన్నా సాయంత్రం ఉష్ణోగ్రత మాత్రం అధికంగానే ఉం



> మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే, మీరు ఓటమికి గురికానేకారు. కాని మీరు జీవితంలో ఏది సాధించలేకపోతారు.
>
> వినోబా భావే



> ఒకరు మరొకరికి హాని చేస్తుంటే చూసి నవ్వడం చాలా తేలిక. అదే హాని తనకు జరిగితే భరించటం చాలా కష్టం.
>
> స్వామి వివేకానంద

## ప్రజావాక్కు

### జంతుబలిని నిషేధించండి

ఈనెల 5 నుండి 13 వరకు తిరుపతిలో గంగమ్మ జాతర నిర్వహించబడుతుంది.దానిఆహ్వాన కమిటీవారు ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని ఆహ్వానించారు. మూఢనమ్మకాలనుప్రోత్సహించే ఇలాంటిజాతరలకు ఒక ముఖ్యమంత్రి వెళ్లడం అంటే మూఢనమ్మకాలను ప్రోత్సహించటమే అవుతుంది. కొన్ని వేలకోళ్ల చంపబడతాయి. గొర్రెలు, మేకలు కూడా వందలాదిగా చంపబడతాయి. ఆ చుట్టు ప్రక్కల మొత్తం ఆ వారమంతా రక్తం వాసన వస్తూ ఉంటది. ఇది మా ఆచారం అంటూ మొగవాళ్ళు ఆడవేషం, ఆడవాళ్ళు మగవేశం వేసుకొని,ముఖాలకు సున్నపుబోట్లు పూసుకొని, రకరకాల వేషాలేసుకుని తిరుగుతారు. సరే అది వేరే విషయం. చివరిరోజు గంగమ్మను బూతులు తిడుతూ, కొడుతూ ఆ మట్టి బొమ్మను ఉతికి అరేస్తారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఉద్యోగావకాశాల కల్పన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమరావతి వేదికగా రూపుదిద్దుకుంటున్న అమరావతి క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ ఒక చారిత్రాత్మక ఘట్టం. భారతదేశంలోనే మొట్టమొదటి క్వాంటం టెక్ పార్క్‌గాగుర్తింపు పొందనున్న ఈకేంద్రం, ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు అవుతోంది. దీని ప్రధాన లక్ష్యం 133 క్యూబిట్ల క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్2)ను నెలకొల్పడం. ఐబీఎం, టీసీఎస్ వంటి గ్లోబల్ సంస్థలసహకారంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా పరిశోధకులు, స్టార్టప్‌లకు అత్యాధునిక సాంకేతిక వనరు లు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్ట్ వల్ల దాదాపు లక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.క్వాంటం కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు క్రిప్టో గ్రఫీ వంటి రంగాలలో యువతకు శిక్షణ ఇచ్చి ప్రపంచ స్థాయినిపుణులుగా తీర్చిదిద్దుతారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమే!

పశ్చిమాసియా ఘర్షణ కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా,ప్రపంచ ఆర్థికవ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఈఘర్షణలు నేడు ప్రతిదేశపు వంటింటి బడ్జెట్‌ను,పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తు న్నాయి.ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది.

- ఎం. సి. సుదర్శన్, హైదరాబాద్

### బాధితులకు ఉపశమనం

ప్రకృతి విపత్తులు ఊహించే సమయంలోనే కాకుండా ఎప్పుడైనా సంభవించి జన జీవితం అతలాకుతలం అవుతుంది. దీనికి తోడు తుఫానుకు, అగ్ని ప్రమాదాలకు నివాస గృహాలు పోయి గూడులేక, పనులు స్తంభించి కుటుంబాల రోదనతో బాధ వర్ణనాతీతం. ప్రభుత్వ పరిహారం అందేలోపున రిజర్వ్ బ్యాంక్ ప్రభావిత ప్రాంతాల అభ్యర్థులకు వారు అడగకముందే రుణ ఉపశమన చర్యలు అమలుచేయొచ్చునని మార్గదర్శకాలు వెలువడినవి. ఈ నిర్ణయం బాధలతో ఉన్న వారిని దయతో,బ్యాంకులు ఆదుకోవడం మానవత్వం తో తీసుకున్న ఉత్తర్వు. దీనితోపాటు బ్యాంకుల సేవలను తాత్కాలిక ప్రాంగణం నుండి చేస్తారు. ఇంటిని పునర్నిర్మాణం చేయుటకు బాధితులకుఎంతో ఉపశమనం కల్గించే ఈవిషయం హర్షదయకం.

- బొల్లోజు మేఘానాదం, విశాఖపట్నం

### ఎఐ అంటే భయం

అమెరికా కంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేనే భయం చాలా పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు, తెలివైన వాళ్ళు ,మోసగాళ్లు, అగ్రవర్ణాలు ఉన్న అద్భుతమైన ప్రదేశమే అమెరికా. స్వేచ్ఛా విహంగాల పతంగం అక్కడే బాగా ఎగురుతుంది. అలాంటి ఆ స్వేచ్ఛ వాతావరణంలో నిర్భయత్వానికి చోటు చాలా తక్కువ. ఎప్పుడు ఎవడు ఏ ఆయుధంతో ఎటాక్ చేస్తాడో అనే భయం ప్రతి వాళ్లలోనూ ఉంటుంది. అలాఎటాక్ చేయడానికి, కుదిరితే చంపేయడానికి పెద్ద కారణాలేమీ ఉండవు. శత్రుత్వం, విరోధం, ద్వేషంఏమీ ఉండదు. కేవలం సరదాలగ్గరీగా బ్రతకడానికి తనకు చేతనైతే దొరికిన వాడిని చంపి డబ్బు తీసుకోవాలనే ఒక ప్రయత్నం. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటే అలా అనిపించలేదు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### పెరిగిన వాణిజ్య సిలిండర్ల ధర

వాణిజ్య సిలిండర్ గ్యాస్ కొరత పేరుతో హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు రేట్లు పెంచి సాధారణ మానవుడి నడ్డి విరుస్తున్నారు. గ్యాస్ సరఫరా ఎలా ఉన్న రెట్లు మాత్రం పెంచారు. ఎప్పుడైనా పరిస్థితుల దృశ్య రెట్లు పెంచడమే కానీ తగ్గించడం మాత్రం అస్సలు ఉండదు కదా. ఇలాంటిది అమాంతం రెట్లు పెంచడం అనేది ప్రభుత్వాల చేతుల్లో లేదా అధికారుల చేతిలో ఉండాలి గాని యాజమానుల ఇష్టారీత్య ఉండకూడదు. వాణిజ్య సిలిండర్ ధర పెరిగి మూడువేలకు మూడువందలకు చేరుకుంది. ఈ రేట్లు వినియోగదారుడిపై భారం మోపుతుంది.

-ఎన్. రామస్వామి, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# అధిక ఉష్ణంతో మనుగడకు ముప్పు!

**ఎల్‌నినో ప్రభావంతో ఋతుపవనాలు ఆలస్యమవుతాయి. దీనివల్ల ఎండలు సాధారణం కంటే ఎక్కువకాలం కొనసాగుతాయి. వర్షపాతం తగ్గిపోవడం లేదా ఆలస్యమవడం వల్ల రైతులు విత్తనాలు వేయడంలో ఇబ్బందులు పడతారు. విత్తనాలు ఆలస్యమైతే పంటల పెరుగుదల ప్రభావితం అవుతుంది. దిగుబడులు తగ్గిపోవడం వల్ల రైతుల ఆదాయం పడిపోతుంది. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బావులు ఎండిపోవడం, నీటి మట్టాలు పడిపోవడం సాధారణమవుతోంది. పట్టణాల్లో నీటి సరఫరా సంక్షోభంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి.**



మేకిరి దామోదర్

తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ఎండాకాలం తీవ్రత రోజు రోజుకీ పెరుగుతోంది. గతంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగడం, ఉక్కపోత అధికమవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా ఈసారి పగటి వేడి మాత్రమే కాదు, రాత్రి వేడి కూడా పెరగడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. సాధారణంగా చల్లదనాన్ని ఇస్తూ శరీరానికి విశ్రాంతినిచ్చే రాత్రులు కూడా ఇప్పుడు వేడి గాలులతో నిండిపోతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.5 నుంచి 6.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదవడం వేడి రాత్రుల తీవ్రతను సూచిస్తోంది. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, గ్రీన్‌హౌస్ వాయువుల పెరుగుదలకలిసి ఈ పరిస్థితిని తీవ్రమయ్యేలా చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిడుగులు, నీటి ఎద్దడి, వ్యవసాయ నష్టాలు వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది. 2023లో దేశవ్యాప్తంగా పిడుగుల వల్ల 2,560 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 99 మంది, తెలంగాణలో 47 మంది మరణించడం అప్రమత్తత ఎంత అవసరమో చెబుతోంది. ఎల్‌నినో ప్రభావంతో ఋతుపవనాలు ఆలస్యమవుతాయి. దీనివల్ల ఎండలు సాధారణం కంటే ఎక్కువకాలం కొనసాగుతాయి. వర్షపాతం తగ్గిపోవడం లేదా ఆలస్యమవడం వల్ల రైతులు విత్తనాలు వేయడంలో ఇబ్బందులు పడతారు. విత్తనాలు ఆలస్యమైతే పంటల పెరుగుదల ప్రభావితం అవుతుంది. దిగుబడులు తగ్గిపోవడం వల్ల రైతుల ఆదాయం పడిపోతుంది. ఇది వ్యవసాయ రంగానికి మాత్రమే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం దేశంలో సుమారు 60 కోట్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఒక్క డిగ్రీ ఉష్ణోగ్రత పెరిగినా భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. బావులు ఎండిపోవడం, నీటి మట్టాలు పడిపోవడం సాధారణమవుతోంది. పట్టణాల్లో నీటి సరఫరా సంక్షోభంగా మారుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణ మార్పులు జీవ వైవిధ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పశ్చిమ కనుమలు, హిమాలయాలు, సుందర్బన్ల వంటి ప్రాంతాల్లో అనేక జాతులు అంతరించిపోతున్నాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇవి ప్రకృతి సమతౌల్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇక వ్యవసాయ దిగుబడుల విషయంలో పరిస్థితి మరింత ఆందోళనకరం. పరిశోధనల ప్రకారం వరి



దిగుబడులు 2050 నాటికి 20శాతం, 2080 నాటికి 47శాతం వరకు తగ్గే అవకాశం ఉంది. గోధుమ దిగుబడులు కూడా19 శాతం నుంచి 40 శాతంవరకు పడిపోవచ్చు. దీని వల్ల కోట్లాది ప్రజలు ఆహార భద్రత సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుంది. ధరలు పెరగడం, సరఫరా లోపాలు వంటి సమస్యలు మరింత తీవ్రమవుతాయి. అధిక ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయి. ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుదలతో వడదెబ్బ ముప్పు గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, శారీరక శ్రమ చేసే కార్మికులు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. పసిపిల్లల్లో డీహైడ్రేషన్ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. శరీరంలో నీరు తగ్గిపోవడం వల్ల సోడియం స్థాయిలు పెరిగి ఫిట్స్ వచ్చే ప్రమాదం ఉంది. పెద్దల్లో తలనొప్పి, వాంతులు, అలసట, అధిక చెమటలు, కొన్నిసార్లు చెమటలు రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి వడదెబ్బ సంకేతాలుగా పరిగణించాలి. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి వేడి మరింత ప్రమాదకరం. శరీరం వేడిని తట్టుకోలేకపోతే అపస్మారక స్థితి కూడా రావచ్చు. కాబట్టి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. ఈ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చాలా కీలకం. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల నీరు తాగాలి. నిమ్మరసం, ఉప్పు, చక్కెర కలిపిన ద్రావణాలు తీసుకోవడం ద్వారా శరీరంలో ఎలక్ట్రోలైట్ సమ తౌల్యాన్ని కాపాడుకోవచ్చు. పసిపిల్లలకు తరచూ తల్లిపాలు ఇవ్వాలి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలి. ఇటీవల వేడి రాత్రులు కూడా పెద్ద సమస్యగా మారాయి. పట్టణాల్లో అర్బన్ హీట్ ఐలాండ్ ప్రభావం వల్ల రాత్రివేళ కూడా వేడి తగ్గడం లేదు. తారు రోడ్లు, కాంక్రీట్ భవనాలు పగటిపూట వేడిని నిల్వ చేసి రాత్రివేళ విడుదల చేస్తాయి. గాలి ప్రసరణకు అడ్డంకులు ఏర్పడటంతో వేడి నేల దగ్గరే నిలిచిపోతుంది. ఈ సమస్య ను తగ్గించేందుకు చెట్ల పెంపకం చాలా అవసరం. శీతల పై కప్పులు, ప్రతిఫలించే నిర్మాణ పదార్థాలు, గాలి ప్రసరణకు అనుకూల నగర ప్రణాళికలు అమలు చేయాలి. ఇవి రాత్రి వేడిని తగ్గించడంలో సహాయపడతాయి. ఎండల తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న ఈ సమయంలో ప్రభు త్వం, ప్రజలు కలిసి బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వాతావరణ మార్పులను అంచనా వేసి ముందస్తు చర్యలు తీసుకోవాలి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం, నీటి సంరక్షణపై దృష్టి సారించడం అత్యవసరం. ప్రజలు వ్యక్తిగత స్థాయిలో కూడా జాగ్రత్తలు పాటించాలి. ఎవరి ప్రాణాలు వారి చేతుల్లోనే ఉన్నట్లు తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లకుండా ఉండడం, ఆరోగ్య సమస్య లను నిర్లక్ష్యం చేయకపోవడం ద్వారా ప్రాణాలను కాపాడు కోవచ్చు. ఈ వేసవిలో నిర్ణీత ఉష్ణోగ్రత దాటాక పెరిగిన ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత ప్రాణాలకు పరీక్షగా

# ప్రతిభకు బాటలు ప్రభుత్వ బడులు

ఎల్లబోయిన వెంకటేశ్వర్లు

ఇటీవలి కాలంలో విద్యా రంగంలో గమనించదగిన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన 10వ తరగతి ఫలితాలు ఒక కొత్త దిశను సూచిస్తున్నాయి. చాలా కాలంగా కార్పొరేట్ పాఠశాలలే నాణ్యమైన విద్యకు ప్రతీకగా భావించబడుతున్నప్పటికీ, ఈసారి ప్రభుత్వ పాఠశాలలు సాధించిన ఫలితాలు ఆ భావనను సవాల్ చేస్తున్నాయి. 600 మార్కులకు 580కి పైగా స్కోర్లు సాధించిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచే రావడం, ఈ మార్పుకు స్పష్టమైన సంకేతం. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అనగానే తల్లిదండ్రుల్లో అనుమానం ఉండేది. సదుపాయాల కొరత, బోధనలో నాణ్యత లోపం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వంటి విమర్శలు వినిపించేవి. అయితే, ఇటీవల ప్రభుత్వాలు తీసుకున్న సంస్కరణలు ఈ పరిస్థితిని పూర్తిగా మార్చాయి. డిజిటల్ క్లాస్‌రూమ్స్, ఇంగ్లీష్ మీడియం బోధన, పాఠ్య ప్రణాళికలో మార్పులు, ఉపాధ్యాయుల శిక్షణ ఈ అన్ని అంశాలు కలసి ప్రభుత్వ పాఠశాలల స్థాయిని పెంచాయి. ప్రత్యేకంగా చెప్పాల్సింది ఉపాధ్యాయుల పాత్ర. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, వారి బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమించేలా మార్గనిర్దేశనం చేస్తున్నారు. ఇది కార్పొరేట్ పాఠశాలల్లో సాధ్యంకాని అంశం. అక్కడ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండటం వల్ల వ్యక్తిగత శ్రద్ధ తగ్గిపోతుంది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి అభివృద్ధి ఒకలక్ష్యంగామారింది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం తల్లిదండ్రుల దృక్పథంలో వచ్చిన మార్పు.



గతంలో డబ్బు పెట్టితేనే మంచి విద్య" అనే భావన బలంగా ఉండేది. ఇప్పుడు ఆ భావన క్రమం గా కూలిపోతోంది. భారీ ఫీజులు చెల్లించడం కంటే, నాణ్యమైన బోధన, మంచి ఫలితాలు ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం పోటీ పెరుగుతోంది. ఇది కేవలం విద్యార్థుల విజయమే కాదు, ప్రభుత్వ విధానాల విజయమూ. ఉచిత పుస్తకాలు, యూనిఫార్ములు, మధ్యాహ్న భోజనం వంటి పథకాలు విద్యార్థుల హాజరును పెంచడంలో కీలక పాత్ర పోషించాయి. అంతేకాకుండా, మౌలిక వసతుల అభివృద్ధి క్లాస్‌రూమ్స్, టాయిలెట్స్, డిజిటల్ పరికరాలు విద్యార్థులకు మంచి వాతావరణాన్ని కల్పించాయి. అయితే ఈ విజయాన్ని నిలబెట్టుకోవడం అంతే ముఖ్యమైన సవాలు. ఫలితాలు మెరుగుపడ్డాయి కాబట్టి అక్కడే ఆగిపోవడం సరైంది కాదు. నిరంతర మెరుగుదల అవసరం.పాఠ్యప్రణాళికను కాలానుగుణంగా నవీకరించడం, ఉపాధ్యాయులకు మరింత శిక్షణ ఇవ్వడం, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడం ఈ అంశాలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా, కేవలం మార్కులకే పరిమితం కాకుండా, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సామాజిక బాధ్యత వంటి అంశాలను కూడా అభివృద్ధి చేయాలి. ఇంకా ఒక కీలక అంశం ఈ మార్పు సమాజంలో సమానత్వాన్ని బలోపేతం చేయడం. మంచి విద్య అందరికీ అందుబాటులోకి రావడం, ఆర్థిక అసమానతలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇది భవిష్యత్తులో సమాజ అభివృద్ధికి బలమైన పునాది అవుతుంది. మొత్తానికి, ప్రస్తుతం కనిపిస్తున్న మార్పులు ఒక సానుకూల సంకేతం. ప్రభుత్వ పాఠశాలలు కేవలం ప్రత్యామ్నాయం కాదు, ఇప్పుడు ఒక శక్తివంతమైన ఎంపికగా మారుతున్నాయి. ఈ దిశలో తీసుకుంటున్న చర్యలు కొనసాగితే, భవిష్యత్తులో ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలపడటం ఖాయం. విద్యా రంగంలో ఈ మార్పుకేవలం ఒక ట్రెండ్ కాదు ఇది ఒక పరివర్తన. ఈ పరివర్తనను

# భూదాన భూముల్లో వెలుగునీడల జంజాటం!

దిలీప్.వి

చట్టాలు, ప్రభుత్వాలు, ప్రభుత్వ అధికారులు పేదల సమస్యల పట్ల పనిచేసేటప్పుడు చూపించే ఉదాసీన నిర్లక్ష్యపు వైఖరికి భిన్నంగా న్యాయం పేర ఇవే వ్యవస్థలు పేదల మీద ఎంత వికృతంగా విరుచుకుపడి చట్టాన్ని అమలుచేస్తున్నామని చేసే ప్రకటనలు ఎంత జుగుప్సను, వ్యవస్థలపట్ల అసహ్యాన్ని కలిగిస్తాయో. ఏదో యుద్ధంలో బాంబులు పడితే చెల్లాచెదురై చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్టుగా ఉన్న ఆ ప్రాంతాన్ని చూస్తే ఎంతటివారి హృదయాలనైనా కరిగిస్తుంది. గత నెల ఫిబ్రవరి 24వ తారీఖున ఉన్నపళంగా ఏదో యుద్ధానికి వచ్చినట్టు వేల మంది పోలీసు బలగాలను వెంటపెట్టుకుని వచ్చి ఉదయం 6గంటలకే సుమారుగా 50బుల్డోజర్ల ద్వారా గంటల్లో ఇండ్లను నేలమట్టం చేసి ఈ ప్రభుత్వం ఘనకార్యం చేసి నట్టు చెప్పుకుంటున్నది. అధికారులు వారేదో కబ్జాదారుల నుండి భూములను కాపాడినట్టు వారికి వారే సర్టిఫికెట్లు ఇచ్చుకున్నారు. గ్రామీణ పేదల సంఘం గత నాలుగు ఐదు దశాబ్దాలుగా వివిధ ప్రాంతాలలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను భూమిలేని నిరుపేదలకు ఇప్పించడానికి,గూడు లేని పేదలకు నివాసాలు ఏర్పాటు చేసుకోడానికి భూముల్ని వ్వాలని వివిధ రకాలుగా ఉద్యమాలు చేస్తూ పేద ప్రజలకు భూమి, నివాస స్థలాలు ఇప్పించడానికి కృషిచేస్తున్నది. ఈ క్రమంలో ఖమ్మం పట్టణం కేంద్రానికి అనుకుని ఉన్న వెలుగుమట్ల ప్రాంతంలో 147, 148, 149 సర్వే నెంబర్ల గల భూమి భూదానోద్యమ కర్త వినోబా భావే పిలుపుతో ఒకప్పటి భూస్వాములు ఇచ్చినటువంటి భూదాన భూములు ఉన్నాయని వాటిలో పట్టణంలో వివిధ రకాల పనులు చేస్తూ అద్దె ఇండ్లలో పనిచేస్తున్న పేదలకు ఇవ్వండని ఈ సంఘం ఆధ్వర్యంలో 2014 జనవరిలో దరఖాస్తులు పెట్టుకుంటే భూదాన్ బోర్డు వారు ప్రొసీడింగ్స్ ఇచ్చి లేఔట్ ఇవ్వడమైనది. ఆ ప్రొసీడింగ్స్ అమలులోకి తెచ్చి అక్కడ నివాసం ఉండటానికి భూదాన్ బోర్డు నుండి పత్రాలు పొందిన పేదలందరికీ నివాస హక్కులు ఇవ్వాలని అధికారులను ఎన్ని సార్లు వేడుకున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సుమారుగా 400 కుటుంబాలు 2018 లో మొదటగా అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అది క్రమంగా నేడు 1000కుటుంబాల నివాసాల వరకు వెళ్లింది. ఈ పేదలు చాలాసార్లు కోర్టులకు కూడా వెళ్ళడం జరిగింది. కోర్టు కూడా జోక్యం చేసుకోవద్దని చెప్పింది కానీ స్పష్టమైన తీర్పు ఇవ్వకపోవడంతో ఆ పేద ప్రజలు అక్కడే నివాసం ఉంటూ పొట్టకూటికోసం పట్టణంలో చుట్టూ ప్రాంతాలలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తు న్నారు. ఈ క్రమంలో ఆ ప్రజలు తమకు కనీస సౌకర్యాలు కల్పించమని, ఇండ్లు మంజూరు చేయమని పలుమార్లు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గత ప్రభుత్వం కూడా ఒకసారి వీరిని వెళ్లగొట్టాలని చూసినప్పటికీ ఆ బాధితులు గట్టిగా నిలబడటంతో వెనక్కి తగ్గారని చెప్పారు. అంతేకానీ అక్కడి ఆ ఇండ్లలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన కనీసంమౌలిక సదుపాయాలైన మంచినీటిని, విద్యుత్తును అందించడానికి కూడా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఎటువంటి చొరవ చూపకపోవడం పేద ప్రజల జీవితాల పట్ల పాలకులకు, అధికారులకు ఉండేటటువంటి నిర్లక్ష్య



వైఖరికి అద్దం పడుతుంది. ఆ ప్రజలే వారు సొంతంగా నీళ్ళ ట్యాం కర్‌తో నీళ్ల తెచ్చుకోవడం, జనరేటర్ పెట్టుకుని లేదా సోలార్ దీపాలు పెట్టుకుని అక్కడ బతుకీడుస్తున్నారు.ఐతే ఇక్కడ నివాసం ఉంటున్న ప్రజలను ఇక్కడ ఉండే అధికా రం లేదంటూ వెళ్లగొట్టడానికి ప్రయత్నించిన ప్రభుత్వాలు ప్రతిసారి ఎన్నికల్లో వీరి ఓట్లను వేయించుకుని అధికారం లోకి వచ్చినవే. ఇప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం గుడిసెలు కూలగొట్టాక మేము మీకు అండగా ఉంటామని ప్రకటిస్తున్న ప్రస్తుత ప్రతిపక్షం రెండు కూడా ఈ వెలుగు మట్ల ప్రజల దగ్గరికి వచ్చి ప్రచారం చేసి ఎన్నికల్లో ఓట్లు అడుక్కున్నప్పుడు వీరు అనధికారికంగా ఉంటున్నారనే విషయం ఈ పాలకులకు లేదా? సరిగ్గా కలెక్టర్ కార్యా లయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రజలు నిత్యం వందల సార్లు వారికి నీళ్లు, కరెంట్ ఇవ్వమని అప్లికేషన్లు పెట్టుకుని, ధర్నాలు చేసినప్పుడు ఈ ప్రజలు ఇక్కడ ఎట్లా నివాసం ఉంటున్నారు. వారు ఎవరు అని వారితో మాట్లా డాల్సిన అవసరం, బాధ్యత ఈ అధికారులకు లేదా? నిజం గానే ఈ ప్రజలు అక్రమంగా నివాసం ఉంటున్నారనిభావిస్తే గత ఎనిమిది సంవత్సరాలుగా అధికారులు ఈ పేద ప్రజల తో మాట్లాడి ఇక్కడ నుండి మర్యాదగా వారిని తరలించడా నికి ప్రయత్నమే చేయలేదు ఎందుకు? అత్యంత నిర్దాక్షిణ్యంగా, అమానవీయంగా ఇళ్ళు కూలకొట్టించిన ప్రభుత్వం అధికారులతో అసలు అక్కడ ఉండటానికి ఎవరికి హక్కే లేదని అబద్ధాలు మాట్లాడిస్తున్నారు. అధికారులు భుకాయి స్తున్నారు కదా! మరి అక్కడ అప్లికేషన్లు పెట్టుకున్న 120మంది బాధితుల్లో 60మందికి ఇంటి నెంబర్లు ఎట్లా కేటాయించారు. మిగతా వారి ఇంటి నెంబర్లు బ్లాకులో ఎందుకు ఉంచారు. ఈ సంఘటన జరిగిన వెంటనే కొంత మంది బాధితుల ఫోన్లకు ఇంటి పన్ను కట్టమని ఫోన్లకు సందేశాలు వచ్చాయని చెపుతున్నారు. అంటే అక్కడ నివా సం ఉంటున్న పేదలు నివాసం ఉండటానికి వారికి హక్కు ఉన్నదన్నట్టే కదా. ప్రజలకు హక్కులేకనా లేదా ప్రభుత్వం కావల్సుకుని వారికి గల హక్కును నిరాకరిస్తూ బలవంతం గా వారిని ఎల్లగొట్టే కుట్ర చేసిందని అర్థమవుతుంది. నిజం గానే ప్రభుత్వం ఆ భూమిని రక్షించడానికి లేదా ఇంకేదన్నా ప్రజాప్రయోజనంకోసం ఉపయోగిద్దాం అనుకుంటే ఆ ప్రజలతో మాట్లాడి నోటీసులు ఇచ్చి ఆ తర్వాత ఇటువంటి చర్యకు దిగితే బాగుండేది కదా. అయినా వారిని అట్లా యెల్లగొట్టడానికి వారేమీ దురాక్రమణదారులు కూడా కాదు కదా. కనీసం ఇంట్లో ఉన్న పప్పులు,ఉప్పులు ఏవీ తీసుకునే వీలు లేకుండా తెల్లవారి తెల్లవారే ఆ వెలుగుమట్ల ప్రజల జీవితాల్లో నాలుగు గంటల్లో చీకట్లు నింపిన ప్రభుత్వం తమది ప్రజా ప్రభుత్వం ఎట్లా సమర్థించుకుంది. నిజానికి 1951లో వినోబాభావే ప్రారంభించిన భూదాన ఉద్యమంలో భాగంగా ఇచ్చిన భూములన్నీ కూడా భూమిలేని పేదలకు భూమి ఇచ్చి సమాజంలో సామాజిక సమానత్వాన్ని సాధించాలనే ప్రధాన ఉద్దేశ్యంతో జరిగిన ఉద్యమం. భూమి లేని పేదలు వ్యవసాయం చేసుకోడానికి, గూడు లేని వారికి నివాసం కల్పించడానికి అనే లక్ష్యంతో ఈ భూదాన ఉద్య మాల్లో భూములు సేకరించడం జరిగింది. ఈ భూములకు ప్రభుత్వం ఒక ట్రస్టీలాగ ఉండవలసిందే కానీ ఈ భూము లపై ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేవు. దానికి ఉన్న అధికారమల్లా ఈ భూములను దురాక్రమణల నుండి భూ కబ్జాదారులనుండి రక్షించడం మాత్రమే. ఈ భూముల ను ఎట్టి పరిస్థితులలో పేదల కోసం ప్రజాప్రయోజలకోసం మాత్రమే కేటాయించాల్సిన అవసరం ఉంది. మరి అటువం టప్పుడు ఈఖమ్మం పట్టణం కేంద్రంలోని వెలుగుమట్ల ప్రాం తంలో ఉన్న ప్రజలు వందకు వంద శాతం అర్హులే కదా. ఈసంఘటన జరిగిన తరువాత అర్హులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయించి ఇండ్లు కట్టిస్తామని ఆప్రాంత మంత్రి పత్రికల ముందు టీవీల ముందుప్రకటిస్తున్నారు. అసలు నిజంగా ప్రభుత్వానికి ఆ ఉద్దేశమేఉంటే అక్కడే సర్వేచేసి అర్హులైన వారిని ఉంచి మిగతావారిని చట్టప్రకారం వెళ్లగొట్టే

4-5Pg5.qxd:4-5Pg5.qxd 1/1/02 6:07 AM Page 1



# అంతరిక్షయానంలో 'మిషన్ దృష్టి'

## దేశ సాంకేతిక సామర్థ్యానికి ఇది గీటురాయి: ప్రధాని మోడీ

## ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ ఉపగ్రహ ప్రయోగం సక్సెస్



**న్యూఢిల్లీ, మే 3:** భారతదేశ అంతరిక్ష ప్రయాణంలో మిషన్ దృష్టి ఒక ప్రధాన మైలురాయి అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం ప్రశంసించారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించడం, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం పట్ల దేశ యువతకున్న అభిరుచిని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. 'పోస్ట్ ఆన్ ఎక్స్'లో ప్రధాని మోడీ ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న బృందాన్ని అభినందిస్తూ, ఈ విజయం భారత్‌లో పెరుగుతున్న సాంకేతిక సామర్థ్యాలను నొక్కి చెబుతోందని అన్నారు. "గెలాక్సీఐ చేపట్టిన మిషన్ దృష్టి మన అంతరిక్ష ప్రయాణంలో ఒక ప్రధాన విజయం. ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ ఉపగ్రహం, భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేటు ఉపగ్రహం విజయవంతంగా ప్రయోగించబడటం, ఆవిష్కరణలు, దేశ నిర్మాణం పట్ల మన యువతకున్న అభిరుచికి నిదర్శనం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ విజయవంతమైన ప్రయోగానికి గాను, "గెలాక్సీ వ్యవస్థాపకులకు, యావత్ బృందానికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు," అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలిపారు.

స్పేస్ఎక్స్ రాకెట్ ద్వారా ప్రయోగించబడిన భారతీయ స్టార్టప్ 'దృష్టి' ఉపగ్రహం బెంగళూరుకు చెందిన అంతరిక్ష స్టార్టప్ గెలాక్సీ 'మిషన్ దృష్టి' ఉపగ్రహాన్ని ఆదివారం కాలిఫోర్నియా నుండి స్పేస్ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. కంపెనీ ప్రకటన ప్రకారం, బెంగళూరుకు చెందిన స్టార్టప్ సంస్థ 'గెలాక్స్ఐ' రూపొందించిన 'మిషన్ దృష్టి' ఎలక్ట్రో ఆప్టికల్, సింథటిక్ ఎపర్చర్ రాడార్ సెన్సర్ల సాంకేతికతో పనిచేస్తుంది.

ప్రపంచ అంతరిక్ష చరిత్రలో ఈ తరహా టెక్నాలజీతో పనిచేసే మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషం. సాధారణ ఉపగ్రహాలు కేవలం వెలుతురు ఉన్నప్పుడు మాత్రమే స్పష్టమైన చిత్రాలను తీయగలవు. అయితే 'మిషన్ దృష్టి' మాత్రం పగలు, రాత్రి అనే తేడా లేకుండా వాతావరణం ఎలా ఉన్నా అత్యంత స్పష్టమైన చిత్రాలను పంపే సామర్థం కలిగి ఉంది. ప్రస్తుతం 'మిషన్ దృష్టి' ఉపగ్రహం పనితీరును పరిశీలించే ప్రక్రియపై దృష్టి సారించినట్లు గెలాక్స్ఐ సిఇఒ సుయశ్ సింగ్ తెలిపారు. ఆప్టోసార్ టెక్నాలజీ ద్వారా లభించే విభిన్నమైన డేటాపై ప్రపంచవ్యాప్తంగా అప్పుడే ఆసక్తి మొదలైందని పేర్కొన్నారు.

ద్వంద్వ ప్రయోజన భూ పరిశీలన ఉపగ్రహంగా, ఈ మిషన్ రక్షణ, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, సముద్ర పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల ప్రణాళిక వంటి రంగాలలో ఉపయోగపడుతుంది.

ఇస్రో తన ఇటీవలి వార్షిక నివేదికలో పేర్కొన్న 29 క్రియాశీల భూ పరిశీలన ఉపగ్రహాలతో సహా, భారతదేశం విస్తృత కార్యక్రమాలకు ఈ ఉపగ్రహం తోడ్పాటు అందిస్తుందని కూడా భావిస్తున్నారు. గెలాక్సీఐ 2030 నాటికి మిషన్ దృష్టిని 10 ఉపగ్రహాల సమూహంగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది, తద్వారా భారతదేశం కోసం ఒక పటిష్టమైన, సార్వభౌమ భూ పరిశీలన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది.



## విదేశ పర్యాటకులకు ఆరోగ్యబీమా తప్పనిసరి

**బ్యాంకాక్, మే 3:** విదేశీ పర్యాటకులను ఎక్కువ ఆకర్షించే థాయ్‌లాండ్‌కు వెళ్లే వారికి ఆరోగ్య బీమా తప్పనిసరి కానుంది. దేశంలోకి అడుగుపెట్టే పర్యాటకులు, విదేశీ కార్మికులు, ఇతర సందర్శకులందరికీ ఆరోగ్య బీమాను తప్పనిసరి చేయాలన్న ప్రతిపాదనను థాయ్ ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ నిర్ణయంతో దేశ ఆరోగ్య వ్యవస్థపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. విదేశీ రోగులు ఆసుపత్రుల్లో చికిత్స పొంది, బిల్లులు చెల్లించకుండా వెళ్తున్న ఉదంతాలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని థాయ్ పబ్లిక్ హెల్త్ మంత్రి పట్టానా ప్రాంఫాట్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లోని వైద్యశాలలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకే బీమాను తప్పనిసరి చేయాలని భావిస్తున్నట్లు వివరించారు. ఈ కొత్త నిబంధన అమల్లోకి వస్తే, పర్యాటకులు, విదేశీ కార్మికులు, సరిహద్దుల గుండా స్వల్పకాలానికి వచ్చేవారితో సహా అందరికీ ఇది వర్తిస్తుంది. అయితే, పర్యాటకులను నిరుత్సాహ పరచకుండా ఉండేందుకు బీమా ప్రీమియంలను సాధ్యమైనంత తక్కువగా ఉంచుతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. థాయ్‌లాండ్‌ను ఒక ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పట్టానా తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదన సమీక్ష దశలో ఉంది. ఒకవేళ ఇది అమలైతే, థాయ్‌లాండ్ వెళ్లే భారతీయులతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులు తమ ప్రయాణానికి ముందే తప్పనిసరిగా ఆరోగ్య బీమా పాలసీని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

## హార్ముజ్‌ను దాటి విశాఖను చేరుతున్న స్వరశక్తి ట్యాంకర్!

**న్యూఢిల్లీ, మే 3:** ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా దాదాపు రెండు వారాలుగా నిలిచిపోయిన నౌకల రాకపోకల మధ్య భారత్‌కు భారీ ఊరట లభించింది. ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశానికి ఊపిరినిస్తూ.. 46,313 మెట్రిక్ టన్నుల ద్రవరూప పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పీజీ)తో సర్వశక్తి అనే నౌక హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మే 2న ఈ కీలక జలమార్గాన్ని దాటిన ఈ నౌక, ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ప్రయాణిస్తూ విశాఖపట్నం దిశగా వస్తోంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, సర్వశక్తి నౌకలో 18 మంది భారతీయులతో సహా మొత్తం 20 మంది సిబ్బంది ఉన్నారు. ఈ నౌక మే 13న విశాఖపట్నం పోర్టుకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో జరిపిన ద్వైపాక్షిక చర్చల ఫలితంగానే ఈ నౌక ప్రయాణానికి మార్గం సుగమమైంది. ప్రయాణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, నౌక తన ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్‌ద్వారా భారత్, భారతీయ సిబ్బంది అని నిరంతరం ప్రసారం చేస్తూ ముందుకు సాగింది. ప్రాంతీయ సంఘర్షణల నేపథ్యంలో గత రెండు వారాల్లో హార్మూజ్ జలసంధిని దాటిన తొలి భారత అనుసంధాన ఇంధన ట్యాంకర్ ఇదే కావడం గమనార్హం.

# యుద్ధం ముగిసిందా! లేదా?

## అమెరికా 9 పాయింట్ల ప్రతిపాదన..

## దానిపై ఇరాన్ 14 ప్రతిపాదనలు

### హార్మూజ్ జలసంధి దిగ్బంధంపై వీడని పీటముడి



**టెహ్రాన్/వాషింగ్టన్, మే 3:** మధ్యప్రాచ్యంలో యుద్ధం ముగింపు పలకడానికి ఇరాన్ 14 పాయింట్లతో కొత్త ప్రతిపాదనలను అమెరికాకు పంపించింది. పాకిస్థాన్ ద్వారా ఈ ప్రతిపాదనలను అమెరికాకు పంపించినట్లు ఇరాన్ జాతీయ మీడియా వెల్లడించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు అమెరికా 9 పాయింట్లను ప్రతిపాదించింది. ప్రతిగా, ఇరాన్ 14 పాయింట్లతో తాజా ప్రతిపాదనలు పంపించింది. యుద్ధాన్ని అన్ని విధాలుగా ముగించాలని తాజా ప్రతిపాదనల్లో స్పష్టం చేసింది. లెబనాన్‌లో కూడా యుద్ధం ముగింపును ఇరాన్ కోరుకుంది. తమపై మళ్లీ దాడులు చేయవద్దని, సరిహద్దు ప్రాంతాల్లో అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవాలని, వివిధ దేశాల్లో స్తంభింప చేసిన ఇరాన్ ఆస్తులను విడుదల చేయాలని, ఇంధనం సహా వివిధ రూపాల్లో తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఆ ప్రతిపాదనల్లో స్పష్టం చేసింది. హార్మూజ్ జలసంధి దిగ్బంధనాన్ని ఉపసంహరించుకోవాలని పేర్కొంది. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ ఈ ప్రతిపాదనల్లో తెలిపింది. కాల్పుల విరమణ పొడిగింపు పేరుతో తాత్కాలిక సంధికి బదులు సమస్యను శాశ్వతంగా ముగించేలా సమగ్ర పరిష్కారాన్ని ఇరాన్ కోరింది. ముప్పై రోజుల్లో యుద్ధాన్ని ముగించాలని కోరింది. యుద్ధానికి ముగింపు పలకాలా లేక కొనసాగించాలా అనే నిర్ణయం ఇప్పుడు అమెరికానే తీసుకోవాలని ఇరాన్ తెలిపింది. యుద్ధానికి శాశ్వతముగింపు పలకడమే తమలక్ష్యమని పేర్కొంది. జాతీయ ప్రయోజనాలు, భద్రతను కాపాడుకోవడానికి తాము మాత్రం దేనికైనా సిద్ధంగానే ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

**కొత్తప్రతిపాదనలు అందాయి..సమగ్ర పరిశీలన తర్వాతేనిర్ణయం: ట్రంప్**

ఇరాన్‌తో ఒప్పందానికి సంబంధించిన కొత్తప్రతిపాదనలు తనకు వివరించారని, తుది ప్రతిని పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అదే సమయంలో టెహ్రాన్ దుందుడుకుగా ప్రవర్తిస్తే సైనిక చర్యకు వెనుకాడబోమని ఆయన గట్టిగా హెచ్చరించారు. ఫ్లోరిడా నుంచి మియామి వెళ్లే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో, చర్చలకు సిద్ధమంటూనే ఒత్తిడిని కొనసాగించే ద్వంద్వ వైఖరిని వాషింగ్టన్ అవలంబిస్తోంది. ఇరాన్‌పై తిరిగి దాడులు చేసే అవకాశాన్ని తోసిపుచ్చలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ అంశంపై తన ట్రూత్ సోషల్ ప్లాట్‌ఫామ్‌లో కూడా ట్రంప్ స్పందించారు. గత 47 ఏళ్లుగా ప్రపంచానికి, మానవాళికి ఇరాన్ చేసిన నష్టానికి ఇంకా తగిన మూల్యం చెల్లించలేదు. కాబట్టి వారు పంపిన ప్రణాళిక ఆమోదయోగ్యంగా ఉంటుందని నేను ఊహించలేనని ఆయన పోస్ట్ చేశారు. తమ ప్రతిపాదనను పాకిస్థాన్ ద్వారా ఇరాన్ అమెరికాకు పంపింది. ఈ డీల్‌కు అంగీకరిస్తే కీలకమైన హార్మూజ్ జలసంధిగుండా నౌకల రాకపోకలను పునరుద్ధరిస్తామని, అమెరికా దిగ్బంధనానికి ముగింపు పలుకుతామని ఇరాన్‌తెలిపింది. తమ అణు కార్యక్రమంపై చర్చలను తదుపరిదశకు వాయిదా వేయాలని ఇరాన్ కోరుతోంది. ఈ ప్రతిపాదనను ట్రంప్ గతంలో తిరస్కరించారు. దౌత్యపరంగా చర్చలకు కట్టుబడి ఉన్నామని, కానీ ఎలాంటి సైనిక చర్యనయినా స్పందించేందుకు, తాము సిద్ధమేనని ఇరాన్ అధికారులు స్పష్టం చేశారు.

## హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు

### 50కిపైగా మౌలిక సదుపాయాలు ధ్వంసం

**బీరూట్, మే 3:** ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) భీకర దాడులు నిర్వహించింది. ఈరోజు తెల్లవారుజామున జరిపిన ఈ దాడుల్లో 50కి పైగా కీలక మౌలిక సదుపాయాల కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. దక్షిణ లెబనాన్, బెకా వ్యాలీలోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఈ వైమానిక దాడులు జరిగినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. గత 24 గంటల్లోనే సుమారు 50 లక్ష్యాలపై దాడి చేశామని ఐడీఎఫ్ శనివారం ప్రకటించింది. ఈ వారాంతంలో మొత్తం 70 సైనిక నిర్మాణాలు, 50 మౌలిక సదుపాయాల సైట్‌లతో కలిపి 120 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు మరో నివేదిక పేర్కొంది. హెజ్బొల్లాకు చెందిన కమాండ్ సెంటర్లు, ఆయుధాగారాలు, సైనిక భవనాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. తమ దేశ పౌరులు, సైనికులపై దాడులను అడ్డుకోవడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు స్పష్టం చేసింది. ఆదివారం ఉదయం కూడా దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా



హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు, డ్రోన్లతో దాడులు చేసింది. మరోవైపు, ఇజ్రాయెల్ జరిపినదాడుల్లో 12 మందివరకు మరణించినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, మృతుల్లో ఎంతమంది పౌరులు, ఎంతమంది మిలిటెంట్లు ఉన్నారనే దానిపై స్పష్టత లేదు. దాడులకు ముందు పలు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరుపక్షాల దాడులు, ప్రతిదాడులతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## రీల్స్ పిచ్చి ముదిరి మృత్యు వాత

**లక్నో, మే 3:** సోషల్ మీడియాలో రీల్ కోసం ఐదుగురు యువకులు పాత నీటి ట్యాంక్‌పైకి ఎక్కారు. కిందకు దిగుతుండగా దాని మెట్లు విరగడంతో ముగ్గురు కిందపడ్డారు. వీరిలో ఒకరు మరణించగా, ఇద్దరు గాయపడ్డారు. వాటర్ ట్యాంక్‌పై చిక్కుకున్న మరో ఇద్దరు యువకులను హెలికాప్టర్ ద్వారా ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లోని సిద్ధార్థ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కాన్షీ రామ్ ఆవాసియ్ కాలనీకి చెందిన ఐదుగురు యువకులు రీల్ రికార్డ్ చేసేందుకు శనివారం మధ్యాహ్నం 1 గంటకు స్థానికంగా ఉన్న పురాతన వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కారు. రీల్ రికార్డ్ తర్వాత ఆ యువకులు కిందకు దిగేందుకు ప్రయత్నించారు. అయితే పాత మెట్లు విరిగిపోవడంతో ముగ్గురు యువకులు కింద పడ్డారు. వీరిలో సిద్ధార్థ్ అక్కడికక్కడే మరణించాడు. షాని, గోలు అనే ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు వాటర్ ట్యాంక్ మెట్లు విరిగిపోవడంతో మిగతా ఇద్దరు యువకులైన పవన్, కల్లు దానిపై చిక్కుకున్నారు. ఆ ఇరుకైన ప్రాంతానికి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం, అగ్నిమాపక సిబ్బంది చేరుకోలేకపోయారు. దీంతో ఇద్దరు యువకులు రాత్రంతా అక్కడే ఉన్నారు. ఈ నేపథ్యంలో భారత వాయుసేన సహాయాన్ని అధికారులు కోరారు. ఆదివారం తెల్లవారుజామున 5.30 గంటలకు సెంట్రల్ ఎయిర్ కమాండ్‌కు చెందిన ఐఏఎఫ్ ఎంఐ17 వీ5 హెలికాప్టర్ అక్కడకు చేరుకున్నది. పురాతన వాటర్ ట్యాంక్‌పై 16 గంటలుగా చిక్కుకున్న పవన్, కల్లును ఐఏఎఫ్ సిబ్బంది రక్షించారు.

## బాలివుడ్ నటుడు సుధేశ్‌కుమార్ కన్నుమూత

**ముంబయి, మే 3:** బాలివుడ్ సీనియర్ నటుడు సుధేశ్‌కుమార్ కన్నుమూసారు. 95 ఏళ్ల సుదేశ్‌కుమార్ 1950నుంచి 1970 వరకూ బాలివుడ్ రంగంలో విశేష ఖ్యాతిని ఆర్జించారు. శ్వాసకోస సమస్యలపై ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది డిశ్చార్జి అయిన తర్వాత ఇంట్లోనే కన్నుమూసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. గతనెల 27వ తేదీనే ముంబయిలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రిలో సుదేశ్‌ను చేర్పించారు. ఆ తర్వాత స్వయంగా ఆయన విజ్ఞప్తిమేరకే ఆయన్ను ఇంటికి తీసుకువచ్చి కుటుంసభ్యులు సపర్యలు చేస్తున్నారు. ఆయన భార్య జయా ధావన్ మాట్లాడుతూ ఆయన విజ్ఞప్తితోనే ఇంటికి తీసుకువచ్చి చికిత్స అందిస్తున్నామని, మెడికల్ యూనిట్‌ను కూడా మార్చినట్లు తెలిపారు. అయితే ఇంట్లోనే ఆయన తదుపరిరోజు కన్నుమూసినట్లు తెలిపారు.

## అనుమతిలేనిదే ఒక్క నౌకకూడా వెళ్లనివ్వం!: ఐఆర్‌జిసి



**టెహ్రాన్, మే 3:** హార్మూజ్ జలసంధిపై తమకు పూర్తి నియంత్రణ ఉందని, తమ అనుమతి లేకుండా స్నేహపూర్వక లేదా శత్రు దేశాలకు చెందిన ఏ నౌక కూడా ఆ మార్గం గుండా ప్రయాణించలేదని ఇరాన్ ఆర్మీ స్పష్టం చేసింది. ఈ జలసంధిని నియంత్రించడం తమకు ఉన్న సహజమైన హక్కు అని ఇరాన్ ఆర్మీ ప్రతినిధి మహమ్మద్ అక్రమినియా అన్నారు. ప్రస్తుతం ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్, దేశ సైన్యం సంయుక్తంగా హార్మూజ్ జలసంధిని పూర్తిస్థాయిలో నియంత్రిస్తున్నాయని ఆయన తెలిపారు. తమ బలగాల అనుమతి లేకుండా ఏ నౌకకూ ప్రయాణించే హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు. మరోవైపు, తమ నౌకలను అనుమతించాలంటూ వివిధ దేశాలు టెలెక్స్, లేఖల ద్వారా ఇరాన్‌ను అత్యవసరంగా అభ్యర్థిస్తున్నాయని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి హమీద్ ఘన్‌బారీ వెల్లడించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ హార్మూజ్ జలసంధిపై తన పట్టును బిగించింది. తమ భూభాగంపై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేసిన నేపథ్యంలో ఆ రెండు దేశాలకు చెందిన, వాటితో సంబంధం ఉన్న నౌకలపై ఇరాన్ నిషేధం విధించింది. ఇదిలా ఉంటే, పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధిలో ఒక కొత్త అధ్యాయం ప్రారంభం కాబోతోందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖొమైనీ అన్నారు. ఈ జలసంధి నిర్వహణకు త్వరలోనే ఒక కొత్త చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకువస్తామని, ఇది ఈ ప్రాంతంలోని అన్ని దేశాల అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో పెర్షియన్ గల్ఫ్ అమెరికా రహితంగా శాంతి, శ్రేయస్సుతో వర్ధిల్లుతుందని ఆయన పేర్కొన్నారు.

## నెదర్లాండ్స్ యువరాణుల హత్యకు కుట్ర!

### 33 యేళ్ల అనుమానితుడి అరెస్టు

**హేగ్,మే 3:** నెదర్లాండ్స్‌లో ఇద్దరు రాజకుమార్తెలపై హత్యకు కుట్ర పన్నారన్న ఆరోపణలతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసారు. డచ్ సింహాసనానికి వారసురాలైన యువరాణి కాథరినాఅమాలియా (22), ఆమె సోదరి యువరాణి అలెక్సియా (20)లే లక్ష్యంగా దాడికి ప్లాన్ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో హేగ్ నగరంలో 33 ఏళ్ల వ్యక్తిని అధికారులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రెండు గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక గొడ్డలిపై అలెక్సియా, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ మొస్సాద్, నాజీ నినాదమైన సీగ్ హీల్ వంటి పదాలు చెక్కి ఉండటం తీవ్ర కలకలం రేపింది. దీంతో పాటు అమాలియా, అలెక్సియా, బ్లడ్‌బాత్ (రక్తపాతం) అని రాసి ఉన్న చేతిరాత నోట్‌ను కూడా అధికారులు కనుగొన్నారు. ఈ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను పబ్లిక్ ప్రాసిక్యూషన్ కార్యాలయం తాజాగా వెల్లడించింది. నిందితుడి తరఫు న్యాయవాది కోర్టు విచారణకు ముందు వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. డచ్ రాజకుటుంబం కూడా ఈ ఘటనపై తక్షణమే స్పందించలేదు. యువరాణి అమాలియాకు భద్రతాపరమైన ముప్పు ఎదురవడం ఇది మొదటిసారి కాదు. 2022లో ఆర్గనైజ్డ్ క్రైమ్ ముఠాల నుంచి తీవ్రమైన బెదిరింపులు రావడంతో ఆమె ఆమ్‌స్టర్‌డామ్‌లోని విద్యార్థి వసతి గృహాన్ని విడిచిపెట్టి, దాదాపు ఏడాది పాటు స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో నివసించాల్సి వచ్చింది. తాజా ఘటనతో రాజకుటుంబ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఓట్ల లెక్కింపు సందర్భంగా అడ్డంకులకు బిజెపి యత్నం

### ఎన్నికల ప్రధాన అధికారికి డిఎంకె ఫిర్యాదు

**చెన్నై, మే 3:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ సెంటర్ల వద్ద అడ్డంకులు సృష్టించేందుకు బిజెపి కుట్రలు చేస్తోందని అధికార డిఎంకే ఆరోపించింది. పెద్దఎత్తున శాంతిభద్రతలకు ఆటంకం కలిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. కౌంటింగ్ ప్రక్రియ సమగ్రతను కాపాడేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా చూసేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది.

ఈ మేరకు డిఎంకే ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.ఎస్.భారతి ఎన్నికల ప్రధానాధికారికి ఆదివారంనాడు లేఖ రాశారు. బిజెపి, ఇతర రాజకీయల పార్టీలు కేంద్రంలోని అధికార పార్టీ సూచనల మేరకు కౌంటింగ్ సెంటర్ల వల్ల అవాంతరాలు సృష్టించేందుకు వ్యూహరచన చేస్తున్నట్టు తమకు విశ్వసనీయ సమాచారం ఉందని ఆ లేఖలో ఆర్ఎస్ భారతి పేర్కొన్నారు. కౌంటింగ్ బూత్‌లకు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలు, పార్టీ కార్యాలయాలు ఉన్న సున్నితమైన ప్రాంతాల్లో కూడా అవాంతరాలు సృష్టించే వీలుందని డీఎంకే నేత ఆరోపించారు. ఇందువల్ల పెద్దఎత్తున శాంతిభద్రతలక సమస్య తలెత్త వచ్చని, ఆ ప్రభావం స్వేచ్ఛగా, సజావుగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియపై పడవచ్చని పేర్కొన్నారు.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా తగినంత భద్రతా సిబ్బందిని నియమించాలని, ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని కట్టుదిట్టం చేయాలని ఎన్నికల ప్రధానాధికారిని ఆ లేఖలో కోరారు. తద్వారా ఎన్నికల ప్రక్రియ పవిత్రత, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకున్న విశ్వాసాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. మే 4న అసెంబ్లీ ఎన్నికల కౌటింగ్ జరిపి, ఫలితాలను ప్రకటించనున్నారు.

## సంక్షిప్తంగా..

### తోబుట్టువులను ఇటుకలతో కొట్టిచంపిన కన్న తల్లి!

**లక్నో,మే 3:** తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేసి ఇంటి లోపల నుంచి లాక్ వేసి పారిపోయిన ఉదంతం యూపిలో వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనలో పరారీలో ఉన్న పిల్లల తల్లిపై అనుమానం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మురాదాబాద్ మొహల్లాలో తాళం వేసి ఉన్న ఒక ఇంటి లోపల నలుగురు పిల్లల మృతదేహాలు పడి ఉన్నాయని శనివారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడకు చేరుకున్నారు. లోపల నుంచి లాక్ వేసి ఉన్న ఆ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించారు. తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేసినట్లు గమనించారు. మృతుల్లో ముగ్గురు బాలురు, ఒక బాలిక ఉన్నారు.

### విమానం డోర్ తెరిచి కిందకు దూకిన ప్యాసింజర్

**చెన్నై, మే 3:** షార్జాచెన్నై విమానం చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ కాగానే ఒక ప్రయాణికుడు ఎమర్జెన్సీ డోర్ తెరిచి కిందకు దూకడం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటనతో, తోటి ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు.




వేకువజామున షార్జా నుంచి ఎయిర్ అరేబియా విమానం ల్యాండ్ కాగానే, ట్యాక్సీవేపై కదులుతుండగా సదరు ప్రయాణికుడు బయటకు దూకాడు. పైలట్ గ్రౌండ్ సెక్యూరిటీని అప్రమత్తం చేశారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బంది వెంటనే స్పందించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ కోసం అతడిని పోలీసులకు అప్పగించారు. ఆ ప్రయాణికుడు కిందకు దూకినప్పుడు విమానం ఇంకా నెమ్మదిగా కదులుతూనే ఉంది. అతడికి ఏమీ కాలేదు. విమానానికి కూడా నష్టం జరగలేదని విమానాశ్రయ సీనియర్ అధికారి ఒకరు అన్నారు.

### 500 మెజార్టీ ఉంటే రీకౌంటింగ్‌కు డిమాండ్ చేయండి: మమత

**కోల్‌కతా, మే 3:** దేశవ్యాప్తంగా అందరూ ఆసక్తిగా చూస్తున్న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ మరికొద్ది గంటల్లో జరుగనుండటంతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. బిజెపి 500 నుంచి 700 ఓట్ల ఆధిక్యంలో ఉంటే ఆయా బూత్‌లలో కచ్చితంగా రీకౌంటింగ్ కోరాలని వారికి సూచించారు. ఆదివారంనాడు రాత్రంతా కౌంటింగ్ సెంటర్ల వద్దే ఉండాలని, అందువల్ల సోమవారం ఉదయమే కౌంటింగ్ సెంటర్లకు చేరే వీలుంటుందని చెప్పారు. 294 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడనుండటంతో పార్టీ నేతలు, కౌంటింగ్ ఏజెంట్లతో మమతాబెనర్జీ వర్చువల్ మీట్ జరిపారు. కౌంటింగ్ సమయంలో సమన్వయం, నిఘా అనేది చాలా ముఖ్యమని, కౌంటింగ్ సెంటర్లకు ఉదయమే కార్యకర్తలు చేరుకుని కలిసికట్టుగా పనిచేయాలని మమతా బెనర్జీ సూచించారు. బీజేపీకి ఎక్కడైనా 500 నుంచి 700, 1,000 ఓట్ల వరకూ మార్జిన్‌వస్తే రీకౌంటింగ్‌కు డిమాండ్ చేయాలని హితబోధచేసారు.

### అపార్టుమెంట్‌లో ఎసి పేలి తొమ్మిది మంది మృతి

**న్యూఢిల్లీ,మే 3:** దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని షాహదరా జిల్లా వివేక్ విహార్ ఫేజ్1లో ఉన్న ఓ నాలుగు అంతస్తుల నివాస భవనంలో ఈరోజు తెల్లవారుజామున ఎసి పేలిపోయి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది ప్రాణాలుకోల్పోయారు. మరోఇద్దరు గాయపడ్డారు. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈరోజు తెల్లవారుజామున భవనంలో మంటలు చెలరేగినట్లు సమాచారం అందింది. వెంటనే 14 ఫైర్‌ఇంజన్లు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. భవనంలోని రెండు, మూడు, నాలుగు అంతస్తుల్లో మంటలు వేగంగా వ్యాపించాయి. సుమారు రెండు గంటల పాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు.

### మందులోకి నీళ్లివ్వలేదని తొమ్మిదేళ్ల బాలుడి హత్య

**ఖాస్‌గంజ్, (యుపి), మే 3:** ఉత్తరప్రదేశ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యంలో కలిపేందుకు నీళ్లు తీసుకురాలేదన్న చిన్నకారణంతో 9 ఏళ్ల బాలుడిని బంధువే కాల్చిచంపాడు. కాస్‌గంజ్ జిల్లాలోని యాకుత్‌గంజ్ గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాకుత్‌గంజ్ గ్రామంలోని జస్వీర్ గోలా ఇంట్లో నామకరణ వేడుక జరుగుతోంది. ఈ కార్యక్రమానికి బంధువులు, గ్రామస్థులు హాజరయ్యారు. ఇదే సమయంలో జస్వీర్ బంధువైన ధనేశ్ యాదవ్ మద్యం తాగుతున్నాడు. అక్కడే ఆడుకుంటున్న జస్వీర్ కుమారుడిని పిలిచి మద్యం కలుపు కోవడానికి నీళ్లతీసుకురమ్మని అడిగాడు. అందుకు ఆబాలుడు నిరాకరించాడు. దీంతో మద్యం మత్తులో ఉన్న ధనేశ్‌యాదవ్ తీవ్ర ఆగ్రహానికిగురై తన వద్దఉన్న తుపాకితో బాలుడి కడుపులో కాల్చాడు.

4-5Pg6exHMNWJQE.qxd:4-5Pg6exHMNWJQE.qxd 1/1/02 6:09 AM Page 1



# పేదల సొంతింటి కల సాకారం దిశగా చర్యలు

**• రాయచోటి దిగువ అబ్బవరంలో లబ్ధిదారులతో మంత్రులు ముఖాముఖి**



**రాయచోటి, మే 3 ప్రభాతవార్త:** ఆదివారం సాయంత్రం రాయచోటి రూరల్ మండల పరిధిలోని దిగువ అబ్బవరం ఎన్టీఆర్ హౌసింగ్ లేఔట్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లేఔట్ మొత్తం విస్తీర్ణం, ప్లాట్ల సంఖ్య, మంజూరైన గృహాలు, పూర్తయిన ఇండ్లు, వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాల ప్రగతి, అలాగే రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, కాలువలు తదితర మౌలిక సదుపాయాలపై మంత్రులు క్షుణ్ణంగా పరిశీలించారు. సదరు లేఔట్ మొత్తం 2.20 ఎకరాల విస్తీర్ణంలో 120 ప్లాట్లతో ఏర్పాటు చేయబడిందని, ఒక్కో ప్లాటు 1.50 సెంట్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో మొదటి దశలో 93 మందికి గృహాలు మంజూరు చేయగా, అన్ని ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. ఇప్పటివరకు 51 ఇండ్లు పూర్తయ్యాయని, అలాగే బిబిఎల్ దశలో 3, బిఎల్ దశలో 29, ఆర్ఎల్ దశలో 6, ఆర్‌సి దశలో 2 ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో కొనసాగుతున్నాయని అధికారులు మంత్రులకు వివరించారు. ఈ లేఔట్ అభివృద్ధికి మొత్తం రూ.167.40 లక్షలు మంజూరు చేయగా, ఇప్పటివరకు రూ.117.39 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదనంగా రహదారుల అభివృద్ధి, నీటి సౌకర్యాల కోసం రూ.12.29 లక్షలు వ్యయం చేసినట్లు తెలిపారు. అనంతరం మంత్రులు లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలు, నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేసి ప్లాట్లు కేటాయించడమే కాకుండా, గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి సమీపంలోని ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీని ఆదర్శవంతమైన గృహ నిర్మాణ కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాలనీలో ఇప్పటికే రూ.2 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, నీటి పైప్‌లైన్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రాయచోటి పట్టణ పరిసర ప్రాంతాల్లో విలువైన ప్రదేశాల్లో ఇంటి స్థలం, గృహ నిర్మాణం మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో మంజూరైన గృహాల విషయంలో ఎదురైన సమస్యలు, చెల్లింపులు, పత్రాల సమస్యలు ఉన్నా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఆర్డీఓ శ్రీనివాస్, రాష్ట్ర గృహనిర్మాణ శాఖ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**• 8977779471కు సమాచారమివ్వండి • ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్**



**తిరుపతి, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వ్యవస్థలో లోటుపాట్లు, ఓల్టేజ్ మార్పులు, బిల్లింగ్, సోలార్ నెట్ మీటరింగ్, ఓపెన్ యాక్సెస్‌తోపాటు భద్రతా అంశాలకు సంబంధించిన సమస్యలను పారిశ్రామిక వినియోగదారులు చర్చించేందుకు వీలుగా ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతి నెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు 8977779471 ఫోన్ నంబరుకు కాల్ చేయడం ద్వారా తమ పేరు, మొబైల్ నంబరు, హెచ్‌టి సర్వీసు నంబరు, పరిశ్రమ పేరు, పరిశ్రమ స్వభావం, పరిశ్రమను నెలకొల్పిన స్థలం, జిల్లా తదితర అంశాలతోపాటు విద్యుత్ సమస్యకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాల్సి వుంటుందని తెలియజేశారు. ఈ ప్రక్రియ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అంశాన్ని లోతుగా చర్చించి, పరిష్కరించుకునేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లింకును ప్రతి నెలా మొదటి మంగళవారం సాయంత్రంలోగా సంబంధిత వినియోగదారులకు పంపడం జరుగుతుందన్నారు. పారిశ్రామిక వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో ప్రతి నెలా మొదటి బుధవారం ఆయా సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజనీర్ల కార్యాలయాల్లోనూ, 3వ బుధవారం ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ నిర్వహించే పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఇకపై రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**నేడు డయల్ యువర్ సిఎండి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేటి ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు డయల్ యువర్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సిఎండి కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు మొబైల్ నంబరు: 89777 16661కు కాల్ చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 ఫోన్ చేసి సమస్య తెలియజేయవచ్చని తెలిపారు.

# పంట కాలువల నిర్వహణ పనులకు రూ.397 కోట్లు మంజూరు

**• జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే కాలువల నిర్వహణ మరమ్మతు పనులకు రూ.1100 కోట్లు ఇచ్చినట్లు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేసారు. ఈ సంవత్సరం కూడా కాలువల నిర్వహణ, తూడు, గుర్రపుడెక్క తొలగింపు, గేట్లు, షట్టర్లద మరమ్మతులు వంటి పనులు చేపట్టేందుకు రూ.397 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. మళ్లీ పంట కాలం మొదలయ్యే లోగా కాలువల పూడిక తీత, ఇతర అత్యవసర పనులన్నీ పూర్తి చేయాలి. ఆ మేరకు వెంటనే పనులు ప్రారంభించాలి. చీఫ్ ఇంజినీర్ నుంచి కిందిస్థాయి అధికారుల వరకు అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. రూ.10 లక్షల లోపు పనులు సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో నామినేషన్ పద్ధతిలో అప్పగించాలి. రూ.10 లక్షలు దాటిన పనులకు స్వల్పకాల టెండర్లు పిలిచి పనులు అప్పగించాలి. గేట్లు, షట్టర్లు వంటి మెకానికల్ పనులు తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజినీర్ పరిశీలించి సక్రమంగా పని చేసే స్థితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని చీఫ్ ఇంజినీర్‌కు ఇవ్వాలి అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.



వేద విజ్ఞానమ్ గ్రంథాల ఆవిష్కరణ సభా దృశ్యం

## ఏ సాహిత్యమైనా అలంకారప్రాయం కాకూడదు

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ సాహిత్యమైనా కేవలం అలంకార ప్రాయం కాకూడదని నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ అన్నారు. అది కాలానికి, సమాజానికి సాక్షీభూతంగా నిలవాలని అన్నారు. ఆదివారం పటమట వీరబ్రహ్మేంద్రస్వామి వారి ధ్యానమందిరంలో ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ఆధ్వర్యంలో కొండపి శ్రీ వేంకట గణేష్ బాబు సంకలనం చేసిన విశ్వకర్మ వేద విజ్ఞానవ్ తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచించిన వేద విజ్ఞానమ్ గ్రంథాల ఆవిష్కరణ సభ జరిగింది. ఈ సభలో విశ్వకర్మ వేద విజ్ఞానమ్ గ్రంథాన్ని నవమల్లెతీగ మాసపత్రిక సంపాదకులు కలిమిశ్రీ, వేద విజ్ఞానమ్ గ్రంథాన్ని ప్రఖ్యాత న్యూరోసర్జన్ డా. వజ్రాల శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవమల్లెతీగ సంపాదకులు కలిమిశ్రీ మాట్లాడుతూ ప్రాచీన సాహిత్యమైనా, ఆధునిక సాహిత్యమైనా, విప్లవ సాహిత్యమైనా, ఆధ్యాత్మిక సాహిత్యమైనా, భక్తి సాహిత్యమైనా ఆయా కాలాల మానవ సమాజపు వేదనల్ని, భాషా సంస్కృతుల్ని, సంప్రదాయాల్ని ప్రతిబింబించాలన్నారు. విశ్వకర్మ వేద విజ్ఞానమ్ గ్రంథంలో రచయిత వేంకట గణేష్ బాబు వేదాలు, పురాణాల నుండి మానవ వికాసానికి ఉపయుక్తమయ్యే కీలకమైన సూక్తుల్ని, శ్లోకాల్ని తీసుకుని వాటికి సరళమైన భావార్థాలను తెలియజేశారన్నారు. వేద విజ్ఞానమ్ గ్రంథాన్ని ఆవిష్కరించిన డా. వజ్రాల శివకుమార్ మాట్లాడుతూ విశ్వకర్మ సాహిత్య ప్రచారం కోసం పిల్లలకు సంస్కృతం నేర్పాలన్నారు. అన్నారు. సభకు ఆచార్య చంద్రపాటి అధ్యక్షత వహించారు. పుస్తక రచయితలు కొండపి శ్రీ వేంకటగణేష్ బాబు, బ్రహ్మశ్రీ తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు తమ స్పందనని తెలియజేశారు. సాహితీ వేత్త పిడికిలి ప్రసాద్ గ్రంథాలను పరిచయం చేశారు. విక్రమ్ పబ్లిషర్స్ అధినేత గొర్తి శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడారు. బ్రహ్మశ్రీ అప్పలభక్తుల శివకేశవరావు సభాసమన్వయం చేశారు.

## 7, 8 తేదీల్లో జిల్లా కలెక్టర్ల సమావేశం

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం మే 7, 8 తేదీలలో 7వ విడత(4.7) కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు సిద్ధం అయింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలో 28 జిల్లాల కలెక్టర్లతో కాన్ఫరెన్స్ నిర్వహించే క్రమంలో జీఏడీ నుంచి కలెక్టర్లకు సమాచారం అందింది. ఈసారి కలెక్టర్ల కాన్ఫరెన్స్ సచివాలయంలో కాకుండా సీఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించనున్నారు. అక్కడి భవనంలోని కాన్ఫరెన్స్ హాల్ పెద్దగా ఉండడంతో పాటు ఆధునాతన టెక్నాలజీతో, హంగులతో సిద్ధం చేశారు.



## వెంగమాంబ చరితం గ్రంథం ఆవిష్కరణ

**తిరుపతి, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మంత్రరాజ పీఠాధిపతి సింహయాజి స్వామి రచించిన తరిగొండ వెంగమాంబ చరితం గ్రంథాన్ని తరిగొండ వెంగమాంబ 296వ జయంతి ఉత్సవాల సందర్భంగా తిరుపతి దేవలోక ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరణ జరిగింది. వేలాదిమంది గోవింద భక్తుల సమక్షంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు, గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. శరణాగతి, సేవా భావాలు నిండిన మహా భక్తురాలు తరిగొండ వెంగమాంబ అని, ఆమె రాసిన కీర్తనలు మరింత ప్రాచుర్యం పొందేలా తిరుమల తిరుపతి దేవస్థానం కృషి చేయాలని డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో వేదిక్ విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య రాణి సదా శివ మూర్తి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.

# టీ కప్పులో తుఫాను

**• ఎంపి దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల మధ్య రాజీ**

**• చిత్తూరు అభివృద్ధికి కలసికట్టుగా పని చేస్తామని వెల్లడి**



**చిత్తూరు, మే 3 ప్రభాతవార్త:** చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మధ్య నెలకొన్న వివాదం టీ కప్పులో తుఫాను అయ్యింది. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వర్తించే డ్వాక్రా నిధులకు సంబంధించి దళిత రిసోర్స్ పర్సన్‌కు తెలుగు మహిళా నాయకులకు మధ్య జరిగిన వివాదం ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుల మధ్య చిచ్చు పెట్టింది. ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ వర్గంకు మద్దతు పలికి వారితో పోలీసు ఫిర్యాదు చేయించడం, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మరో వర్గానికి అండగా నిలవడంతో గత వారం రోజులుగా ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుల మధ్య వివాదం తీవ్ర రూపం దాల్చింది. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో దళిత ఆర్‌పిపై తెలుగు మహిళా నాయకులు దాడి జరిగిన సమయంలో ఇటు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, అటు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావులు స్థానికంగా లేకపోవడంతో ఇద్దరు అనుచరులు ఈ విషయంను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఇటు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుకు అటు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడుకు వున్నవి లేనివి చెప్పడంతో ఈ వివాదం మరింత ముదిరింది. ఓ క్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తన నియోజకవర్గంలో ఎంపీకి ఏంటి సంబంధం అని అలిగి ప్రభుత్వం తనకు కేటాయించిన గన్‌మెన్లను సైతం వెనక్కి పంపేశారు. ఈ పరిస్థితుల్లో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడులు ఆదివారం ఎమ్మెల్యే గురజాల నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ మధ్య ఎలాంటి విబేధాలు లేవని, ఇకపై రావని, చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి ఇద్దరం కలసికట్టుగా పని చేస్తామని సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో విధులు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీని చిత్తూరు నియోజకవర్గంలో మరింత పటిష్టం చేయడానికి ఎమ్మెల్యే గురజాలతో పాటు నాయకులు, కార్యకర్తలతో కలిసి పక్కాగా కృషి చేస్తానని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు సైతం చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ఎంపీ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావుతో కలసి చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

# తుంగభద్ర గేట్ల మార్పు పనులు పూర్తి చేయాలి

**• కర్ణాటక డి.సిఎం డికె శివకుమార్ • జలాశయం సందర్శన, పనులు పరిశీలన • ఇరిగేషన్ అధికారులతో సమీక్ష**



**విజయనగర్, మే 3 ప్రభాతవార్త:** విజయనగర్ జిల్లాలోని హుస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయాన్ని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఆదివారం సందర్శించి, కొత్త క్రస్ట్ గేట్ ఏర్పాటు పనులను పరిశీలించారు. జలాశయంలో జరుగుతున్న గేట్ నిర్మాణ పనుల పురోగతిని అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. 19వ క్రస్ట్ గేట్ వద్దకు చేరుకున్న డికె శివకుమార్‌కు టీబీ డ్యామ్ మేనేజ్‌మెంట్ బోర్డు అధికారులు గేట్ ఏర్పాటు ప్రక్రియ, ట్రయల్ పనుల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నమూనాలను పరిశీలించిన ఆయన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ, తుంగభద్ర జలాశయం లక్షలాది మంది రైతుల జీవనాధారమని పేర్కొన్నారు. 'గేట్ ఏర్పాటు ఏ దశలో ఉందో స్వయంగా పరిశీలించేందుకు వచ్చాను. ఇంకా కొంత పని మిగిలి ఉన్నప్పటికీ, మే 15 నాటికి గేట్‌ను ప్రారంభించే అవకాశం ఉందని భావిస్తున్నాం" అని తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 10.5 టిఎంసిల నీరు నిల్వ ఉందని చెప్పారు. జలాశయ నిర్వహణ విషయంలో మేనేజ్‌మెంట్ బోర్డుకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, ప్రభుత్వం ఎటువంటి జోక్యం చేసుకోవడం లేదన్నారు. "దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా పనులు జరుగుతున్నాయి. గత ఏడాది ఏప్రిల్ 10న గేటును తొలగించిన వెంటనే నేను వచ్చి పరిస్థితిని పరిశీలించాను" అని గుర్తుచేశారు. సీనియర్ నిపుణుడు కన్నయ్య నాయుడు సలహాలతో కొత్త గేట్ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నైలోని ఒక సంస్థకు కొత్త గేట్ తయారీ బాధ్యత అప్పగించామని, మే 7న గేట్ రానుందని, మే నెలాఖరులోపు పనులు పూర్తయ్యే అవకాశముందని వెల్లడించారు. ప్రతిపక్షాల విమర్శలపై స్పందిస్తూ, "వారు మాట్లాడనివ్వండి, విమర్శించనివ్వండి. ప్రభుత్వం జలాశయం విషయంలో నైతికంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న గేట్ కనీసం మరో 50 ఏళ్ల పాటు ఉపయోగపడుతుంది" అని అన్నారు. మే 15న మళ్లీ వచ్చి మూడు నాలుగు జిల్లాల రైతులతో భారీ కార్యక్రమం నిర్వహిస్తానని తెలిపారు. తుంగభద్ర జలాశయంలో పూడిక తొలగింపు అంశంపై మాట్లాడు తూ, సమాంతర జలాశయ నిర్మాణానికి సమయం ఎక్కువగా పట్టే అవకాశముండటంతో పూడిక తొలగింపు బాధ్యతను డ్యామ్ బోర్డుకు అప్పగిస్తున్నా మని పేర్కొన్నారు. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావడం పై తమకు అభ్యంతరం లేదన్నారు. ఇక శృంగేరి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు. పోస్టల్ బ్యాలెట్లలో తారుమార్లు జరిగాయని ఆరోపణలు ఉన్నాయని, దీనిపై చట్టప్రకారం విచారణ జరిపిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరిగే చర్యలను సహించబోమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఈశ్వర్ ఖండ్రే, కె.హెచ్. మునియప్ప, శివరాజ్ తంగడ్గి, ఎన్.ఎస్. భోస్‌రాజ్, ఎంపీలు ఈ.తుకారాం, రాజశేఖర్ హిత్నాల్, ఎమ్మెల్యేలు హెచ్.ఆర్.గవియప్ప, డా.టి. శ్రీనివాస్, అన్నపూర్ణ తుకారాం, మాజీ మంత్రి అమరేగౌడ బయ్యాపుర, జిల్లా కలెక్టర్ కవితా మణికేరి, ఎస్పీ ఎస్.జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకోడెల రాయస్వామి వారు ఆలయం



జాతరకు వచ్చిన భక్తులు భారీగా వేసుకున్న గుడారాలు

# నేడు కోడెల రాయస్వామి పెద్ద జాతర

**• వేలసంఖ్యలో వస్తున్న భక్తులు.. వెయ్యి దాకా గుడారాలు ఏర్పాటు**

**• 11 యేళ్లకు ఓసారి జరిగే జాతర.. పోటెత్తుతున్న కురబ కులస్తులు**

**కుప్పం, మే 3 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా కుప్పం మండలంలోని జరుగు, సలార్లపల్లి గ్రామాల సమీపంలో వెలసిన శ్రీ కోడెల రాయస్వామి,శ్రీ కుందాని లక్కమ్మస్వామి పెద్ద జాతర సోమవారం జరగనుంది. ఈజాతరకు సంబంధించి ఇప్పటికే వేల సంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకున్నారు. ఆలయ సమీపంలో ఇప్పటికే సుమారు వెయ్యి దాకా భక్తులు గుడారాలు వేసుకున్నారు. ఈజాతరకు కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో ఉన్న కురబ కులస్తులు భారీగా పోటెత్తుతున్నారు. 11 ఏళ్లకు ఓ సారి నిర్వహించే ఈ పెద్ద జాతరను కురబ కులస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం ఆనవాయితీగా వసో _ంది. సోమవారం నాడు నాగులకు పాలుపోయడం, స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. మొక్కులు కలిగిన భక్తులు తలలపై టెంకాయలు పగలగొట్టుకు ంటారు. అలాగే అగ్నిగుండం, పచ్చిగెరిగ, రథోత్ ్సవం, పల్లకి ఊరేగింపు, బాణవేడుకలు నిర్వహిస్తారు.

**ప్రభుత్వం తరపున పకడ్బందీ ఏర్పాట్లు:** 11 ఏళ్లకు నిర్వహిస్తున్న పెద్ద జాతరకు సంబంధించి సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ప్రభుత్వం తరపున అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేపటా ్టరు. ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు, ప్రజలకు విద్యుత్ ఆటంకం లేకుండా సుమారు 60లక్షలకు పైగా వ్యయంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్థంభాలు కొత్తవి ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించారు. అలాగే కడ ద్వారా ప్రజలకు మొబైల్ మరుగుదొడ్లు, స్నానపు గదులను సైతం ఏర్పాటుచేశారు. జాతరకు వచ్చే భక్తులకు ఎన్టీఆర్ సుజల ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఇక కుప్పం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులను గుడ్లనాయనపల్లి వరకు నడుపుతున్నారు. కాగా జాతరకు సంబంధించి కురబ కులస్తులు పెద్ద ఎత్తున ఇప్పటికే ఆటోలు, ట్రాక్టర్లు, టెంపోల ద్వారా పెద్ద ఎత్తున జాతర ప్రాంతంకు చేరుకున్నారు. పోలీసుశాఖ సైతం గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటోంది. వివిధ ప్రాంతాల నుంచి కురబలు భారీగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ఆకివీడు పెదపేట దళితులపై నిర్బంధాన్ని నిరసిస్తూ ధర్నా

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆకివీడు పెదపేట దళితులపై నిర్బంధాన్ని నిరసిస్తూ విజయవాడ అంబేద్కర్ స్మృతివనం వద్ద ఆదివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నిరసనలో దళిత షోషిత్ ముక్తి మంచి ఆలిండియా నాయకులు వి శ్రీనివాసరావు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు పెద్దపేటలోని దళితులపై నిర్బంధం ఆపాలని, గొంతెనమ్మ గుడిని అర్ధరాత్రి చట్టవిరుద్ధంగా కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలని, న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అధికార పరిధిని అతిక్రమించి ఆకివీడు దళితులపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. ఆకివీడు అంశంలో న్యాయస్థానం పరిధిలో ఉండగా ఎందుకు రఘురామకృష్ణంరాజు దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని ఆందోళనకారులు ప్రశ్నించారు.

# తుంగభద్ర డ్యాంలో పూడిక తీయించండి

**• కర్ణాటక డి.సిఎం డికె శివకుమార్‌కు రైతు సంఘం వినతి**



**బళ్లారి, మే 3 ప్రభాతవార్త:** తుంగభద్ర జలాశయం నుండి పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతూ తుంగభద్ర రైతు సంఘం నాయకులు కర్ణాటక ఉప ముఖ్య మంత్రి డి.కె. శివకుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. తుంగభద్ర జలాశయాన్ని పరిశీలించేందుకు వచ్చిన డీకే శివకుమార్‌ను హంపి విశ్వవిద్యాలయంలో తుంగభద్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. జలాశయం గేట్ల ఏర్పాటును వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నందుకు రైతు సంఘం నాయకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తుంగభద్ర రైతు సంఘం అధ్యక్షుడు పురుషోత్తం గౌడ మాట్లాడుతూ, జలాశయంలో సుమారు 33 టిఎంసిల మేర పూడిక పేరుకుపోయిందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా నావిల్లె జలాశయం నిర్మాణం ప్రతిపాదన ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అనుమతులు అవసరమవుతాయని తెలిపారు. అదేవిధంగా నావిల్లె జలాశయం నిర్మాణం వల్ల మునిగే తొమ్మిది గ్రామాల పునరావాసం, భూముల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వంటి అంశాలకు చాలా సంవత్సరాలు పట్టే అవకాశముందని పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే తుంగభద్ర జలాశయంలో పేరుకుపోయిన పూడికను తొలగించడానికి ఇతర రాష్ట్రాల అనుమతులు అవసరం లేదని, మైనింగ్ ఫండ్ ద్వారా నిధులు అందుబాటులో ఉన్నాయని ఆయన వెల్లడించారు. అలాగే కర్మాగారాలకు కూడా ఈ పూడికలోని పదార్థాలు ఉపయోగపడతాయని వివరించారు. కాబట్టి జలాశయంలో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి వెంటనే పూడికతీత పనులు ప్రారంభించాలని డికె శివకుమార్‌ను కోరినట్లు పురుషోత్తం గౌడ తెలిపారు.

# పెంచిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఉపసంహరించుకోవాలి

**• సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

**విజయవాడ, మే 3 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలోని 5 కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగియగానే మోడీ సర్కార్ 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను అమాంతం రూ.993లు పెంచి, జనంపై గుదిబండ మోపడాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు. పెంచిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ స్థానాలకు ఇటీవల జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తవ్వగానే కేంద్రంలోని మోడీ సర్కార్ ధరల బాదుడుకు సిద్ధమైంది. మోడీ ప్రభుత్వం పలు రాష్ట్రాల ఎన్నికల సమీపించే ముందు ప్రజల భావోద్వేగాల్ని రెచ్చగొడుతూ, పోలింగ్ ముగియగానే గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలను భారీగా పెంచడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం 5 రాష్ట్రాలలో పోలింగ్ ముగిసిన వెంటనే వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై ధరను రూ.993లు పెంచుతూ కేంద్రం షాక్ ఇవ్వడం దుర్మార్గం. ఈ భారీ పెంపు తర్వాత ఢిల్లీలో ఒక కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.3100కి పైగా చేరింది. ఇంధన ధరలు నిరంతరం పెరుగుతుండటం, ప్రస్తుత క్లిష్టమైన అంతర్జాతీయ పరిస్థితుల్లో దేశ ప్రయోజనాలను కాపాడాల్సిన మోడీ ప్రభుత్వం వైఫల్యమవుతోంది. ఇటీవల పలు రాష్ట్రాలలో వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ కొరతను నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైంది. ధరలను స్థిరంగా ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉండగా, దాని బదులు భారాన్ని సాధారణ ప్రజలపై మోపుతోంది. ఈ నిర్ణయం వల్ల దేశవ్యాప్తంగా హోటళ్లు, ధాబాలు, హాస్టళ్లు, పిజి వసతులు మరియు చిన్న వ్యాపారాలపై వెంటనే ప్రభావం పడుతుంది. దీని ఫలితంగా ఆహార ధరలు పెరిగి జన జీవన వ్యయం మరింత భారమవుతుంది. ఎన్నికల తర్వాత ఎల్‌పిజి గ్యాస్, ఇతర ఇంధన ధరలు పెరుగుతాయని సిపిఐ ముందే చేసిన హెచ్చరికలను నిజం చేస్తూ ఓటింగ్ ముగిసిన మరుసటి రోజే కేంద్రం వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను పెంచేసింది. అంతేకాకుండా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయనే సాకుతో పెట్రోల్, డీజిల్ ధరలను కూడా పెంచేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇంధన ధరలు పెంచితే ఆ భారం అన్ని రంగాలపై పడి, నిత్యావసర వస్తువులు పెరుగుదలతో ప్రజా జీవనం అస్తవ్యస్తమవుతుంది. ప్రజల జీవనోపాధి కంటే ఎన్నికలలో తమ స్వలాభాలపైనే మోడీ ప్రభుత్వం దృష్టి పెట్టిందనేది సత్యం. పోలింగ్ పూర్తయ్యాక సాధారణ ప్రజలపై భారాన్ని మోపడం అన్యాయం. ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నది.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
26
సోమవారం 4, మే 2026


## గాజువాకలో కొత్త కోర్టుల ప్రారంభం



**విశాఖపట్నం, మే 3, ప్రభాతవార్త**

విశాఖపట్నం జిల్లా గాజువాకలో నూతనంగా మంజూరైన కోర్టులను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవి నాథ్ తిల్హారి, జస్టిస్ రవి చీమలపాటి హాజరై ప్రారంభోత్సవం నిర్వహించి స్మారక ఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గాజువాక కోర్టు సముదాయంలో ఫ్యామిలీ కోర్ట్-కమ్-అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. వెంకట రమణ, గాజువాకలోని ఇతర అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ డివిజన్ న్యాయమూర్తులు పాల్గొన్నారు. అలాగే గాజువాక 8వ పేజీలో

## కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం

### పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్




**విశాఖపట్నం-ప్రభాతవార్త**

మెడీస్ మల్టీస్పెషల్టి హాస్పటల్ ఆధ్వర్యంలో, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో సహకారంతో, కేజీహెచ్‌లో డా.బి.ఆర్.అంబేద్కర్ ఆడిటోరియంలో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. అదేవిధంగా ప్రముఖ వైద్యులు డా.రవిరాజు, డా.సుబ్బారాజు, డా.శిరీషా రాణి, డా.రాధ, డా.సంధ్యా దేవి, డా.ఐ.వాణి, డా.పద్మావతి నాయుడు పాల్గొని కార్యక్రమాన్ని మరింత సార్థకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సీఎంఈ కార్యక్రమం ద్వారా వైద్యులలో నూతన వైద్య జ్ఞానం పెంపొందించడం, వైద్య రంగంలో తాజా పరిజ్ఞానాన్ని పంచుకోవడం, నిరంతర వృత్తి అభివృద్ధికి తోడ్పడడం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరచడంలో, రోగులకు మెరుగైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## అనకాపల్లి రైల్వే చరిత్రలో కొత్త అధ్యాయం

**అనకాపల్లి - చర్లపల్లి ట్రైన్‌కు జెండా ఊపి ప్రారంభించిన రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్ -మూడు కొత్త రైళ్లకు శ్రీకారం - జిల్లా రైల్వే కనెక్టివిటీకి కొత్త దిశ -మూడు రైళ్లు... మూడు దిశల్లో అనుసంధానం -అనకాపల్లి- తిరుపతి రైలు మే 8న ప్రారంభం -అనకాపల్లి - సోలాపూర్ రైలు ఇదే నెలలో ప్రారంభానికి సిద్ధం -18 కోట్లతో రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగవంతం -అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌కు కృషి చేస్తామని భరోసా**



**అనకాపల్లి, మే 3, ప్రభాతవార్త**

అనకాపల్లి జిల్లా అభివృద్ధి పథంలో మరో కీలక మైలురాయిని చేరుకుందని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డా.సిఎం రమేష్ అన్నారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో నూతనంగా ప్రారంభించిన అనకాపల్లి చర్లపల్లి రైలును అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ , జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్,అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ కమిటీ చైర్మన్ పీల గోవింద సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు రైల్వే అధికారులతో కలిసి జెండా ఊపి ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభించారు. ముందుగా రైలులో ఉన్న ప్రయాణికులతో ఎంపీ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సదుపాయాలు, ఈ రైలు అవసరం, ప్రయోజనాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా ఢిల్లీ రైల్వే బోర్డుతో ప్రత్యేకంగా చర్చలు జరిపి మూడు కొత్త రైళ్లను మంజూరు చేయించామని తెలిపారు. అనకాపల్లి - చర్లపల్లి (హైదరాబాద్) మధ్య నడిచే రైలు ఆదివారం నుంచే రెగ్యులర్ ఎక్స్‌ప్రెస్‌గా ప్రారంభమైందని తెలిపారు. ఉద్యోగ, వ్యాపార, విద్య అవసరాల కోసం హైదరాబాద్ వెళ్లే వేలాది మందికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.అనకాపల్లి- తిరుపతి రైలు మే 8న ప్రారంభమవుతుందని, శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. అనకాపల్లి - సోలాపూర్ రైలు కూడా ఇదే వారంలో అందుబాటులోకి రానుందని వెల్లడించారు. అభివృద్ధి, లాజిస్టిక్స్, సంక్షేమ పథకాలు, పారిశ్రామికీకరణ రంగాల్లో అనకాపల్లి జిల్లా దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అనకాపల్లి గురించే చర్చ జరుగుతోందని, కొత్త పరిశ్రమలతో కనెక్టివిటీ మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రూ.18 కోట్లతో చేపట్టిన రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఆర్ఓబీ, ఆర్‌యూబీ నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ వేగవంతమైందని వెల్లడించారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జి పనులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో వందే భరత్ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల కోసం చర్యలు తీసుకుంటామని ఎంపి తెలిపారు. ప్రయాణికుల రద్దీ, అవసరాలను పరిశీలించి అనుకూల నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తామని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పనులన్నింటినీ త్వరలో పూర్తి చేసి, "రైల్వే శాఖకు సంబంధించి ఎలాంటి పనులు మిగలకుండా అనకాపల్లిని అభివృద్ధి చేస్తాం అని స్పష్టం చేశారు.అనకాపల్లి రైల్వేస్టేషన్ నుండి పలుప్రదాన రైళ్ల రాకపోకలకు ఎంపి సిఎం రమేష్ కృషిని సానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కొనియాడారు. పార్లమెంటు సభ్యులు సిఎం రమేష్‌ను సత్కరించారు. అనకాపల్లి రైల్వేస్టేషన్ మాస్టర్ సత్యనివాస్,ఆర్ పి ఎఫ్ సిఇ శ్రీనివాస రెడ్డి, జిల్లా బిజెపి అద్యక్షులు దివాకరరెడ్డి పరమేశ్వరరావు, బిజెపి జిల్లా నాయకులు పొన్నగంటి అప్పారావు పాల్గొన్నారు.

## నీట్-2026 పరీక్షకు విశాఖలో 98.46 శాతం హాజరు




## గాజువాకలో భవనం కూలి కార్మికుడి దుర్మరణం

**ఎత్తు పెంచేందుకు జాకీలతో లేపుతుండగా ప్రమాదం -ఓనర్‌కు ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు -ముగ్గురు కార్మికులకు తప్పిన ముప్పు**



**గాజువాక,మే 03,ప్రభాతవార్త**

జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాస్ నగర్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పాత భవనాన్ని ఎత్తు పెంచేందుకు చేస్తున్న క్రమంలో అది ఒక్కసారిగా కుప్పకూలడంతో ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. భవన యజమానికి ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు కాగాముగ్గురు కార్మికులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఈఘటన స్థానికంగా సంచలనం రేపింది స్థానికులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. వికాస్ నగర్ ప్రాంతంలో ఇటీవల రోడ్డు పనులు నిర్వహించడం జరిగింది. దీంతో రోడ్డు పక్కనే ఫోటో స్టూడియో నిర్వహిస్తున్న ఒక పాత భవనం రోడ్డు కిందకి దిగడంతో దానిని పైకి లేపేందుకు భవన యజమాని ఆరుగురు కార్మికులు ఇద్దరు కూలీలను పురమయించాడు. దీంతో జాకుల సాయంతో పైకి లేపి మరమ్మతులు చేపట్టేందుకు ఆరుగురు కార్మికులు ఇద్దరు కూలీలు పనులు ప్రారంభించారు. పనులు జరుగుతుండగా ప్రమాదవశాత్తు భవనం ఒక్కసారిగా కూలిపోవడంతో.. కింద పని చేస్తున్న కార్మికులపై శిథిలాలు పడ్డాయి. ఈ 8వ పేజీలో

## ఖాకీలో కరుణామూర్తి

**విశాఖపట్నం, మే 3, ప్రభాతవార్త**

మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు మానవత్వం చాటుకున్నారు. వైద్య ప్రవేశ పరీక్ష రాయడానికి వచ్చిన ఓ విద్యార్థినికి సకాలంలో సహాయం చేసి ఆమె భవిష్యత్తును కాపాడారు. ఆదివారం కేంద్రీయ విద్యాలయ నం-2 పరీక్ష కేంద్రం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పార్వతీపురానికి చెందిన హిమబిందు అనే విద్యార్థిని పరీక్ష రాయడానికి వచ్చినప్పటికీ తొందరలో పాస్‌పోర్ట్ ఫోటోలు తీసుకురావడం మర్చిపోయింది. ఫోటోలు లేకుండా పరీక్ష హాలులోకి అనుమతి ఇవ్వబోమని సిబ్బంది చెప్పడంతో ఆమె ఆందోళనకు గురైంది. అక్కడే విధుల్లో ఉన్న సీఐ గొలగాని అప్పారావు విద్యార్థినిని గమనించి వెంటనే స్పందించారు. వివరాలు తెలుసుకున్న అనంతరం కానిస్టేబుల్‌ను సమీపంలోని ఫోటో స్టూడియోకు పంపించి, తన సొంత ఖర్చుతో ఫోటోలు తీయించారు. కొద్ది నిమిషాల్లోనే ఫోటోలు తీసుకువచ్చి ఇవ్వడంతో విద్యార్థిని సమయానికి పరీక్ష హాలులోకి ప్రవేశించి పరీక్ష రాయగలిగింది. ఈ ఘటనను చూసిన తల్లిదండ్రులు, స్థానికులు పోలీసుల సేవను అభినందించారు. ఒక విద్యార్థినికి అండగా నిలిచిన సీఐ అప్పారావు స్పందన స్ఫూర్తిదాయకమని పలువురు ప్రశంసించారు.

## నీట్ విద్యార్థినికి సీఐ గొలగాని సాయం



## ఘనంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం



**విశాఖపట్నం, మే 3, ప్రభాతవార్త**

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖ, హైదరాబాద్ ప్రతి నెల నిర్వహించే వినోదాల విందులో భాగంగా స్థానిక పౌరగ్రంధాలయం ద్వారకానగర్‌లో ప్రపంచ నవ్వుల దినోత్సవంను పురస్కరించుకొని 8వ పేజీలో

## తీర సౌందర్యం

**సదుపాయాల్లో విశాఖ వెనుకబాటు -మండే ఎండలో నీడకోసం అలమటిస్తున్న పర్యాటకులు -ముంబై తరహా కానరాని ఆకర్షణీయం -తాగునీరు, విశ్రాంతి సదుపాయాల లేమి తీవ్ర సమస్య -పర్యాటక శాఖ, జీవీఎంసీ నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువ**

**(ప్రభాతవార్త -విశాఖపట్నం)**

విశాలమైన తీర ప్రాంతం, సహజ సౌందర్యంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విశాఖలో పర్యాటక సదుపాయాల లేమి తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ముఖ్యంగా బీచ్ ప్రాంతాల్లో ప్రాథమి క సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటి పూట భారీగా సందర్శకులు బీచ్‌లకు చేరుకుంటున్నప్పటికీ, మండే ఎండలో కూర్చోవడానికి నీడనిచ్చే షెల్టర్లు, ఆకర్షణీయమైన వృక్షాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. నీడనిచ్చే షెల్టర్లు, పచ్చని వృక్షాలు లేకపోవడంతో ఇసుకపై నిలబడటమే కష్టంగా మారుతోంది. ముంబై తీర ప్రాం తంలో నీడనిచ్చే పూలతో కూడిన ఆకర్షణీయమైన పెద్ద పాటి మొక్కలు కనిపిస్తాయి. జపాన్ తరహా లో ముంబై రోడ్లు కనిపిస్తాయి. ఇక్కడ తీర ప్రాంతంలో మాత్రం ఎంత వెతికినా నీడనిచ్చే మొక్కలు కనిపించవు. ఆకర్షణీయమైన పెద్దపాటి పుల మొక్కలు కనిపించవు. బీచ్‌ను చూడాలని ఆశతో కుటుంబాలతో వచ్చే సందర్శకులు, వృద్ధులు, చిన్నారులు కూర్చునేందుకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోవాల్సిన పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయి.

**త్రాగటానికి గుక్కెడు నీరు కూడా లేదాయే..**

తాగునీటి సదుపాయం కూడా చాలా చోట్ల అందుబాటులో లేకపోవడం మరో ప్రధాన సమస్యగా కనిపిస్తుంది. బీచ్ ప్రాంతాల్లో ఉచితంగా లేదా తక్కువ ధరకు తాగునీరు అందించే సదుపాయాలు లేకపోవడంతో పర్యాటకులు ఖరీదైన బాటిల్ నీటిపై ఆధారపడుతున్నారు.

**అపరిశుభ్రతగా పబ్లిక్ టాయిలెట్స్...**

పబ్లిక్ టాయిలెట్లు తక్కువగా ఉండడం లేదా నిర్వహణ లోపంతో ఉపయోగించలేని స్థితిలో ఉండడం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. శుభ్రత, చెత్త నిర్వహణలోనూ లోపాలు స్పష్టం గా కనిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడం, ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపించడం పర్యావరణా నికి ముప్పుగా మారడంతో పాటు పర్యాటకుల అనుభవాన్ని దెబ్బతీస్తోంది. భద్రతా ఏర్పాట్లు, లైఫ్ గార్డుల కొరతపై కూడా సందర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కనీస వసతులు కల్పించడంలో విఫలం..**

పర్యాటక అభివృద్ధి పేరుతో రోప్‌వేలు, వ్యూయింగ్ డెక్కులు, రిసార్ట్‌లు, వాటర్ స్పోర్ట్స్ వంటి ప్రాజెక్టులు ప్రకటించినప్పటికీ, ప్రాథమిక వసతుల కల్పనలో పర్యాటక శాఖ, జీవీఎంసీ విఫలమ య్యాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. "ముందు కనీస సదుపాయాలు కల్పిస్తేనే పర్యాటకులు సంతృప్తి చెందుతారు" అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. స్థానిక వ్యాపారులు కూడా పర్యాటక సదుపాయాల లేమి తమ ఆదాయంపై ప్రభావం చూపుతోందని చెబుతున్నారు. సరైన సౌకర్యాలు ఉంటే మరింత మంది పర్యాటకులు ఎక్కువసేపు బీచ్‌ల వద్ద గడిపి, స్థానిక వ్యాపారాల కు ఊతమిస్తారని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీచ్ ప్రాంతాల్లో నీడ షెల్టర్లు, తాగునీటి కేంద్రాలు, శుభ్రమైన టాయిలెట్లు, చెత్త నిర్వహణ, భద్రతా చర్యలు వంటి మౌలిక వసతులను తక్షణమే ఏర్పాటు చేయాలని పర్యాటకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే విశాఖ వంటి సహజ వనరులతో నిండిన నగరం పర్యాటక రంగంలో వెనుకబడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



## ఘనంగా ప్రపంచ నవ్వుల దినోత్సవం

7వ తరువాయి ..

కామెడీ షో అదివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎంవి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, రాగన్ నాయుడు, సూర్య మద్రాపు, పుషమి, బోను నరసింహారావు కామెడీ స్కిట్లు, ముందుగా శ్రీ వాగ్దేవి నృత్యాలయం నాయుడు తోట గురువు సౌందర్య, వారి శిష్య బృందం, లక్ష్మి కార్తీక, మౌనిమా, రూత్విక్, గ్రీస్మశ్రీ, షిత, పల్లవిక, మేధాశ్రీ మనస్వి, తోషిని, యశశ్విలు శాస్త్రీయ నాట్య ప్రదర్శన చేసిన అనంతరం పెళ్లి తప్పిపోయింది, దెబ్బలు ఎలాగా తగిలాయి, నీకు తెలుసా, కూర చీర, లంచ్ బాక్స్, మాటలు మనుషులు, సాటి ఆడవాళ్లు, ఇంకా అన్నో స్కిట్స్ ప్రదర్శించి నవ్వులు పూయించారు. అనంతరం అతిథులు తిలక్ పట్నాయక్, ఆడిటర్ సన్ మూర్తి, సోషల్ మీడియా స్టేట్ బి.మాల్యాద్రి. రిటైర్డ్ డీజీమ్ స్టీల్ ప్లాంట్, పి.ఎల్.ఎన్. పట్నాయక్, బ్యాంకు అఫ్ ఇండియా, వై.అప్పారావు, పిఎఫ్. ఈఎస్ ఐ.ఆడిటర్ శైలజ చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేశారు. నిర్వహణ ఎంవి సుబ్రహ్మణ్యం, జబర్దస్త్ ప్రకాష్, డాన్స్ గురువు సౌందర్య సురేష్ని, కళాకారులను అభినందించారు.

## నీట్-2026 పరీక్షకు విశాఖలో 98.46 శాతం హాజరు

విశాఖపట్నం, మే 3, ప్రభాతవార్త

విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన నీట్-2026 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో మొత్తం 18 పరీక్ష కేంద్రాలలో 8,112 మంది అభ్యర్థులు పరీక్షకు నమోదు కాగా, వారిలో 7,987 మంది హాజరయ్యారు. 125 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 98.46 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టడంతో పరీక్ష సజావుగా నిర్వహించబడింది. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పరీక్ష విజయవంతంగా పూర్తయినట్లు వెల్లడించారు.

## గాజువాకలో భవనం కూలి కార్మికుడి దుర్మరణం

7వ తరువాయి ..

ఘటనలో ఒకరు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ఏడుగురులో ముగ్గురు అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒక లేబర్ ఇద్దరు కార్మికులు, యజమానికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాద ధాటికి భవనం నేలమట్టం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 100 నుంచి సమాచారం అందుకున్న న్యూ పోర్ట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టారు. మృతుడి వివరాలు సేకరిస్తున్నామని, ప్రమాద బారిన పడిన వారు హరీష్, శేఖర్ ప్రసాదు సత్యనారాయణ శంకర్ నారాయణ, సూరి, శంకర్రావులుగా గుర్తించామని, వీరు స్థానికులే అని కొందమంది తెలపగా మరి కొంతమంది బయట నుంచి వచ్చిన వాళ్ళని పొంతన లేని సమాధానాలు వస్తున్నాయని తెలిపారు. గాయాలు పాలైన వారిని వైద్యం కోసం కెజిహెచ్కు తరలించామని, మృతుని పోస్ట్ మార్టం నిమిత్తం కెజిహెచ్కు తరలించామని తెలిపారు. ఇంకాశిదిలాలక్రింద ఎవరైనా ఉన్నారాఅని గాలిస్తున్నామని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియవలసి ఉందని న్యూ పోర్ట్ సిఐ కామేశ్వరరావు తెలిపారు.

## గాజువాకలో కొత్త కోర్టుల ప్రారంభం

7వ తరువాయి ..

బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. వేణు, కార్యదర్శి కె.జె.వి.ఎన్.పీ. రత్నం, న్యాయవాదులు, పోలీసులు, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గాజువాక ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి రావడానికి ఈ కోర్టుల ప్రారంభం తోడ్పడుతుందని అధికారులు తెలిపారు.

## వికాస్ నగర్‌లో కుప్పకూలిన భవనం...పర్యవేక్షించిన దేవన్‌రెడ్డి



గాజువాక, మే 3,ప్రభాతవార్త

నియోజకవర్గ పరిధి జీవీఎంసీ65వవార్డ్ వికాస్ నగర్‌లో ఆదివారం ఓ భవనం ఒక్కసారిగా కుప్పకూలిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. సమాచారం అందుకున్న వెంటనే వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. సహాయక చర్యల ముమ్మరం కుప్పకూలిన భవనం వద్ద పరిస్థితిని ఆయన క్షుణ్ణంగా సమీక్షించారు. శిథిలాల కింద ఎవరైనా చిక్కుకున్నారా అనే విషయమై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ.. సహాయక చర్యల్లో ఎటువంటి జాప్యం జరగకుండా చూడాలని, శిథిలాలను వేగంగా తొలగించాలని ఆదేశించారు. బాధితులకు భరోసా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్న దేవన్‌రెడ్డి, బాధితులకు పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు ఉన్నారు.

## చిక్కా సత్యనారాయణకు పరామర్శ



గాజువాక, మే 3,ప్రభాతవార్త

ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న వైకాపా చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు చిక్కా సత్యనారాయణను పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి ఆదివారం పరామర్శిం చారు. ఆయన నివాసానికి వెళ్లిన నేతలు సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు కట్టమూరి సతీష్, మంత్రి శంకర్ నారాయణ, జీలకర్ర నాగేంద్ర పాల్గొన్నారు.

## రుషికొండలో రాష్ట్ర స్థాయి ఎన్ఐఏ పోలీస్ స్టేషన్ ఏర్పాటు

విశాఖపట్నం, మే 3, ప్రభాతవార్త :

జాతీయ భద్రత, ఉగ్రవాద నిర్మూలన దిశగా కీలక అడుగు పడింది. విశాఖపట్నం రుషికొండలో రాష్ట్ర స్థాయి నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. బీచ్ రోడ్డులోని పెదరుషికొండ కేంద్రంగా ఇప్పటివరకు బ్రాంచ్‌గా పనిచేస్తున్న ఎన్ఐఏ కార్యాలయాన్ని అధికారిక పోలీస్ స్టేషన్‌గా మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ స్టేషన్‌కు రాష్ట్రవ్యాప్తంగా పరిధి కల్పిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో జరిగే తీవ్ర నేరాలు, దేశ భద్రతకు ముప్పు కలిగించే కార్యకలాపాలపై వేగంగా స్పందించేందుకు ఈ స్టేషన్ కీలకంగా మారనుంది. విశాఖ మధురవాడ, సాగర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం దర్యాప్తు చర్యలను మరింత బలోపేతం చేయనుందని అధికారులు తెలిపారు.

## యువత క్రీడల్లోనూ రాణించాలి



గాజువాక,మే 03,ప్రభాతవార్త

యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్ కర్ణంరెడ్డి నర్సింగరావు, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ 73వ వార్డు ఆదర్శనగర్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'విశాఖ ప్రీమియర్ లీగ్' క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. నిర్వాహకులు సంజయ్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన నేతలు తొలుత కర్ణంరెడ్డి నర్సింగరావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆదర్శనగర్ గ్రౌండ్‌ను క్రీడాకారులకు ఉపయోగపడేలా అత్యాధునిక స్టేడియంలా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ మైదానంలో స్నేహపూర్వక వాతావరణాన్ని చాటాలని కోరారు. మొత్తం 10 జట్లు తలపడిన ఈ టోర్నీలో ప్రథమ స్థానం గోవింద్ సి.సి జట్టు,ద్వితీయ స్థానం పోలమాంబ ఎలెవన్, తృతీయ స్థానం భాస్కర్ ఎలెవన్ జట్లు విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భూపతిరాజు శ్రీనివాసరాజు, సుజాత, యువ నాయకులు పల్లా కార్తీక్, స్థానిక నాయకులు మనోజ్, ప్రశాంత్, ప్రకాష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి గుడి మరమ్మతుల సమయంలో తేనెటీగల దాడి

### 10 మందికి అస్వస్థత.. ఆస్పత్రికి తరలింపు

ఆనందపురం, మే 3, ప్రభాతవార్త

ఆనందపురం మండలం గిడిజాల పంచాయితీ పరిధిలోని దిబ్బడిపాలెం గ్రామంలో శనివారం తేనెటీగలు దాడి చేయడంతో పది మంది అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని అమ్మవారి గుడిని మరమ్మతులు చేయడానికి కొందరు గ్రామస్తులు వెళ్లిన సమయంలో అక్కడ ఉన్న తేనె తుట్టె కదలడంతో ఒక్కసారిగా తేనెటీగలు బయటకు వచ్చి అక్కడ ఉన్న వారిపై దాడి చేశాయి. దీంతో భయాందోళనకు గురైన గ్రామస్తులు పరుగులు తీయగా, కొందరు స్పృహ తప్పి కిందపడిపోయారు. సమీపంలో పశువులు మేపుతున్న కాపరులు ఈ ఘటనను గమనించి వెంటనే గ్రామస్తులకు సమాచారం అందించారు. అనంతరం బాధితులను కారులో ఆస్పత్రికి తరలించి చికిత్స అందిం చారు. గాయపడిన వారిలో వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, నరసింహనాయుడు, సాంబ, అప్పలనాయుడు తదితరులు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం బాధితులంతా క్షేమంగా ఉన్నారని సమాచారం.

## వైభవంగా పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవం





ఆరిలోవ, మే 3, ప్రభాతవార్త

చినగదిలి ముడసర్లోవ గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయం జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. వేకువ జాము నుండే చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి శ్రీనివాస్ తో పాటు 12వ వార్డు వైఎస్ఆర్సిపి అధ్యక్షులు మొల్లి హేమంత్ హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు వీరికి సాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్న భక్తులకు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పిలి గోపి, సెక్రెటరీ ఎం శ్రీను, ఈగల బుజ్జి, ఒమ్మి వెంకట్, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సేవా పథంలో కెఎన్నార్ ఫౌండేషన్

### పల్లెలు, గిరిజన ప్రాంతాలకూ సేవలు విస్తరణ -ఘనంగా కరణంరెడ్డి నరసింగరావు జన్మదిన వేడుకలు



గాజువాక,మే 03 ప్రభాతవార్త

సామాజిక సేవా కార్యక్రమాలను గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు విస్తరించడమే లక్ష్యంగా కెఎన్నార్ ఫౌండేషన్ పనిచేస్తుందని ఆ సంస్థ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్టు కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. ఆదివారం గాజువాక పాత కర్నవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఫౌండేషన్‌ను స్థాపించినట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులకు విద్యాసాయం, మురికివాడల్లో చైతన్య కార్యక్రమాలు, క్రీడాకారులకు ప్రోత్సాహం వంటి సేవా కార్యక్రమాలను ముమ్మరం చేస్తామన్నారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు. తన ప్రతి అడుగులో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ గొర్లె సత్యనారాయణ, గూటూరు శంకర్రావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి గడసాల అప్పారావు, సిరసపల్లి నూకరాజు, బాటా శ్రీనివాస్, వందేభారత్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ వినోద్ బాలు, కరణం కనకారావు, గంధం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ కొత్త హెచ్ఎంగా చంద్రకళ బాధ్యతలు స్వీకరణ



ఆనందపురం, మే 3, ప్రభాతవార్త

ఆనందపురం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పాఠశాలకు కొత్త ప్రధానోపాధ్యాయురాలిగా చంద్రకళ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా కసింకోట మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆమె అధికారికంగా పాఠశాల హెచ్ఎంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయు రాలిగా విధులు నిర్వహించిన బగ్గం నాగమణి తన బాధ్యతలను చంద్రకళకు అప్పగించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది కొత్త ప్రధానోపాధ్యాయురాలికి ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపి ఆమె నాయకత్వంలో పాఠశాల మరింత అభివృద్ధి చెందడంతో పాటు విద్యా ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. పాఠశాల నిర్వహణలో పారదర్శకతతో పాటు విద్యార్థినులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని చంద్రకళ ఈ సందర్భంగా తెలిపారు.

## వెల్లంకి సర్వీస్ రోడ్డుపై ప్రమాదం

### ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ఆనందపురం, మే 3, ప్రభాతవార్త

ఆనందపురం మండలంలోని వెల్లంకి వద్ద సర్వీస్ రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఒక్కసారిగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా వెళ్తున్న ఆటోను తప్పించే క్రమంలో ఒక వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఢీకొన్న ప్రభావంతో ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ హైవే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని పోలీస్‌లు చెప్పారు.

## జిల్లా వైకాపా అధ్యక్షుడు కెకెరాజుకు ఘన స్వాగతం



గాజువాక,మే 3,ప్రభాతవార్త

జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో ఆదివారం నిర్వహించిన ఓ ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన వైకాపా జిల్లా అధ్యక్షుడు కేకే రాజును పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తొలిసారి వార్డుకు వచ్చిన ఆయనకు గాజువాక నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రీనివాస్ దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవిందుతో పాటు పలువురు సీనియర్ నాయకులు కేకే రాజును శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు చిత్రాడ వెంకటరమణ, ప్రగడ శ్రీనివాస్, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బొడ్డ సన్యాసిరావు, చిన్నప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన మోదకొండమ్మ జాతర ఉత్సవాలు



హుకుంపేట, మే 03, ప్రభాతవార్త

మన్యం వాసులు ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ జాతర మహోత్సవములు మండల కేంద్రంలో ఆదివారం నుండి ఘనంగా ప్రారంభమైంది మోదకొండమ్మ అమ్మవారి ఆలయం నుండి ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సతకం పట్టు వద్ద కొలువ తీర్చారు. గ్రామంలోని అందరూ మేళ తాళాలతో వాయిద్యాలతో ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఘటాలను మరియు ఉత్సవ విగ్రహాలు, అమ్మవారి పాదాలు తీసుకువచ్చారు. అమ్మవారి ఘటాలను తలపై మోసేందుకు మహిళలు పురుషులు పిల్లలతో సహా భారులుతీరారు. అమ్మవారి ఘటాలు ఊరేగింపు ప్రారంభం నుంచి పోలీసులు వాహనాలను నియంత్రిస్తూ ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. మూడు రోజులు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాలు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా ఉత్సా కమిటీ అధ్యక్షులు కే నాగబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం నుండి ప్రారంభమై మంగళవారం వరకు జరిగే ఉత్సవాలకు అనేకమైన సాంస్కృతి కార్యక్రమాలు భారీ ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదే కాకుండా గ్రామంలో వీధివీధిన విద్యుత్ కాంతుల అలంకరణ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యలు గురి కాకుండా ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. జాతర జరిగే మూడు రోజుల్లో ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని అలాగే డ్రోన్ల



సహాయంతో ఎప్పటికప్పుడు నిఘాను ఏర్పాటు చేశామన్నారు. అన్ని రోడ్లలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ప్రత్యేక వాహనాలను మాత్రమే గ్రామంలో అనుమతిస్తూ రవాణా సౌకర్యం ఆటంకం కలగకుండా హైవే మీద నుండి రవాణా మళ్ళించడం జరిగిందని ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రత్యేక భద్రత మధ్య అమ్మవారి ఉత్సవాలు గట్టి బందోబస్తు మధ్య ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరిగిన వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. రాత్రి వేళలు జరుగు సాంస్కృతి కార్యక్రమాలకు ఎటువంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని అలాగే మద్యం మత్తులో పండుగకు అటంకం కల్పిస్తే వారిపై తపచరులు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట పూర్ణిమ వై సర్పంచ్ గోవింద్, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శోభ సంతోష్, నైన్ సత్తిబాబు,సూర్యకాంతం, జన్ని అప్పారావు. దలై లక్ష్మణ్, శంకర్, వాసు, తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గాజువాక,మే 03,ప్రభాతవార్త



అనారోగ్యంతో బాధ పడుతున్న గాజువాక 73వ వార్డు సింహగిరి కాలనీకి చెందిన ఉప్పులి శివరామ కృష్ణకు ముఖ్య మంత్రి సహాయనిధి (సీఎం ఆర్ఎఫ్) నుంచి రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో మంజూరైన ఈ చెక్కును నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆదివారం బాధితుల కు అందజేశారు. వార్డు పార్టీ అధ్యక్షుడు సింగూరి అనంత్, శివప్రసాద్, పంచదారల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కుంభమేళా మహోత్సవాలు నిర్వహించాలి

### తుంగ్లం గ్రామ అభివృద్ధి సమావేశంలో కాకి గోవిందరెడ్డి



గాజువాక,మే 03,ప్రభాతవార్త

శ్రీ విజయ రాఘవస్వామి వారి పుష్కర పట్టాభిషేక కుంభమేళా మహోత్సవాలను గ్రామస్తులందరూ ఐకమత్యంతో విజయవంతం చేయాలని కాకి గోవిందరెడ్డి కోరారు. 69వ వార్డు తుంగ్లంలో ఆదివారం గ్రామ అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆకాంక్షించారు. ఈ ధార్మిక వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు యువత, గ్రామ పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధుల సత్కారం



గాజువాక,మే 03,ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం వడ్లపూడి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కోఆర్డినేటర్ కారుమూరి మహేష్, ఉపాధ్యక్షుడు గుంపిన రఘునాథ్ గుప్త, కార్యదర్శి అడ్డ గోవిందరాజులు, సమన్వయకర్త అమర్నాథ్, కార్యవర్గ సభ్యుడు జగ్గారావులను సన్మానించారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు వెంకటరమణ, మధుసూదన్ గుప్తా పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 599 మార్కులు సాధించిన కొత్తపల్లి జ్ఞానేశ్వరిని అభినందించిన సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం, మే 03,ప్రభాతవార్త

10వ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి 599 మార్కులు సాధించిన శ్రీ చైతన్య స్కూల్‌కు చెందిన కొత్తపల్లి జ్ఞానేశ్వరిని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి అభినందనలు తెలియజేసి, ఆమె కృషి, పట్టుదల, నియమం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు. అదేవిధంగా "విద్యార్థులు కష్టపడి చదివితే విజయాలు సాధ్యమే. ఈ విద్యార్థిని సాధించిన ఫలితం ఆమె కుటుంబానికి, పాఠశాలకు గర్వకారణం. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను" అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రుల కృషిని అభినందిస్తూ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర శ్రీ చైతన్య స్కూల్స్ ఎ.జి.ఎమ్ సురేష్, జనసేన నేత డా.మత్రివేముల శ్రీనివాస్, సదరన్ ఇన్స్టిట్యూట్ అధినేత సతీష్ పొన్నం, ఇతర పెద్దలు పాల్గొన్నారు.

## నేడు మంత్రి సంధ్యారాణి పాడేరు రాక

### పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర సమన్వయ సమావేశం -హాజరు కావాలని అధికారులకు ఆదేశం : జిల్లా కలెక్టర్ టి.నిశాంతి

పాడేరు,మే3, ప్రభాతవార్త



పాడేరు శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర ఈ నెల 17,18,19 తేదీల్లో జగనన్న మహోత్సవాలను అత్యంత వైభవంగా, విజయ వంతంగా నిర్వహించేందుకు గాను ఈనెల 4వ తేదీ సోమవారం మధ్యాహ్నం 02:00 గం.కు పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు, సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్న ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గిరిజన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధ్యక్షతన జరగనుందని జిల్లా కలెక్టర్ నిశాంతి పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జాతర నిర్వహణలో భాగంగా ఆయా శాఖలకు కేటాయించిన విధులకు సంబంధించి సిద్ధం చేసిన కార్యాచరణ ప్రణాళికతో సమావేశానికి రావాలని కలెక్టర్ సూచించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించనున్నారు. కావున అధికారులు ఎవరూ మినహాయింపు లేకుండా సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ సూచించారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, NAYLER NIMMI (OLD NAME) W/O ANDREW NAYLER R/O 34-10-20, DAYAS STREET, GNANAPURAM, VISAKHAPATNAM, I have changed my name as NAYLER NIRMALA (NEW NAME) hereafter my name is known as NAYLER NIRMALA (NEW NAME). (Ro.No.4540)

★ I, NAYLER ANDREW ANTHONY (OLD NAME) S/O NAYLER NEVILLE R/O 34-10-20, DAYAS STREET, GNANAPURAM, VISAKHAPATNAM, I have changed my name as ANDREW NAYLER (NEW NAME) hereafter my name is known as ANDREW NAYLER (NEW NAME). (Ro.No.4543)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

4skl10:4skl10.qxd 03-05-2026 23:28 Page 1



## బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : అచ్చెన్న



కోటబొమ్మాళి, మే 3 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు పూర్తి భరోసా కల్పిస్తోందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు సుమారు రూ.5 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో కాకుండా, ఇతర నియోజ కర్గాలకు చెందిన లబ్ధిదారులకు రూ.3.28 కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పంపిణీ చేశామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. కొర్లాపు శేఖరరావు (పెంటూరు) రూ.85,946, బొడ్డ తరుణ్ కుమార్ (మెండిరాయివలస), రూ.1,09,794, బెహర సవరయ్య (నౌవగాం), రూ.47,901, పట్ట జగ్గారావు (తిలారు) రూ.65,918, పొన్నాన చిన్నారావు (చీపుర్లపాడు) రూ.43,975, అక్కురాడ త్రినాధరావు (కమలనాథపురం) రూ.20,000, మడపాల రామమూర్తి (మెదుగవలస) రూ. 31,084, కింతలి అమ్మాయమ్మ (దామోదరపురం) రూ.68,000 పంపిణీ చేశారు.

## 'ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ మూల స్తంభం'



కోటబొమ్మాళి, మే 3 ప్రభాతవార్త : ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛ అనేది అత్యంత విలువైన స్తంభమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా వెలిబుచ్చే స్వేచ్ఛ ఉన్నప్పుడే సమాజం సజావుగా ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా సత్యనిష్ఠతో, ధైర్యంతో పనిచేస్తున్న పాత్రికేయులకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## తాగునీటి సమస్య తీర్చండి



కవిటి, మే 3 ప్రభాతవార్త : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ క్యాంపు ఆఫీస్ రామయ్యపట్నంలో ఇద్దివానిపాలేంకి చెందిన వారధి పురుషోత్తం ఆధ్వర్యంలో సుమారు 50 మంది కుటుంబాలు నీటి సమస్య కోసం కలవడం జరిగింది. అడిగిన వెంటనే రేపే వచ్చి శంకు స్థాపన చేసి ఇద్దివానిపాలేంలో పనులు ప్రారంభించడం జరుగుతుందని చెప్పడం జరిగింది. కాగా ఇటీవల అధికారులను కూడా ఎమ్మెల్యే గ్రామానికి పంపించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ ఉప్పాడ రామారావు, షణ్ముఖ, పాపారావు, చిన్నారావుతో పాటు యువత, మహిళలు పాల్గొన్నారు.

## బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుడికి ఆర్థికసాయం



కవిటి, మే 3 ప్రభాతవార్త : జగతి గ్రామానికి చెందిన నెయ్యిల రవి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూ.1, 34,900 ఆర్థికసాయం రవి తల్లికి అందజేశారు. గ్రామస్తులు, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నాదెండ్ల సేవలు చిరస్మరణీయం : ఎమ్మెల్యే కూన



ఆమదాలవలస, మే 3 ప్రభాతవార్త : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తండ్రి, ఉమ్మడి రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు మరణం పట్ల ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే రవికుమార్ భాస్కర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రేపు సీతానగరంలో ఉచిత కంటి వైద్యశిబిరం

సంతబొమ్మాళి, మే 3 ప్రభాతవార్త : సీతానగరం గ్రామంలో మంగళవారం ఉచిత కంటి వైద్య సేవ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. సీతానగరం వాకర్స్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో స్థానిక పాఠశాల వద్ద ఉదయం 8 గంటలకు ఈ శిబిరం నిర్వహిస్తున్నమన్నారు.ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అలాగే వైద్యులు సూచన మేరకు ఆపరేషన్‌కు ఎంపికైన వారిని ఉచితంగా ఆపరేషన్ లు చేయిస్తామన్నారు. అలాగే కంటి మీద కండ, మెల్ల కన్ను సరిచేయుట,కంటి శుక్లాలు ఉన్న పిల్లలకు, పెద్దలకు ఎన్టీఆర్ వైద్య సేవా పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తామని అందులో పేర్కొన్నారు.కావున పరిసర గ్రామాల ప్రజలు ఈ సదావకాశంను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## రక్తదానం ... మహాదానం



ఇచ్ఛాపురం, మే 3 ప్రభాతవార్త : తలసేమియా బాధితునికి బి+ బ్లడ్ అవసరం కాగా సోంపేట ఉద్దానం బ్లడ్ బ్యాంక్‌కు సంతోష్ తుమ్ము జిఎస్ ఫౌండేషన్ ద్వారా రక్తదానం చేశారు. ఆయనకు జిఎస్ ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సోంపేట హస్పిటల్‌లో లక్ష్మి అనే మహిళకు అత్యవసర పరిస్థితుల్లో ఓ+ బ్లడ్ కావాలని తెల్పగా వెంటనే గణేష్ స్పందించి ఉద్దానం బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి జిఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన గణేష్‌కు అందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

సీతంపేట, మే3 ప్రభాతవార్త : వాబ జంక్షన్ వద్ద గురువారం జరిగిన ద్విచక్ర వాహనం ప్రమాదంలో జంపరకోట గ్రామానికి చెందిన జీలకర్ర మోహనరావు మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతుడి భార్య వరలక్ష్మి (55) అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో మెరుగైన వైద్యం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వరలక్ష్మి ఆదివారం మృతి చెందడం పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్న ఇప్పటికే ఈ గ్రామంలో అదే రోజు ఆటో ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. దీంతో ఇప్పటి వరకు మృతుల సంఖ్య ఆరుకు చేరడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయాన్ని అందజేయాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

### నాలుగు వినతులు తీసుకోడానికి ..

## యంత్రాంగమంతా కుస్తీలు పడుతున్నారు



సీతంపేట మే 3 ప్రభాతవార్త : గతంలో ఐటీడీఏ గ్రీవెన్స్ అర్జీలు వందల్లో వచ్చేవి వాటి పరిష్కారం కూడా అలాగే ఉండేది. రాను రాను ఐటిడిఏ ప్రజా గ్రీవెన్స్ మసకబారిపోవడంతో వినతులు ఇవ్వడానికి అర్జీదారులు ముందుకు రాకపోవడంతో యంత్రాంగం మాత్రం ప్రజా గ్రీవెన్స్ పేరుతో కుస్తీలు పడుతున్నారు. గతంలో ప్రతి సోమవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహించగా ప్రస్తుతం వారంలో రెండు రోజులు శుక్రవారం సోమవారం నిర్వహించడం వలన ప్రజా గ్రీవెన్స్ ఆదరణ కోల్పోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాల పునర్విభజన తరువాత ఐటిడిఏ పరిధిలో 20 మండలాలు ఉండగా 16 మండలాలు మినహా నాలుగు మండలాలు మాత్రమే పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో ఉండడం వలన అర్జీదారులు ఆశించిన స్థాయిలో రాని పరిస్థితి నెలకొంది. గతంలో గ్రీవెన్స్‌కు డివిజనల్ స్థాయి సెక్టోరియల్ అధికారులు హాజరయ్యేవారు. ప్రస్తుతం క్రింద స్థాయి అటెండర్లు సైతం గ్రీవెన్స్ హాజరై పరిస్థితి నెలకొంది దీంతో గ్రీవెన్స్ నామమాత్రంగా జరుగుతుందనే ఆరోపణలతో ఆర్జీదారులు ముందుకు రాని పరిస్థితి ఉంది. గతంలో నిర్వహించే విధంగా వారంలో ఒకరోజు సోమవారం ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తే ఆర్జీదారులు పెరుగుతారని ప్రజా గ్రీవెన్స్ వినతులు పరిష్కారమవుతాయనే భరోసా కల్పిస్తే ఆదివాసీలు స్పందన కూడా అలానే ఉంటుందని ఈ విషయంలో జిల్లా అధికారులు దృష్టి సారించి వారంలో ఒకరోజు ప్రజా గ్రీవెన్స్ నిర్వహించవలసిన అవసరం ఉందని అర్జీదారులు కోరుతున్నారు.

## ఇసుక అక్రమ రవాణా నిర్మూలనకు కఠిన చర్యలు



ఇచ్ఛాపురం, మే 3 ప్రభాతవార్త : మండలంలో అక్రమంగా ఇసుక రవాణాను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు చేపడుతున్నట్లు తహశీల్దార్ ఎన్.వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలో ప్రధాన మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ రవాణాపై నిఘా పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా బహుదా నది పరిసర ప్రాంతాలు మరియు నిషేధిత ప్రాంతాల్లో (భూగర్భ జల నిర్మాణాలు, వంతెనలు, ఆనకట్టలు, రైల్వే మార్గాలు, క్రాస్ డ్రైనేజ్ నిర్మాణాల నుంచి 500 మీటర్ల పరిధిలో) అక్రమంగా, అనధికారికంగా ఇసుక తవ్వకం నిర్వహించే వాహనాలు, రాష్ట్రం వెలుపలికి ఇసుక రవాణా చేసే వాహనాలు లేదా పర్మిట్ లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించిన పక్షంలో జరిమానాలు విధించబడతాయని తెలిపారు. మొదటి సారి పట్టుబడితే 10వేలు, రెండవ సారి పట్టుబడితే 10,001 నుంచి 20వేలు వరకు, ఆపై పట్టుబడితే రూ.25వేలు నుంచి లక్ష రూపాయల వరకు జరిమానాలు విధించబడునని తెలిపారు. అవసరానికి మించి ఇసుక నిల్వ, దాచిపెట్టడం, బ్లాక్ మార్కెటింగ్ లేదా విక్రయం చేసినట్లయితే ఆ ఇసుకను అధికారులు స్వాధీనం చేసుకుని, అటువంటి చర్యలకు పాలనపడిన వ్యక్తికి గరిష్టంగా రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రెండు లక్షల వరకు జరిమానా విధించబడునని తెలిపారు. మండలంలోని ప్రజలు, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు అక్రమ ఇసుక రవాణా చేయకుండా ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఎవరైనా అక్రమ రవాణాకు పాలనపడితే కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## క్రెడిట్ చోర్ కోసం వాస్తవాలను విస్మరించి దాచటం తగదు

**వైసిపి యువ నాయకులు తమ్మినేని చిరంజీవి నాగ్**



అముదాలవలస, మే 3 ప్రభాతవార్త : వంశధార రెండవ దశ నిర్మాణ పనుల సాధనలో అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేసిన తమ్మినేని సీతారాం ప్రధాన భూమిక వహించారని వైసీపీ యువజన విభాగం నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ స్పష్టం చేశారు. ఆదివారం తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, వంశధార ప్రాజెక్ట్ చరిత్రను రాజకీయ కోణంలో కాకుండా వాస్తవాల ఆధారంగా చూడాలని పిలుపునిచ్చారు. వంశధార నదీ జలాల సమస్యకు దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర ఉందని, ఇది ఉత్తరాంధ్ర ప్రజల జీవనాధారానికి సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. 1961లో బొడ్డేపల్లి రాజగోపాలరావు ఆలోచనతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్‌కు అదే సంవత్సరం దామోదరం సంజీవయ్య శంకుస్థాపన చేయగా, ఇచ్చాపురం వరకు సాగునీరు అందించాలనే లక్ష్యం అప్పుడే నిర్ణయించబడిందని గుర్తుచేశారు. తరువాత కాలంలో ఒడిశా అభ్యంతరాల కారణంగా ప్రాజెక్ట్ దశాబ్దాల పాటు నిలిచిపోయిందని, 2010లో ఏర్పాటు చేసిన వంశధార జల వివాదాల ట్రిబ్యునల్ 2017 సెప్టెంబర్ 13న ఇచ్చిన తుది తీర్పుతో ప్రాజెక్ట్‌కు చట్టబద్ధ మార్గం ఏర్పడిందన్నారు. ఆ తీర్పు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు నేరేడు బ్యారేజ్ నిర్మాణానికి అనుమతి లభించినప్పటికీ, ఒడిశాలో 106 ఎకరాల భూసేకరణ, పునరావాసం వంటి షరతులు అమలు చేయాల్సి ఉందని వివరించారు.

## భవన నిర్మాణ సామగ్రి తొలగింపు



టెక్కలి, మే 3 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయ, అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలో రవీంద్రభారతి స్కూల్ రోడ్డుపై అకారణంగా పడి ఉన్న భవన నిర్మాణ సామాగ్రిని తొలగిస్తూ, అకాల వర్షాలు కారణంగా నిల్వ ఉన్న నీటిని తరలించడమైనది. స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా మార్గం సుగమం చేయడం జరిగినది.

## చేతబడి అనుమానంతో దంపతుల హత్య ... నిందితుడి అరెస్టు



కొత్తూరు, మే 3 ప్రభాతవార్త: కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొట్టేపల్లి పంచాయతీ చిన్నరాజపురం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న దారుణ జంట హత్యా ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చేతబడి చేస్తున్నారనే అనుమానంతో ఓ వ్యక్తి దంపతులను క్రూరంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి రావడంతో విషయం తెలుసుకున్న పోలీసులు హత్య చేసిన నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసి విచారణ చేపట్టడం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, మృతులు సవర అల్లంగ (భర్త), సవర జ్యోతి (భార్య)గా గుర్తించారు. నిందితుడు అదే గ్రామానికి చెందిన సవర తోటయ్య (తండ్రి: గోపయ్య)గా తెలిపారు. తోటయ్యకు ఇద్దరు చిన్నపిల్లలు ఉండగా, రెండేళ్ల పాప పుట్టినప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ అనారోగ్యానికి కారణం మృతులే చేతబడి చేస్తున్నారని భావించి, వారిని హత్య చేస్తే తన కూతురు ఆరోగ్యం మెరుగవుతుందని అపోహతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు వెల్లడించారు. సుమారు పది రోజుల క్రితం తోటయ్యకు మృతులతో గొడవ జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో మృతుల బంధువులు అతనిని హెచ్చరించి, వేధింపులు కొనసాగితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఘటన జరిగిన రోజు తెల్లవారుజామున సుమారు 3:30 గంటల సమయంలో తోటయ్య తన ఇంట్లో ఉన్న గొడ్డలిని తీసుకుని బయలుదేరాడు. మృతులు తమ ఇంటి ముందున్న సిమెంట్ రోడ్డుపై నిద్రిస్తున్న సమయంలో వారిపై ఆకస్మికంగా దాడి చేశాడు. ఈ దాడిలో అల్లంగ అక్కడికక్కడే మృతి చెందగా, జ్యోతి తీవ్రంగా గాయపడి కేకలు వేస్తుండగా మరింత దారుణంగా దాడి చేసి హత్య చేశాడు. ఈ ఘటనను సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి మేడపై నిద్రిస్తున్న వారి కుమారుడు గమనించాడు. తండ్రి తల్లిని హత్య చేస్తుండటం చూసి భయంతో అక్కడి నుండి పారిపోయి అరేగులగూడెం గ్రామంలోని బంధువుల వద్దకు చేరుకుని విషయం తెలియజేశాడు. అనంతరం బంధువులతో కలిసి కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. ఫిర్యాదు మేరకు వెంటనే స్పందించిన కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, ఎస్సై కె. వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. చాకచక్యంగా నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా, నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## మంత్రి అచ్చెన్నాయుడికి అభినందనలు



కోటబొమ్మాళి, మే 3 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఆదివారం తన క్యాంపు కార్యాలయం నిమ్మాడలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. మంత్రి ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలపై స్పందిస్తూ రైతు సంకేమం కోసం కృషి చేస్తూ పార్టీకి అంకిత భావంతో సేవలందిస్తున్న నాయకుడిగా గుర్తింపు పొందారని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, పి ఎ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మి, కామేశ్వరరావు, జిల్లా మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు బోయిన రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన సత్య శ్రీనివాస్, చిన్నసాన ఎంపిటిసి నంబాల్ల రాజశేఖర్, గొందు లక్ష్మణరావు, కోరాడ గోవిందరావు తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## సమీక్షా సమావేశానికి డుమ్మా కొట్టిన మండల అధికారులు



పలాస, మే 3 ప్రభాతవార్త: పలాస మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి పలు శాఖలకు చెందిన అధికారులు దుమ్మాకొట్టిన ఘటన శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో చోటు చేసుకుంది.ప్రతినెలా జరిగే సర్వసభ్య సమావేశం లాగే మే నెలకు సంబంధించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై సమీక్షను పలాస మండల కార్యాలయంలో నిర్వహించడానికి అధికారులు ఏర్పాటు చేయగా సుమారు 8 శాఖలకు సంబంధించిన అధికారులు దుమ్మాకొట్టడంతో ప్రతిపక్షపార్టీకి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు.సమస్యల పట్ల చర్చించేందుకు తాము సమావేశానికి హాజరైతే సంబంధిత శాఖాధికారులు గైర్హాజరయ్యారని సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ప్రశ్నించారు.ఇదే విషయంపై మీడియా పలాస ఎంపిడిఓను వివరణ అడిగితే గైర్హాజరు అయిన వారికి షోకాజ్ నోటీసులు అందజేయడానికి చర్యలు తీసుకొంటున్నట్టు ఆయన తెలిపారు.సమావేశంలో ప్రతిపక్ష పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఉంగ సాయికృష్ణ, ఎంపిటిసి బమ్మిడి దుర్యోధనరావులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వరి విత్తనాలు,ఎరువులకు సంబంధించి రైతుల నుండి ఇండెంట్ తీసుకుని కొరత లేకుండా సకాలంలో అందించామని, ఈప్రభుత్వం మాత్రం గత యేడాది విత్తనాలను, ఎరువులను అందించడంలో విఫలమైందని ఈ ఏడాదన్నా సకాలంలో కొరత లేకుండా అందిస్తారా లేదా అని అగ్రికల్చర్ అధికారిని నిలదీశారు. భూములు రీసర్వే ఇంకా పూర్తికాని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించగా,రానున్న ఖరీఫ్ సీజన్లో సకాలంలో రైతులకు విత్తనాలు,ఎరువులు అందించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోబోతున్నట్లు పలాస మండల అగ్రికల్చర్ అధికారి పోలారావు తెలిపారు.సాధారణ సర్వసభ్య సమావేశంలో పలు శాఖలకు సంబంధించిన ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు ..



సంతకవిటి, మే 3 ప్రభాతవార్త : మండలంలో కొత్తూరు రామచంద్రపురం గ్రామంలో శనివారం రాత్రి మూడు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. శనివారం రాత్రి ఒక్కసారిగా గాలి రావడంతో ఓ చెట్టు కూలి విద్యుత్ లైన్‌పై పడడంతో వరుసుగా మూడు స్తంభాలు నేలవాలాయి. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ లైన్ ఆపి పడిన విద్యుత్ స్తంభాల నుంచి వైర్లను తొలిగించారు. దీంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. వెంటనే కొంతమేర విద్యుత్ లైన్ పునరుద్ధరించి, ఆదివారం యుద్ధ ప్రాతతిపదికన పనులు చేపట్టి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు.

## నీటి సంరక్షణ అందరి బాధ్యత : ఎంపీడీవో



ఆమదాలవలస, మే 3 ప్రభాతవార్త : నీటి సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో సీపాన రామ్మోహన్‌రావు తెలిపారు. ఆదివారం రామచంద్రపురం పంచాయతీ పరిధిలో పొన్నంపేట గ్రామంలో ఉన్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామ్మోహన్రావు మాట్లాడుతూ నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత అధికారులు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నీటి పొదుపు ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. నీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమం జూలై 25 వరకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలియజేశారు. సాగునీటి వనరుల అభివృద్ధికి, రైతులకు అవసరమయ్యే సాగునీటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం జరుగుతుందన్నారు.

# శ్రీకాకుళం వార్త



## నేటి నుంచి టెక్కలిపట్నంలో గ్రామదేవత ఉత్సవాలు



పలాస, మే 3 ప్రభాతవార్త : పలాస మండలం టెక్కలిపట్నం గ్రామంలో సోమవారం నుంచి (4వ తేదీ) ఈ నెల 12వ తేదీ వరకు శ్రీ సింధు కుఠారి గ్రామ దేవత మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉజ్జిని ఊరేగింపును ప్రధాన వీధుల్లో నిర్వహించారు. సోమవారం సాయంత్రం దేవర తేవడంతో పూజా కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రతి రోజూ పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారని, చివరి రోజైన 12వ తేదీన సాయంత్రం ఐదు గంటలకు శత సహస్ర ఘటాలతో అమ్మవారి ఊరేగింపు వందలాది మందితో కనుల పండుగగా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పండుగలో అందరూ పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేశారు. ఎస్ఐ ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకొని భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

## వాణిజ్య గ్యాస్ ధరల పెంపుపై సీపీఎం ఆగ్రహం



కొత్తూరు మే 3 ప్రభాతవార్త : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండర్ల ధరలను భారీగా పెంచి సామాన్య వ్యాపారుల నడ్డి విరుస్తోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. ఆదివారం కొత్తూరు మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను అమాంతం పెంచడం దుర్మార్గమైన చర్య అని, ఈ పెంపును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## మూఢ నమ్మకాలను వీడండి... విజ్ఞానంతో ముందడుగు వేయండి



కొత్తూరు, మే 3 ప్రభాతవార్త : సమాజంలో ఇంకా కొనసాగుతున్న మూఢనమ్మకాలు, చేతబడి వంటి అమానుష ఆచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఎస్సై కె.వెంకటేశ్‌తో కలిసి చిన్న రాజపురం గ్రామాన్ని సందర్శించి, స్థానిక ప్రజలతో ముఖాముఖి చర్చించారు. ఈ సందర్భంగా సీఐ చింతాడ ప్రసాద్ మాట్లాడుతూ, అనారోగ్యం లేదా ఇతర సమస్యలు తలెత్తినప్పుడు మంత్రగాళ్లను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. చేతబడి పేరుతో అమాయకులను ఇబ్బందులకు గురిచేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎస్సై వెంకటేశ్ మాట్లాడుతూ, గ్రామంలో ఎవరైనా మూఢనమ్మకాలను ప్రోత్సహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అకాల వర్షంతో ... చెరువులను తలపిస్తున్న వీధులు



సరుబుజ్జిలి, మే 3 ప్రభాతవార్త: మండలంలో గత మూడు రోజుల నుండి అకాల వర్షాల వల్ల వీధుల్లో నీరు నుండి తయారయ్యాయి. వీధి రోడ్ల నలువైపులు భవనాలు నిర్మింపజేసి నీరు మళ్లేందుకు తావు లేక చెరువుల తయారయ్యాయి. ఆర్ అండ్ బి రహదారి పనులు నిర్మించడంతో మురికి కాలువలలో నీరు వెళ్లే దారులకు అడ్డుకట్ట వేయడంతో మండల కేంద్రంలో వీధి రహదారులు వర్షపు నీరు చేరి చెరువులా తయారయ్యాయి. గ్రామ అభివృద్ధి అధికారులు ఇటు ఆర్ ఎం బి అధికారులు దానిపై దృష్టి సారించక స్థానికులకు ఇబ్బంది కలుగుతుంది. దాని కారణంగా రోగాలు సంభవించే అవకాశం ఉంది. ముందస్తు జాగ్రత్తగా మండల కేంద్రంలో గల వైద్యాధికారులు గ్రామంలో సంచరించి రోగనిరోధక సూచనలు తెలియజేయాలని స్థానికులు కోరుతున్నారు.

## నేర ప్రవృత్తిని విడనాడాలి



శ్రీకాకుళం, మే 3 ప్రభాతవార్త: జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటం, నేరాలను పూర్తిగా అరికట్టడం లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ కఠిన చర్యలు చేపడుతోంది. జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, నేర చరిత్ర గల వ్యక్తులు, సస్పెక్ట్ షీటర్లకు విస్తృతంగా కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర ప్రవర్తనను వెంటనే విడనాడి, సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని సూచించారు. ఎవరైనా మళ్లీ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తే, ఇప్పటికే ఉన్న కేసులకు అదనంగా మరిన్ని క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. చట్టాన్ని అతిక్రమించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు.

## నీట్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



శ్రీకాకుళం, మే 3 ప్రభాతవార్త : నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా నీట్ పరీక్ష సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ నిర్వాహకులను ఆదేశించారు. జిల్లాలో ఆదివారం జరుగుతున్న నీట్ పరీక్షలు సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు నిర్వహిస్తున్న బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించారు. తనిఖీలో అసిస్టెంట్ కలెక్టర్, హరి ఓం పాండియ, ఆర్డిఓ కె.సాయి ప్రత్యూష ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫౌజ్ పింఛన్ పంపిణీ



కంచిలి, మే 3 ప్రభాతవార్త : కొల్లూరు పంచాయతీ కర్తలి గ్రామంలో పౌజ్ పెన్షన్ పైల రామయ్య భార్యకి టీడీపీ అధ్యక్షులు మాదిన రామారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపి కంచిలి మండల అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు. ఇవే కాకుండా జూన్ నుండి వితంతు, పెన్షన్ వికలాంగ పెన్షన్ తరువాత వృద్ధాప్య పెన్షన్ ఇవ్వడం జరుగుతుందని రమేష్ రెడ్డి అన్నారు.

## అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



కంచిలి, మే 3 ప్రభాతవార్త : కుంబరినౌగాం పంచాయతీ గ్రామస్తులు నిర్మించిన శ్రీ నందికేశ్వర శివాలయం ముఖద్వారం, శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. పండా ప్రధాన అర్చకులుగా ఉండి జరిపించిన కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయ్యింది. ఈ కార్యక్రమానికి అతిధులుగా ఐటీడీపి కంచిలి మండలం అధ్యక్షులు వాసాల రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామ ప్రజలు పెద్దలు అందరు పాల్గొన్నారు.

## నడుమూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల ఘన విజయం

శ్రీకాకుళం, మే 3 ప్రభాతవార్త : ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో సోంపేట మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నడుమురు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతో ఈ ఏడాది అత్యుత్తమ ఫలితాలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఫలితాల్లో ఎం.శరణ్య 560 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచి పాఠశాల పేరును నిలబెట్టింది. ఆమెతో పాటు గంట అర్చన 554 మార్కులు, బట్టి అస్మిత 552 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ ఏడాది మొత్తం విద్యార్థులు 28 మంది పరీక్ష రాయగా, 27 మంది 96.42శాతంతో ఉత్తీర్ణత పొందారు. ఉత్తీర్ణులైన 27 మంది విద్యార్థులు కూడా ప్రథమ శ్రేణిలో నిలవడం విశేషం. 11 మంది విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించి తమ సత్తా చాటారు. ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించిన తొలి ఏడాదిలోనే ఇంతటి విద్యార్థుల విజయానికి కృషి చేసిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్పు చక్రధర్ రావుని మిగతా ఉపాధ్యాయ సిబ్బందిని తల్లిదండ్రులను గ్రామ పెద్దలు, అధికారులు అభినందించారు.

## నిరుపయోగంగా మరుగుదొడ్లు.. పట్టించుకోరూ !!



బొబ్బిలి, మే 3, ప్రభాతవార్త : బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి కోరాడ వీధి.. సాధిఖానా దగ్గరలో గత కొన్ని సంవత్సరాలుగా సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.తుప్పలు డొంకలతో నిండి లోపల పాములు, విషపురుగులు తిరుగుతున్నాయు. కోరాడ వీధిలో పేదలు ఎక్కువగా నివసించేది అక్కడ ఉన్న సామూహిక మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్న మున్సిపల్ సిబ్బంది అధికారులు నిర్లక్ష్యంగా వాటిని విడిచిపెడుతున్నారు. వీధిలో నివసిస్తున్న పేదలు నానా అవస్థలు పడుతున్నారు అయినా పట్టించుకునే నాధుడు కనిపించలేదని యాకరువు పెడుతున్నారు. అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ మున్సిపల్ సిబ్బంది, అధికారుల మాకెందుకులే అన్నట్లు పట్టించుకోలేదు. దీంతో ఈ వీధిలో మహిళలు , పేద ,బడుగు బలహీన వర్గాల వారు బహిర్భూమి వెళ్ళేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ మరుగుదొడ్లను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు రేవళ్ల కిరణ్ కుమార్ మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఈ స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమణ చేయుటకు పన్నాగాలు పన్నుతున్నారు అది జరగకముందే ఈ సామూహిక మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

## ఎన్నికల ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేష్



గరివిడి, మే3, ప్రభాతవార్త : ఎన్నికల ఆపరేటర్ల సంఘ జిల్లా అధ్యక్షుడుగా ఐ. వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెవెన్యూ కార్యాలయాల్లో ఎన్నికల విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఎన్నికల ఆపరేటర్ల జిల్లా సంఘ కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడు గా వెంకటేష్,ఉపాధ్యక్షుడుగా కె వి ఎస్ కె సన్యాసి రావు,కార్యదర్శిగా ఎం.కార్తీక్, సంయుక్త కార్యదర్శి గా జయలక్ష్మి, కోశాధికారి కారిగా కె.మురళి కృష్ణ,ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గానికి ఒక సభ్యునిగా ఏడుగురుని కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూ.నరేంద్రతో పాటు పలువురు ఆపరేటర్లు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు దేశం భరోసా



చీపురుపల్లి, మే 3, ప్రభాతవార్త : చీపురుపల్లి నియోజకవర్గంలో విద్యకు పెద్దపీట వేస్తూ, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి శ్రీ కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ఆదివారం నాడు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిం చడమే కాకుండా, వారితో కలిసి సహపంక్తి భోజనం చేసి వారిలో ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపారు.ఈ సందర్భంగా రామ్ మల్లిక్ నాయుడు మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర విద్యావ్యవస్థ ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. ముఖ్యంగా 100 రోజుల ప్రణాళిక ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని, డిజిటల్ విద్య అందుబాటులోకి వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల లక్ష్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అవసరమైన ఆర్థిక, శిక్షణా సహకారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చా రు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి వెలకట్టలేనిదని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి సహబంతి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రినారా లోకేష్ సంస్కరణలు విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీకి సిద్ధం చేస్తున్నాయని ధీమా వ్యక్తం చేశారు. చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు దన్నాన రామచంద్రుడు, రౌతు కామ నాయుడు, గవిడి నాగరాజు, పైల బలరాం, ఆరిపాక సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చడమే ప్రధాన లక్ష్యం : జడ్పీటీసీ



చీపురుపల్లి మే 3 ప్రభాతవార్త.ప్రజల దాహార్తిని తీర్చే మహోన్నత సేవ అని జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అధ్యక్షులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు అన్నారు. ఆదివారం నాడు తన నివాసం వద్ద ప్రజలకు అవసరమైన త్రాగునీటి సరఫరా చేయుట కొరకు ఉచిత మంచినీరు ట్యాంక్ ను ఆయన ప్రారంభించారు.ఎండ తీవ్రత దృష్ట్యా స్థానికులకు దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి ట్యాంకును సొంత నిధులతో ఏర్పాటు చేసి ప్రారంభ కార్యక్రమం చేశారు.ఈ ఉచిత మంచినీటి ట్యాంక్ ను ప్రజలకు అందుబాటులో నిత్యం ఉంటుందని ఈ సందర్భంగా జడ్పిటిసి వల్లి రెడ్డి శిరీష అన్నారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ వేసవికాలం లో ప్రజలకు త్రాగునీరు ఇబ్బందులు ఉన్నవారు, అలాగే ఎవరు అయిన శుభకార్యలకు చీపురుపల్లి ప్రాంతం లో ప్రజలకు ఉచితంగా త్రాగునీరు అందించడానికి ఈ వాటర్ ట్యాంక్ ప్రారంభించామని ,ఎవరికి అవసరం అయిన మమ్మలిని సంప్రదిస్తే తప్పకుండా ఉచితంగా పంపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## నాదెండ్ల ప్రజా సేవలోనే పయనించేవాడు : వబ్బిన



శృంగవరపుకోట, మే3, ప్రభాతవార్త.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నాదెండ్ల భాస్కర్ రావు ఎప్పుడూ ప్రజా సేవలోనే పయనించే వారని ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ వబ్బిన సత్యనారాయణ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ లోని కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన నాదెండ్ల పెద్దకర్మ కార్యక్రమంలో వబ్బిన హ జరై ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను వారి కుటుంభ సభ్యులను వబ్బిన కలుసుకుని పరామర్శించి సానుభూతిని తెలియజేశారు.కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ఎస్టీ కమిషన్ రైతులకు మేలు చేస్తుందని ఆశిస్తున్నాం : ఎమ్మెల్సీ



శృంగవరపుకోట,మే3, ప్రభాతవార్త : ఎస్టీ కమిషన్ రైతులకు మేలు చేస్తుందని ఆశిస్తున్నామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు.ఆదివారం మండలంలోని బొడ్డవరలో తన నివాసంలో ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్ లోని దిల్ కుషా గెస్ట్ హౌస్ లో సోమవారం జరగనున్న నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ విచారణకు తాను హాజరవుతున్నట్లు తెలిపారు. జిందాల్ యాజమాన్యం రైతులకు చేసిన అన్యాయం అవినీతిపై ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని రైతులకు న్యాయం చేయాలని కోరామని అలాగే కోర్టులో కేసులు కూడా వేశామని తెలిపారు. ఇప్పటికీ నాలుగు సార్లు ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ విచారణ చేపట్టారని కానీ జిల్లా ఉన్నతాధికారులు విచారణకు గైర్హాజరయ్యారని తెలిపారు. జిల్లా కలెక్టర్,ఎస్పీ,ప్రిన్సిపల్ సెక్రటరికీ కమిషన్ నుంచి మళ్లీ సమన్లు వెళ్ళాయని ఈసారి వారు విచారణకు హాజరై వాస్తవాలు అంగీకరించి తప్పులు సరిదిద్దుకుని రైతులకు న్యాయం చేస్తారని ఆశిస్తున్నామని ఎమ్మెల్సీ తెలిపారు.

## ప్రజల భద్రతే ప్రధాన కర్తవ్యం : ఎస్పీ



పార్వతీపురం, మే 3 , ప్రభాతవార్త: ప్రజల భద్రత ప్రధాన కర్తవ్యంగా జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో వున్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఆయా పోలీస్ అధికారులు , సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తూ , నియమాలు ఉల్లంఘించినవారి మీద అపరాధ రుసుం విధించడమే కాకుండా రోడ్డు భద్రత నియమాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మోటార్ వాహనాల చట్టాలు మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్ లేకుండా లేదా మద్యం సేవించి వాహనాలు నడపడడం, అతివేగంగా ప్రయాణించడం, ఓవర్ లోడ్, మైనర్ డ్రైవింగ్, వంటి కారణాల వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి అని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఎస్పీ ఆదేశాల మేరకు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడం మరియు ప్రజలు సురక్షితంగా ప్రయాణించేలా చేయడం ప్రధాన లక్ష్యం. రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబానికి కలిగే నష్టం పూడ్చలేనిది. ముఖ్యంగా కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

## సాలూరు మున్సిపాలిటీలో అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం



సాలూరు మే 3 ప్రభాతవార్త : సాలూరు పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా జరుగుతుంది.ప్లాస్టిక్ నిషేదం కాగితాలకు అలాగే కమీషనర్, హెల్త్ ఆఫీసర్స్ సమీక్షలకు, ప్రోగ్రామ్స్ కు పరిమితం అయ్యయని విమర్శలు వినపడుతున్నాయి. అంతేకాకుండ ప్రజారోగ్య అధికారులు నిర్లక్ష్యం వలన టౌన్ లో హోటల్స్ ఇంకా చిరు టిఫిన్ బండ్లు అలాగే ఊరు చివరన ఉన్న వైన్ షాపులు దగ్గరలో ఉన్న పాన్ షాపుల్లో ఇంకా దాబాలలో ప్లాస్టిక్ గ్లాసులు,కవర్లు పబ్లిక్ గా వినియోగంచడం పెద్ద హైలెట్ అని చెప్పుకోవచ్చు.ఇదిఇలాఉంచితే గత ఏడాది నవంబర్ లో స్వచ్ఛందర కార్పొరేషన్ నియమించిన నాలెడ్జ్ పార్టనర్ ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ సంయుక్తంగా నిర్వహించిన ప్రోగ్రాం లో మున్సిపాల్టీని ప్లాస్టిక్ రహితంగా కమీషనర్ ప్రకటించ ప్రకటించారుసాలూరు పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా చేస్తామని ప్రకటించిన అప్పటినుండి కొన్ని కొన్ని దుకాణాలు,షాపుల్లో ఆకస్మిక తనికీలు దాడులు చేసి ఫైన్లు వేయడం జరిగిందని కమీషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. అయినప్పటికీ ఊరుచివర ఉన్న పాన్ షాపుల్లో వాటర్ ప్యాకెట్లు, ప్లాస్టిక్ గ్లాసులు అమ్మకాలు సాగిస్తున్నట్టుగా మా దృష్టికి వచ్చిందని దీనిపై తగు చర్యలు తీసుకుం టామని క్లారిటీ ఇచ్చారు.

## కొనసాగుతున్న మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్



పాచిపెంట, ప్రభాతవార్త,మే 3 : పాచిపెంట గ్రామానికి చెందిన దివంగత జరజాపు జగన్నాధరావు (జగన్) జ్ఞాపకార్థము స్మారక మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ను శుక్రవారం నుండి కొనసా గుతోంది. ఈ టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు సీనియర్ జట్టుకి మొదటి ప్రైజ్ 25000 రూపాయలు, ద్వితీయ ప్రైజ్ 15000 రూపాయలు, జ్ఞాపిక అలాగే జూనియర్స్ విభాగం విజేతలకు 6000 రూపాయలు మొదటి బహుమతి, రెండో బహుమతికి 5000 రూపాయలతో పాటు జ్ఞాపికను అందజేస్తారని నిర్వాహకులు దుగ్గివలస ప్రదీప్ తెలిపారు. అలాగే బెస్ట్ బ్యాటింగ్ బెస్ట్ బౌలర్‌కు జ్ఞాపికను అందజేయనున్నట్లు ఆయనతెలిపారు. ఈ స్మారక క్రికెట్ టోర్నమెంట్ కు నియోజకవర్గము నుండి 50 టీములు పాల్గొన్నట్లు క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు దుగ్గివలస ప్రదీప్ తెలిపారు.

## అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు మంచి ఆదరణ : సీఐ



నెల్లిమర్ల, మే 3, ప్రభాతవార్త : అంకితభావంతో పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రజల్లో ఎప్పటికీ ఆదరణ ఉంటుందని భోగాపురం రూరల్ సీఐ జి. రామకృష్ణ అన్నారు. నెల్లిమర్ల పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అల్లూరి మురళి (రాజు) దంపతులకు పోలీస్ స్టేషన్ సిబ్బంది దుస్సాలువలతో ఘనంగా సత్కరించారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజు దంపతులకు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రూరల్ సిఐ రామకృష్ణ చేతుల మీదుగా ఘన సత్కారం చేశారు. పోలీసు సిబ్బంది తరుపున జ్ఞాపికలు అందజేశారు. నెల్లిమర్ల ఎస్ఐ బి గణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిఐ రామకృష్ణ మాట్లాడుతూ 33 ఏళ్ల సర్వీసును మురళి రాజు విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు పని చేసిన ప్రతి చోట పనితీరు కనబరిచి ప్రశంసలు అందుకున్నారన్నారు.

## మెరుగైన విద్యాప్రమాణాలు ... ఫలించిన అధికారుల పర్యవేక్షన

గరివిడి, మే3, ప్రభాతవార్త : గరివిడి మండలంలో గల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయి. గతంలో కంటే ఉత్తమ ఫలితాలు ప్రభుత్వ బడుల్లో సాక్షాత్కరించాయి. టెన్త్ ఫలితాలు అందుకు నిదర్శనంగా నిలిచాయి. ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ పాఠశాలలు కు దీటుగా ఫలితాలు రావడం తోపాటు,అత్యధిక మార్కులు విద్యార్థులు సాదించి సత్తా చాటారు. అయ్యవార్ల కృషి సఫలీకృతం కాగా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉన్నత ఫలితాలు సాధనకు కారణంగా పేర్కొనవచ్చు. మండలంలో గరివిడి కె జి బి వి తో కలిపి 13 ఉన్నత పాఠశాలల పదవ తరగతి ఫలితాలు పరికిస్తే విద్యా ప్రమాణాలు ఏ మేరకు మెరుగయ్యాయనేది ఇట్టే ద్యోతకమవుతోంది. మండలం లో 13 పాఠశాల లకు సంబంధించి 501 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 454 మంది ఉత్తీర్ణులయ్యారు. 90.61 శాతం మండలం లో టెన్త్ ఉత్తీర్ణత సాధించింది.అలాగే దేవాడ, కోనూరు, కె జి బి వి గరివిడి, తొండ్రంగి ఉన్నత పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాదించి విద్యార్థులు సత్తాచాటారు.కోనూరు కి చెందిన ఎం.లిఖిత 589 మార్కుల తో మండలం లో అగ్రస్థానాన్ని సాధించింది. శివరాం కి చెందిన కల్పన 586,తొండ్రంగి కి చెందిన ఆర్.మనశ్విని 583 మార్కులు సాదించి అత్యున్నత ప్రతిభ కనబరిచింది. అలాగే మరో ఎనిమిది మంది విద్యార్థులు 500 కి పైగా మార్కులు సాదించి తమ ప్రతిభను చాటుకున్నారు. మండలం లో విద్యార్థులు విద్యా ప్రగతికి ప్రధానంగా అధికారులు నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల తో ప్రత్యేక పాఠాలు వల్లింప జేయడం తోడ్పడిందని చెప్పవచ్చు. పరీక్షలు ముందు రైజింగ్, షైనింగ్ స్టార్లు గా విభజన చేయడం,నిత్యం పరీక్షలు నిర్వహించి విద్యార్థుల తో సాధన చేయించడం వంటి విద్యా సాధన కార్యక్రమాలు ఉన్నత ఫలితాలు సాధనకు తోడ్పాటు నందించాయని పేర్కొనక తప్పదు. ఉన్నారు.

## హెల్మెట్ ప్రాముఖ్యతపై వాహనచోదకులకు అవగాహన



మక్కువ, మే 3 ప్రభాతవార్త: మక్కువ శ్రీదేవి థియేటర్ కూడలి వద్ద హెల్మెట్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం స్థానిక ఎస్సై వెంకటరమణ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారిపై కేసులు నమోదు చేసి, గరిష్టంగా రూ.1,035/ వరకు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. హెల్మెట్ ధరించిన వాహన చోదకులను సిబ్బంది అభినందించారు.జనవరి 2026 నుండి ఇప్పటివరకు 40 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేయగా, వారిలో ఇప్పటికే 15 మందికి రూ.10,000/ చొప్పున జరిమానా విధించబడింది అని మరియు కొంతమందిని జైలుకు పంపించడమైంది అని తెలిపారు . ఇప్పటి వరకు మక్కువ పోలీస్ స్టేషన్ పరిధిలో 125 ఓపెన్ డ్రింకింగ్, 9 ఓవర్ లోడ్ కేసులు బుక్ చేశామన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని టూ వీలర్స్ నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని మక్కువ పోలీసులు సూచించారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

## ఘనంగా బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్టాపన



నెల్లిమర్ల, మే 3 ప్రభాతవార్త : మండలంలోని చంద్రంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేదపండితుల ఆధ్వర్యంలో ఆదివారం వేకువ జాము నుంచి మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ ప్రతిష్ట మహోత్సవాల్లో ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్నారు. బంగారమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కుంభాభిషేక పూజా కార్యక్రమాల్లో ఆమె నిమగ్నమై, అమ్మవారికి ప్రత్యేక హారతిని సమర్పించారు. నియోజకవర్గ ప్రజలందరికీ సుఖశాంతులు చేకూరాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఈ సందర్భంగా ఆమె ప్రార్థించారు. అనంతరం వందలాది మందికి అన్న సమారాధన ఘనంగా జరిగింది. డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు, కూటమి నాయకులు కరుమజ్జి గోవిందరావు, పతివాడ గోవిందరావు, గదల అచ్చం నాయుడు, తాళ్లపూడి సన్యాసప్పుడు, వైసీపీ నాయకులు కర్రోతు వెంకటరమణ, వాళ్లే అప్పలనాయుడు, సత్యారావు, పార్టీ కార్యకర్తలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రామమందిరం ప్రతిష్టలో బొత్స అప్పలనర్సయ్య



రామమంద్నిర ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య

దత్తిరాజేరు, మే 3 ప్రభాతవార్త : మండలంలోని చౌదంతివలస గ్రామంలో నూతనంగా నిర్మించిన రామ్ మందిర్ ప్రతిష్ట మహోత్సవానికి వైయస్సార్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య మరియు మండల వైసీపీ నాయకులందరూ పాల్గొన్నారు వీరికి పురోహితులు మంత్రాచరణ మధ్య గోత్రనామాలతో అభిషేక పూజలు చేశారు స్వామివారి తీర్థ ప్రసాదం స్వీకరించారు గ్రామ పెద్దలు ప్రజలు సీతారాములు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భక్తులు పాల్గొని పురోహితులుపూజలు చేశారు రామ్ మందిర్ పూర్ణపు కొండపై భక్తులు ప్రస్నాద బూర్లు ర్లు వేశారు అవిభక్తులు ప్రసాద స్వీకరించారు ప్రతిష్ట కార్యక్రమానికి వచ్చిన భక్తులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రస్నాద స్వీకరించారన్నారు భక్తులందరికీ కమిటీ సభ్యులు సహకరించారు అన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



కురుపాం, మే3, ప్రభాతవార్త : ఎల్విన్ పేట సర్కిల్ ఇన్స్పెక్టర్ హరి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఆదివారం కృప మండలం మూలిగూడ సెంటర్ వద్ద కురుపాం, నీలఖంఠపురం ఎస్ఐ లు పి నారాయణ రావు, నీలకంఠరావు లతో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరక కురుపాం మండలం మూలుగూడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు.హెల్మెట్ లేని వారికి హెల్మెట్లు కొనుక్కోమని చెప్పడమైనది కొంతమందికి హెల్మెట్ లేని వారికి ఫైన్లు విధించారు.ట్రాఫిక్ రూల్స్ ,రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు.

## సంచరిస్తున్న గజరాజులు.. పలుచోట్ల పంటలు ధ్వంసం



గరుగుబిల్లి, మే 3, ప్రభాత వార్త: దాదాపు గడిచిన పది రోజుల నుంచి మండల పరిధిలోని నందివానివలస, తోటపల్లి, సుంకి పరిసర ప్రాంతాల నుంచి కరి రాజులు కదలకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గడిచిన కొద్ది రోజుల నుండి ఏనుగులు సంచరిస్తుండడంతో తోటపల్లి, నందివానివలస తదితర గ్రామాల పరిధిలోని పంట పొలాల్లో సంచరిస్తూ పంటలు పాడు చేస్తుండడంతో తీవ్ర నష్టాలకు గురవుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. అదే విధంగా తోటపల్లి, నందివానివలస తదితర గ్రామాల సమీపంలో ఏనుగులు గుంపు సంచరిస్తుండడంతో పరిసర గ్రామాల ప్రజలు పంట పొలాలకు వెళ్లేందుకు భయాం దోళనలు వ్యక్తం చేస్తున్నారు. అదే విధముగా ప్రస్తుతం పంట పొలాల్లో ఉన్న పంటలను పాడు చేస్తుండ డంతో నష్టాలకు గురవుతున్నామని రైతులు అంటున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలిం చేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## పోలీసుల వాహన తనిఖీ



లక్కవరపు కోట, మే 3, ప్రభాత వార్త : మండలం లోని ఎల్ కోట హాస్టల్ జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం ఎల్ కోట ఎస్ ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పలు వాహనాలు అపి వాహనాలు తనిఖీ చేశారు అధిక లోడ్ లతో వెళుతున్నా లారీ లకు చలానాలు విధించారు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి కూడా చలానాలు విధించారు పాత చలానాలు ఉంటే కట్టించారు ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ వాహనం దారులు విదిగా అన్ని పేపర్లు లైసెన్స్ కలిగి ఉండాలి అని ఎటువంటి అక్రమ రవాణాలు చేయకూడదు అని గంజాయి అక్రమ మద్యం వంటి వి వాహనాల్లో తరలించ కూడదు అని ఆలా చెస్తె కేసులు తప్పవు అన్నారు మద్యం తాగి వాహనాలు నడీపీ ప్రమాదం పాలు కావొద్దు అన్నారు

## గురాన అయ్యలు జన్మదిన వేడుకలు



విజయనగరం, మే 3, ప్రభాత వార్త: జనసేన పార్టీ సీనియర్ నాయకులు గురాన అయ్యలు జన్మదిన వేడుకలను జనసైనికులు, పార్టీ కార్యకర్తలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటూ పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టారు. వేడుకల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పేదలకు, బాటసారులకు జనసైనికులు భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. ప్రస్తుత వేసవి కాలం, ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు పలు చోట్ల చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమాలకు స్థానిక ప్రజల నుండి విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన నాయకులు , అభిమానులు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సమస్యలపై స్పందించే గురాన అయ్యలు మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కోరుకున్నారు. ఆయన ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. వేడుకల్లో జనసేన పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ప్రొటీన్ పౌడర్ తాగుతున్నారా?



వేగంగా బరువు తగ్గాలనుకునే వారు, ఫిట్‌నెస్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టేవారు ప్రొటీన్ పౌడర్లను తీసుకోవడం గమనిస్తుంటాం. అయితే వాడే ముందు మాత్రం కొన్ని గమనించుకోవాలి. 30 ఏళ్లు దాటాక మన ఎముకల్లో సాంద్రత తగ్గడం మొదలవుతుంది. కీళ్లనొప్పులు, ఆస్టియోపోరోసిస్ వంటి వాటి బారిన పడొద్దంటే ప్రొటీన్ సరిగా తీసుకుంటున్నదీ లేనిదీ గమనించుకోవాలి. మన శరీరం సరిగా పనిచేయడానికి 20 రకాల అమైనోయాసిడ్‌లు అవసరం. ఇవన్నీ కలిసి శరీరంలో ప్రొటీన్‌లుగా మారతాయి. వీటిలో కొన్ని ఆహారం ద్వారానే అందుతాయి. ఇవి సక్రమంగా అందుతున్నాయా లేదా అనేది రోజూ గమనించుకోవడం కష్టం కదా! అందుకే చాలామంది ఎంపిక ప్రొటీన్ పౌడర్లు అవుతున్నాయి. సోయాబీన్, బఠాణి, వరి, బంగాళదుంప, గుడ్లు, పాలు.. వంటివాటి నుంచి సాధారణంగా ఈ పౌడర్లను తయారు చేస్తుంటారు. ప్రొటీన్లు మెటబాలిజాన్ని మెరుగుపరిచి, అనవసర కొవ్వులను కరిగేలా చేస్తాయి. ఎముకలను దృఢంగా మారుస్తాయి. ప్రొటీన్ సంబంధిత పదార్థాలను తీసుకున్నాక చాలావరకూ ఆకలి వేయదు. అలా కెలోరీలు తగ్గుతాయి. గత కొన్నేళ్లుగా ఆస్టియో పోరోసిస్ బారిన పడుతున్న మహిళల సంఖ్య పెరుగుతోందని గణాంకాలు చెబుతున్నాయి. వయసుతోపాటు చర్మంలో కొల్లాజన్ ఉత్పత్తి తగ్గుతుంది. దీంతో నెమ్మదిగా వృద్ధాప్య ఛాయలు మొదలవుతాయి. అది వేగంగా జరగొద్దన్నా, కురుల ఎదుగుదల, గోళ్లు దృఢంగా ఉండాలన్నా తగినంత ప్రొటీన్ తప్పనిసరి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండానూ కాపాడతాయి. ఇప్పుడు మార్కెట్‌లో బోలెడు రకాలూ అందు బాటులో ఉన్నాయి. అయితే వాడే ముందు నిపుణుల అభిప్రాయం తీసుకోవడం తప్పనిసరి. అయితే వీటిపైనే పూర్తిగా ఆధారపడటమూ మంచిది కాదు. పోషకా హారం తప్పని సరిగా తీసుకోవాలి. గుడ్లు, పప్పుధాన్యాలు, నట్స్, విత్తనాలు, పాలు వగైరాలకు ప్రాధాన్య మిస్తూనే దీన్ని అదనంగా తీసుకున్నప్పుడే ఆరోగ్య ప్రయోజనం చేకూరుతుందన్నని. మరి దాన్ని సరిగ్గానే అనుసరిస్తున్నారా అన్నది చెక్ చేసుకుంటారా మరి? □

# అపార్థాలకు తావివ్వకూడదంటే..

భార్యాభర్త లిద్దరి ఆలోచనలు ఒకేలా ఉండాలని రూలేం లేదు. ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకుంటూ మంచిచెడులను తర్కించుకుంటూ ఒకటిగా అడుగేసినప్పుడే ఆ దాంపత్యం కలకాలం నిలుస్తుంది. అందుకు ఇద్దరూ ఒకరి మాటను ఒకరు విని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా కాకుండా తమ భాగస్వామి మాట్లాడేటప్పుడు ఎప్పుడూ, ఏదో ఒక ఫిర్యాదు చేస్తూనే ఉంటుంది అంటూ తీసిపడేసినా, వినీవినట్లు ఉన్నా



పొపచ్చాలు తప్పవు. అపార్థాలకు తావివ్వకూడదంటే ఇలా చేసి చూడండి. మీ భాగస్వామి వ్యక్తి గత, వృత్తి కుటుంబ విషయమై ఏదైనా మీకు ఫిర్యాదు చేసినప్పుడు దాన్ని తారీఖుతో సహా వారిముందే డైరీలో రాసుకోండి. దీనివల్ల మూడు ఉపయోగాలు ఉన్నాయి. . సమస్యపై మీరు స్పందించడం లేదనో, పట్టించుకోవడం లేదనో భావన వారిలో పోతుంది. తప్పు మీలో ఉంటే దాన్ని సరిచేసుకుని మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్తపడచ్చు. ★. మీరు సమస్య వింటు న్నారు, దాన్ని సరిచేసుకునేందుకు ప్రయత్నిస్తారని వాళ్లకు తెలుస్తుంది. దాంతో గంభీరంగా ప్రారంభమైన వారి సంభాషణ చల్లబడుతుంది. వాదోపవాదాలు లేకుండా పరిస్థితి గట్టెక్కుతుంది. ★. తీరిక సమయాల్లో ఆ డైరీని తిరగవేయమని చెప్పండి. చిన్నచిన్న విషయాలకే వారు ఫిర్యాదులు చేస్తుంటే దాన్ని మానుకునే అవకాశం ఉంటుంది. □

# వేసవిలో పసి పిల్లల సంరక్షణ



**ముఖ్యమైన జాగ్రత్తలు** డీహైడ్రేషన్ కాకుండా చూడటం.. పసిపిల్లల శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవడం అన్నిటికంటే ముఖ్యం. తల్లి పాలు: ఆరు నెలల లోపు పిల్లలకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి. తల్లి పాలలోనే వారికి కావలసిన నీరు పుష్కలంగా ఉంటుంది. తరచుగా పాలు ఇస్తూ ఉండాలి.

**నీరు ఇతర పానీయాలు:** ఆరు నెలలు దాటిన పిల్లలకు కాచి చల్లార్చిన నీరు, కొబ్బరి నీళ్లు లేదా తాజా పండ్ల రసాలు ఇవ్వవచ్చు.

**లక్షణాలు:** శిశువు మూత్రం తక్కువగా పోయడం (రోజుకు 6 కంటే తక్కువ సార్లు) లేదా మూత్రం ముదురు పసుపు రంగులో ఉంటే వారికి డీహైడ్రేషన్ అయ్యే అవకాశం ఉందని గమనించాలి.

**సరైన దుస్తుల ఎంపిక..** పిల్లలకు సౌకర్యవంతమైన బట్టలు వేయడం ద్వారా వారిని చెమట కాయలు దురద నుండి కాపాడవచ్చు. నూలు దుస్తులు పిల్లలకు ఎప్పుడూ వదులుగా ఉండే కాటన్ బట్టలు మాత్రమే వేయాలి. ఇవి గాలి ఆడేలా చేస్తాయి మరియు చెమటను పీల్చు కుంటాయి.

**లేత రంగులు:** నలుపు లేదా ముదురు రంగుల కంటే లేత రంగు బట్టలు ఎండను తక్కువగా గ్రహిస్తాయి. **డైపర్లు:** ఎండా కాలంలో డైపర్ల వాడకం తగ్గించడం మంచిది. తడి వల్ల చర్మంపై రాషెస్ వచ్చే అవకాశం ఉంది. వీలైనంత వరకు కాటన్ లంగోటీలు వాడండి.

**గది ఉష్ణోగ్రత మరియు వాతావరణం..** పిల్లలు ఉండే గది చల్లగా, గాలి తగిలేలా ఉండాలి.

**ఎయిర్ కండిషనింగ్/కూలర్:** ఏసీ లేదా కూలర్ వాడుతున్నప్పుడు గాలి నేరుగా శిశువు మీద పడకుండా చూడాలి. గది ఉష్ణోగ్రత 24సి నుండి 26సి మధ్య ఉండేలా చూసుకోవడం మంచిది. కిటికీలు: మధ్యాహ్నం సమయంలో ఎండ రాకుండా కిటికీలకు పరదాలు వేయాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు తీసి ఉంచితే తాజా గాలి వస్తుంది. 4. బయటకు తీసుకెళ్లేటప్పుడు సమయం ఉదయం 10 గంటల నుండి సాయం త్రం 5 గంటల వరకు పిల్లలను బయటకు తీసుకెళ్లకపోవడమే ఉత్తమం రక్షణ తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు తీసుకెళ్లాల్సి వస్తే, గొడుగు వాడాలి లేదా శిశువు తలకు టోపీ ధరింపజేయాలి .స్నానం చర్మ సంరక్షణకు గోరువెచ్చని నీరు:రోజుకు రెండు సార్లు గోరువెచ్చని నీటితో స్నానం చేయించడం వల్ల పిల్లలు తాజాగా ఉంటారు

**. పౌడర్ల వాడకం:** చెమట కాయలు రాకుండా ఉండటానికి పౌడర్లు అతిగా వాడకండి. అది చర్మ రంధ్రాలను మూసివేస్తుంది. చర్మాన్ని పొడిగా ఉంచడం ముఖ్యం. మసాజ్: ఎండాకాలంలో మసాజ్ కోసం వాడే నూనె తక్కువగా వాడాలి, స్నానానికి ముందు ఆయిల్ అప్లై చేసి వెంటనే కడిగే యడం మంచిది. ఇతర జాగ్రత్తలు పిల్లలకు ఇచ్చే ఆహారం తాజాగా ఉండేలా చూడాలి. ఎండా కాలంలో ఆహారం త్వరగా పాడవు తుంది. పిల్లలు మత్తుగా ఉన్నా, జ్వరం వచ్చినా లేదా వాంతులు చేసుకుంటున్నా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఈ చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వేసవిలో మీ చిన్నారిని ఆరోగ్యంగా మరియు ఉల్లాసంగా ఉంచుకోవచ్చు! □

# శివశక్తి తత్త్వం

భారతీయ ఆధ్యాత్మికతలో శివశక్తి అత్యంత గంభీరమైన పరమ తత్త్వం. 'శివుడు' అంటే చైతన్యం, నిర్మలమైన సాక్షి స్వరూపం, 'శక్తి' అంటే ఆ చైతన్యానికి చలనం, సృష్టి, క్రియాశీలతను అందించే శక్తి. ఈ రెండూ వేరుగా కనిపించినా, వాస్తవానికి అవి ఒకే పరమ సత్యం రెండు పార్శ్వాలు. మనలో కూడా ఈ శివశక్తితత్త్వం ఉంది. మనలోని చైతన్యం శివుడు అయితే, మన ఆలోచనలు, భావాలు, చర్యలు....ఇవన్నీ శక్తి. మనం ధ్యానం, భక్తి, సాధన ద్వారా ఈ రెండింటిని సమతుల్యం చేస్తే, మన జీవితం సార్థకమవుతుంది. ఆయన సాక్షి , పరబ్రహ్మ స్వరూపం. అయితే శక్తి లేకుండా శివుడు క్రియారహితుడు. అలాగే శక్తి శివుని ఆధారంగా లేకుండా ఉండలేను. అందుకే 'శివశక్తి ఐక్యం' అనేది సృష్టి మూల సూత్రం. సృష్టి, స్థితి, లయ. ఇవన్నీ శక్తి ద్వారా జరుగుతాయి. కానీ ఆ శక్తికి మూలం శివుడు. ఇది అగ్ని. ఈ ఐక్యతను ప్రతిబింబించే రూపమే అర్ధనారీశ్వర స్వరూపం, ఇందులో శివుడు, పార్వతి ఒకే శరీరంగా దర్శనమిస్తారు. ఇది పురుషుడు, స్త్రీ శక్తుల సమతుల్యతను సూచిస్తుంది. యోగశాస్త్రంలో 'కుండలినీ శక్తి' అనే భావన ఉంది. ఇది మన శరీరంలో మూలాధార చక్రంలో నిద్రిస్తున్న శక్తిగా చెప్పబడుతుంది. ఈ శక్తి పైకి ఎగసి సహస్రార చక్రాన్ని చేరినప్పుడు, శివశక్తి ఐక్యం మనలో అనుభవంగా మారుతుంది. ఇది మోక్షానికి దారితీసే మార్గంగా భావించబడుతుంది. జీవితంలో జ్ఞానం . చర్య, శాంతి , శక్తి, ప్రేమ వివేకం.. సమంగా ఉండాలి. మొత్తానికి, శివశక్తి అనేది కేవలం ఒక ఆధ్యాత్మిక భావన మాత్రమే కాదు; అది మన జీవన విధానానికి మార్గదర్శకం. మనలోని శివుడిని (చైతన్యం), శక్తిని (క్రియాశీలత) గుర్తించి, వాటిని సమన్వయం చేసుకున్నప్పుడు మనం నిజమైన ఆనందాన్ని, శాంతిని పొందగలుగుతాం.

# సెలవుల్లో నాలుగు స్తంభాలాట



పిల్లలకు వేసవి సెలవు వచ్చాయి. వారికి వివిధ రకాల ఆటలు ఆడుకుం టారు. అందులో ఒకటి నాలుగు సంభాలాట. ఒకప్పుడు ఇళ్ల ముందు పందిళ్లు వేసేవారు. మండువా లోగిళ్లు. పెంకుటిళ్లు ఉండేవి. దాంతో అక్కడ ఉండే స్తంబాలను పట్టుకుని పిల్లలు.. ఆటలాడేవారు. అయితే, కాలక్రమంలో అన్నీ కాంక్రీట్ కట్టడాలుగా మారాయి. తరమూ మారింది. ఇప్పుడు స్తంభాలకు బదులు కర్రలతో ఈ ఆటను ఆడేస్తున్నారు. అదెలాగంటారా? ఎంతమంది ఉన్నారో అన్ని కర్రలు తీసుకోండి. ప్రతి ఒక్కరూ కుడిచేత్తో ఒక కర్ర పట్టుకుని, ఎడమ చేతిని వెనక్కి పెట్టి గుండ్రంగా నిలబడండి. ఇప్పుడు అదే క్రమంలో తిరుగుతూ.. పట్టుకున్న కర్రని వదిలి.. మరొకరి చేతిలో ఉన్నదాన్ని అందుకోవాలి. ఎవరైతే ముందున్న కర్ర పట్టుకోలేక వదిలేస్తారో వాళ్లు ఆట నుంచి బయటకి వెళ్లిపోతారు. ఈ ఆట వల్ల మెదడుకీ, శరీరానికి సమన్వయం ఏర్పడుతుంది. ఏకాగ్రత అలవడుతుంది. బృంద స్ఫూర్తినతనీ తెలుసుకోగలుగుతారు.

# వెజ్ బుర్జీ



కావలసినవి : శనగపిండి: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, టమాటా: రెండు, పచ్చిమిర్చి: నాలుగు, జీలకర్ర: అర టీస్పూన్, గరం మసాలా: అర టీస్పూన్, మిరియాల పొడి: పావు టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ధనియాల పొడి: ఒక టీస్పూన్, సన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి: అర టీస్పూన్, పసుపు: అర టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా, నూనె: అర కప్పు, ఉప్పు:తగినంత, వంటసోడా: చిటికెడు, నిమ్మరసం: రెండు టీస్పూన్లు.

**తయారీ:** ఒక గిన్నెలో శనగపిండి, కొద్దిగా ఉప్పు, వంటసోడా వేసి నీళ్లుపోసి కొంచెం జారుగా కలిపి పెట్టుకోవాలి. తర్వాత జీలకర్ర, అల్లం వెల్లుల్లి తరుగు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి నూనెలో దోరగా వేయించాలి. బాగా వేగాక.. చిన్నగా తరిగిన టమాటా ముక్కలు, కారం, ఉప్పు, పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, మిరియాల పొడి వేసి బాగా కలిపి మూతపెట్టి సన్నని మంటపై అయిదు నిమిషాలు మగ్గించాలి. ముందుగా కలిపి పెట్టుకున్న పిండి మిశ్రమాన్ని అందులో వేసి, కదపకుండా మూతపెట్టి సన్నని మంటపై పది నిమిషాలు ఉడికించాలి. గరిటెతో కదుపుతూ ముక్కలు ముక్కలుగా చేస్తూ బాగా వేయించాలి. చివరగా కొత్తిమీర తురుము, నిమ్మరసం వేసుకుంటే నోరూరించే వెజ్ బుర్జీ సిద్ధం.



# గోపీచంద్ 34 ఘనంగా ప్రారంభం



హీరో టి. గోపీచంద్ ప్రతిష్టాత్మక చిత్రం గోపీచంద్34 ద్వారా ప్రముఖ ఫైట్ మాస్టర్ వి వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. బలమైన కథాంశాలతో కూడిన చిత్రాలను అందించడంలో పేరుపొందిన '70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్' బ్యానర్‌పై, విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కథానాయికగా మలయాళ నటి అనార్కలి నజర్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం నేడు పూజా కార్యక్రమాలతో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు చిత్ర యూనిట్ సభ్యులతో పాటు పలువురు ప్రత్యేక అతిథులు హాజరయ్యారు. గ్రాండ్ గా జరిగిన ముహూర్త కార్యక్రమంలో దర్శకుడు శివ నిర్వాణ, నిర్మాత రీలి దామోదర్ ప్రసాద్, మైత్రి మూవీ మేకర్స్ రవి శంకర్ స్క్రిప్ట్‌ను అందజేశారు. యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మల్లెమాల శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఫస్ట్ క్లాప్ కొట్టారు. నిర్మాత దిల్ రాజు ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్‌ఖ వంటి బలమైన నిర్మాణ సంస్థ గోపీచంద్34 చిత్రాన్ని అత్యున్నత నిర్మాణ విలువలు, సాంకేతిక నైపుణ్యంతో కూడిన ఒక సరికొత్త కథాంశాన్ని ప్రేక్షకులకు అందించనుంది. దర్శకుడిగా తన తొలి చిత్రంతో వి వెంకట్ ఒక బలమైన స్క్రిప్ట్‌ను రూపొందించారు. గోపీచంద్‌ను పూర్తి యాక్షన్ అవతార్‌లో, ఇంటెన్స్ డ్రామా, ఎమోషన్స్ కూడిన పాత్రలో ప్రజెంట్ చేయనున్నారు.

# 7న రానున్న 'అగధ' టీజర్



తాంత్రిక థ్రిల్లర్ 'అగధ' అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది. ఎందుకంటే, ఈ చిత్ర దర్శక నిర్మాతలు విడుదల చేసిన తొలి పోస్టర్‌తోనే భారీ ఉత్సుకతను రేకెత్తించగలిగారు. ఒక భారీ విగ్రహం ముందు ఒక మహిళ నిలబడి ఉన్న చిత్రం యొక్క మొట్టమొదటి పోస్టర్, ట్రేడ్, ప్రేక్షకులు మరియు వ్యాపార వర్గాలలో సినిమాపై ఆసక్తిని పెంచింది.

ఇప్పుడు దర్శక నిర్మాతలు ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో, ఒక చీకటి గుహ లాంటి ప్రదేశంలో ఒక వ్యక్తి నిర్భయంగా నిలబడి, అనేక చేతులు కలిగిన ఒక భారీ తాంత్రిక విగ్రహాన్ని ఎదుర్కొంటున్నట్లుగా ఉంది. అతని చుట్టూ క్రతువుల అగ్నుల నుండి జ్వాలలు పైకి లేస్తున్నాయి, మరియు అతను ఒక చేతిలో కత్తిని, మరొక చేతిలో తెగిపోయిన వస్తువును పట్టుకుని ఉన్నాడు. ఇది దైవిక తాంత్రికత మరియు ప్రమాదంతో కూడిన ఒక శక్తివంతమైన ఘర్షణను సూచిస్తుంది. కేవలం పోస్టర్ల ద్వారానే 'అగధ' ఈ స్థాయిలో ఎలా సందడిని సృష్టించగలిగిందనేది ప్రత్యేకంగా నిలుస్తుంది. 'అగధ' టీజర్ మే 7వ తేదీ ఉదయం 10.20 గంటలకు విడుదల కానుందని పోస్టర్ అధికారికంగా ప్రకటించడంతో, అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయి.

విలక్షణమైన కాన్సెప్ట్‌లను అందించడంలో పేరుగాంచిన ఎం. ఎస్. రాజు ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహించారు. శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్న అగధ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషలలో ఏకకాలంలో భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.



# 'ది రెడ్ బ్యాగ్' చిత్రీకరణ పూర్తి

డిఫరెంట్ కాన్సెప్ట్, కంటెంట్‌తో కొత్త నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాని నిర్మిస్తున్నారు. ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే కథతో 'ది రెడ్ బ్యాగ్' అనే సినిమాకి రవి కుమార్ సీరపు కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్‌ను టీం పూర్తి చేసింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ అందరిలోనూ సినిమాపై ఆసక్తిని పెంచేసింది. రీసెంట్‌గా థాయ్‌లాండ్‌లో సినిమా టీం కీలక సన్నివేశాల్ని, ఓ పాటను షూట్ చేసింది. థాయ్‌లాండ్‌లోని అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సీన్స్ సినిమాకి హైలెట్‌గా నిలవనున్నాయి. ఇక ఈ చిత్రంలో కబీర్ సింగ్ ఓ డిఫరెంట్ పాత్రను పోషిస్తున్నారు. ఇంత వరకు ఆయన్ను అలాంటి ఓ పాత్రలో ఆడియెన్స్ చూసి ఉండరు. ఇక ఈ మూవీలో కబీర్ సింగ్‌తో పాటుగా ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బదల్, భార్గవి తదితరులు నటించారు. ప్రస్తుతం ఈ చిత్రాన్ని త్వరలోనే రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీజర్‌ను రెడీ చేస్తున్నట్టుగా టీం తెలిపింది. ఇక టీజర్‌తో మూవీపై మరింత బజ్ క్రియేట్ కానుంది.

# 'గోదారి గట్టుపైన' అందరూ రిలేట్ అయ్యే కథ: డైరెక్టర్ సుభాష్ చంద్ర



యంగ్ హీరో సుమంత్ ప్రభాస్ రూరల్ లవ్, ఫ్యామిలీ డ్రామా 'గోదారి గట్టుపైన'తో అలరించబోతున్నారు. సుభాష్ చంద్ర దర్శకత్వంలో రెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ నిర్మించింది. నిధి ప్రదీప్ ఈ చిత్రంలో కథానాయికగా నటించగా, జగపతి బాబు కీలక పాత్రలో కనిపించనున్నారు. టీజర్, ట్రైలర్ పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ఈ చిత్రం మే 8న వరల్డ్‌వైడ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ సుభాష్ చంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీ నేపథ్యం గురించి?** మాది రేలంగి. మా నాన్నగారు బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. నేను బీటెక్ చదువుతున్నప్పటి నుంచే షార్ట్ ఫిలిమ్స్ చేయడం ప్రారంభించాను. దాదాపు 80 షార్ట్ ఫిలిమ్స్ చేసిన తర్వాత చెన్నైలో ఎల్‌వీ ప్రసాద్ ఫిలిం ఇన్స్టిట్యూట్‌లో ఫిలిం మేకింగ్ కోర్స్ చేశాను. ఆ తర్వాత ఫీచర్ ఫిలిమ్స్‌లోకి వచ్చాను. నేను ఎక్కువగా రాజ్ తరుణ్‌తో షార్ట్ ఫిలిమ్స్ చేశాను. **మీరు దాదాపుగా వంద షార్ట్ ఫిలిమ్స్ చేశారు.. డైరెక్టర్‌గా మీ నుంచి సినిమా రావడానికి ఇంత సమయం పట్టడానికి కారణం?** నేను ఎప్పుడూ ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. ఒక సినిమా ప్రీ ప్రొడక్షన్ మొత్తం పూర్తి చేసి షూటింగ్‌కు వెళ్లే సమయానికి ఆగిపోయింది. మరో సినిమా పూర్తయింది కానీ రిలీజ్ కాలేదు. ఆ సినిమా విడుదల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేనికైనా ఒక సమయం రావాలని నేను నమ్ముతాను. ఆ సమయం 'గోదారి గట్టుపైన' సినిమాతో వచ్చిందని భావిస్తున్నాను. **గోదారి గట్టు కోసం సుమంత్ ప్రభాస్ గారిని ఎంపిక చేయడానికి కారణం?** ముందుగా సునీల్ నారంగ్, జాన్వి నారంగ్ గారికి థాంక్స్ చెప్పాలి. వారే సుమంత్ గారిని రిఫర్ చేశారు. వాళ్లు మా ప్రొడ్యూసర్ గారి పార్ట్నర్స్. సుమంత్ గారికి కథ చెప్పగానే ఆయనకి చాలా నచ్చింది. ఇది ఆయనకు పర్ఫెక్ట్‌గా సరిపోయే కథ. ఈ సినిమాలో సుమంత్ గారిది గోదావరి అబ్బాయి పాత్ర. గోదారి యాసను పర్ఫెక్ట్‌గా పలికారు. అందుకోసం చాలా ట్రైనింగ్ తీసుకున్నారు. అలాగే ప్రమోషన్స్ సుమంత్ గారి సపోర్ట్‌ని మర్చిపోలేను. **టెక్నీషియన్స్ గురించి?** ఇప్పటివరకు నాతో పని చేసిన టెక్నీషియన్స్‌నే ఈ సినిమాకి తీసుకున్నాను. కలిసి పని చేశాం కాబట్టి సక్సెస్ కూడా కలిసి పొందాలని అనుకున్నాను. నా టీమ్ నాకు చాలా బలం. నా ఆలోచనలు వాళ్లకు చాలా క్లియర్‌గా అర్థమవుతాయి. **ఈ ప్రేమ కథ ఎంత కొత్తగా ఉంటుంది?** ఈ కథ మన జీవితాల్లో చూసినదే. ప్రతి ఇంట్లో తండ్రి-కూతురు ఉంటారు, వారి మధ్య ప్రేమ ఉంటుంది. అలాగే ఇద్దరు ప్రేమికుల మధ్య ప్రేమ కూడా ఉంటుంది. ఈ రెండింటినీ ట్రయాంగిల్ ఫార్మ్‌లో చూపించాను. సినిమా అందరూ రిలేట్ చేసుకునేలా ఉంటుంది. తప్పకుండా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. **జగపతి బాబు గారి పాత్ర గురించి?** ఈ సినిమాలో జగపతిబాబు గారి పాత్ర మా బాబాయి పాత్ర నుంచి ఇన్‌స్పిరేషన్‌తో రాసుకున్నాను. సినిమాలో ఆయన వాడిన బండి కూడా మా బాబాయి గారిదే. ప్రతి తండ్రికీ తన కూతురికి తనకంటే బెటర్ వ్యక్తికి ఇవ్వాలని వుంటుంది. ఇది ఆయన ప్రేమలో ఉన్న నిజం. అలాగే అబ్బాయి ప్రేమలో నిజం ఉంటుంది. అలాంటి అంశాన్ని ఇందులో చెప్పాలని ప్రయత్నించాం. ఎన్ని తరాలు మారినా ప్రేమ ఎమోషన్ ఒకటే. ఈ కథను చాలా పరిణితితో ట్రీట్ చేశాం. **నిధి ప్రదీప్ గురించి?** ఈ కథే నటులను ఎంచుకుంది. నిధి ప్రదీప్ భరతనాట్యంలో కూడా ప్రావీణ్యం కలిగినది. కొన్ని సీన్లు ఇచ్చినప్పుడు చాలా అద్భుతంగా చేసింది. ఆమె కళ్లలో మంచి ఎక్స్‌ప్రెషన్స్ ఉంటాయి. ఈ పాత్రకు ఆమె పర్ఫెక్ట్ అనిపించింది.

**లైలా గారి గురించి?** లైలా గారు నాకు చిన్నప్పటి నుంచే చాలా ఇష్టం. 'ఎగిరే పావురమా' చూసినప్పటి నుంచి ఆమెంటే ఇష్టం. ఇందులో జగపతిబాబు గారితో ఆమె కాంబినేషన్ కొత్తగా ఉంటుంది. ఆయనకు ఎదురుగా నిలబడే హుందాతనం ఉన్న పాత్ర కావాలి. దాదాపు 20 ఏళ్ల తర్వాత లైలా గారు తెలుగులో నటిస్తున్నారు. ఇందులో చాలా ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. **మ్యూజిక్ గురించి?** ఈ సినిమాకు నాగ వంశీ అద్భుతమైన పాటలు ఇచ్చారు. మాకు 12 ఏళ్ల స్నేహం ఉంది. ఒక రెట్రో సాంగ్ చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఈ సినిమాతో ఆ అవకాశం దొరికింది. చిత్ర గారు, ఎస్పీ చరణ్ గారితో ఆ పాటను పాడించడం మర్చిపోలేని అనుభూతి. **నిర్మాత అభినవ్ గురించి?** అభినవ్ గారు చాలా ప్రొఫెషనల్. ఎవరి పని వారు చేయాలనే ఆయన సిద్ధాంతం. మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు.

# 'వేదవ్యాస్' సినిమా విజువల్ లోగో ఆవిష్కరణ




ప్రముఖ దర్శకులు ఎస్.వి. కృష్ణారెడ్డి దర్శకత్వంలో 'వేద వ్యాస్' చిత్రాన్ని నిర్మిస్తున్న సంస్థ 'సాయి ప్రగతి ఫిలిమ్స్' బ్యానర్ విజువల్ లోగో ఆవిష్కరణ మే 2 వ తేదీ సాయంత్రం ఘట్కేసర్ లోని KPRIT విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలో ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. షిర్డీ సాయిబాబా విగ్రహానికి నిర్మాత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఎస్.వి. కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి కలసి పూజ చేస్తున్న దృశ్యాన్ని బ్యానర్ లోగోలో చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత ప్రతాప్ రెడ్డితో పాటు దర్శకులు ఎస్‌వి కృష్ణారెడ్డి , సమర్పకులు అచ్చిరెడ్డి , హీరో పిడుగు విశ్వనాథ్ , నటుడు రఘుబాబు, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి శ్రీ రామ్ వెంకటేష్ , అనేకమంది అతిథులు హాజరయి 'వేద వ్యాస్' సినిమా విజయవంతం కావాలని అభిలషిస్తూ ప్రసంగించారు.

04-05pg10.qxd OK:04-05pg10.qxd 1/1/02 7:02 AM Page 1



# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను తిప్పేసిన వరుణ్




**సొంతగ్రౌండ్‌లో ఆరేంజ్ ఆర్మీ ఆరంభం అంతా సాఫీగానే సాగింది. ఉప్పల్‌లో ఉప్పెన ఖాయంగా కనిపించింది. పవర్ ప్లేలోనే 71 రన్స్. పది ఓవర్లలో వందకు పైగా రన్స్. క్రీజ్‌లో ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్‌ల విధ్వంసకర బ్యాటింగ్. అంతలోనే హైదరాబాద్ వికెట్లు టపటపా రాలాయి. 60 పరుగులకే 9 వికెట్లు అదీ ఒక ఓవర్ ఉండగానే కోల్పోయింది. భారీ స్కోరు చేస్తుందనుకున్న సన్‌రైజర్స్ స్వల్ప స్కోరుకే ఖేల్ ఖతమైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్నర్లు హైదరాబాద్‌ను తిప్పేశారు. ఫలితం అయిదు విక్టరీల జైత్రయాత్రకు బ్రేక్.**

**హైదరాబాద్, మే3(వార్త క్రీడా ప్రతినిధి):** ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో దూసుకు పోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు సొంత గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలోనే ఫుల్‌స్టాప్ పడింది. ఉప్పల్‌లో వరుసగా మూడు విజయాల జోరుతో బయట కూడా రెండు విజయాలతో హైదరాబాద్ చేరిన సన్‌రైజర్స్‌కు కేకేఆర్ కళ్లెం వేసింది. 7 వికెట్ల తేడాతో హైదరాబాద్‌ను ఓడించింది. సన్‌రైజర్స్ ఉంచిన 165 పరుగులకు స్వల్ప లక్ష్యాన్ని.. కోల్‌కతా 18.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 59), కెప్టెన్ అజింక్య రహానె (36 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 43) గెలుపుకు బాటలు వేశారు. ఫిన్ అలెన్ (13 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 29) ఫర్వాలేదనిపించాడు. రింకు సింగ్ (11 బంతుల్లో 22), కామరూన్ గ్రీన్(3) మిగతా పనిని పూర్తి చేశారు. 10 మ్యాచ్‌ల్లో హైదరాబాద్‌కు ఇది నాలుగో ఓటమి. ఆరంభంలో వరుస పరాజయాలు చవిచూసిన కోల్‌కతాకు ఇది హ్యాట్రిక్ విజయం. ప్రస్తుతం కేకేఆర్ ఖాతాలో ఏడు పాయింట్లున్నాయి.

అంతకుముందు సన్‌రైజర్స్‌కు ఆదిరే ఆరంభం లభించింది. అభిషేక్(10 బంతుల్లో 15), ట్రావిస్ హెడ్(28బంతుల్లో 9ఫోర్లు, 3సిక్స్‌లతో61) 44పరుగుల ఫ్లయింగ్‌స్టార్‌న ఇచ్చారు. అభిషేక్ ఇన్నింగ్స్‌కు కార్తీక్ త్యాగి తెరదించాడు. క్రీజ్‌లోకి వచ్చిన ఇషాన్ కిషన్(29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42)తో కలిసి ట్రావిస్ హెడ్ ధాటిగా ఆడుతూ స్కోరు వంద దాటించాడు. వరుణ్ చక్రవర్తి ఎంట్రీతో సీన్ ఒక్కసారిగా రివర్స్ అయింది. ట్రావిస్ హెడ్‌ను బోల్తా కొట్టించిన వరుణ్.. రవిచంద్రన్(4), అనికేత్(6)ను కూడా పెలిలియన్ పంపాడు. మరో ఎండ్‌లో కామెరూన్ గ్రీన్, సునీల్ నరైన్ ధాటికి హైదరాబాద్ పేకమేడలా కూలింది. సలీల్ అరోరా (2), కమిన్స్ (10) కూడా నిరాశపర్చారు. 8.5 ఓవర్లకు 105/1తో పటిష్ఠ స్థితిలో ఉన్న హైదరాబాద్.. 60 పరుగులకు చివరి 9 వికెట్లు కోల్పయింది. 19 ఓవర్లలోనే 165 పరుగులకు ఆలౌటైంది. కేకేఆర్ బౌలర్లలో రుణ్ చక్రవర్తి 3, కార్తీక్ త్యాగి 2, నరైన్ 2, వైభవ్ అరోరా, కామెరూన్ గ్రీన్, అనుకుల్ రాయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## పంజాబ్‌పై గుజరాత్ టైటాన్స్ విజయం

**అహ్మదాబాద్:** సొంతగడ్డపై గుజరాత్ టైటాన్స్ మరో విజయం అందుకుంది. పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల తేడాతో నెగ్గి ప్లే ఆఫ్ అవకాశాలను మెరుగుపర్చుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 163 రన్స్ చేసింది. తొలి ఓవర్లోనే సిరాజ్ డబుల్ షాకిచ్చాడు. వరుస బంతుల్లో ప్రియాన్ష్ ఆర్య(2), కొనెల్లీ(0)ను అవుట్‌చేశాడు. మరో ఎండ్‌లో రబడ, హోల్డర్ చకచకా మిడిలార్డర్ పని పట్టారు. దీంతో 47 పరుగులకే పంజాబ్ 5 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అన్‌క్యాప్డ్ ప్లేయర్ సూర్యాన్ష్ షెడ్గే(57), మార్కస్ స్టోయినిస్(40) ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 79 పరుగులు జోడించారు. చివర్లో జెన్సన్(20)కూడా ఓ చేయడంతో 150 మార్కు దాటింది. గుజరాత్ బౌలర్లలో హోల్డర్ 4, సిరాజ్ 2, రబడ 2 వికెట్లు పడగొట్టారు.

ఈ స్వల్ప లక్ష్యాన్ని గుజరాత్ మరో బంతి మిగిలి ఉండగానే 6 వికెట్లు కోల్పోయి అందుకుంది. ఆరంభంలోనే శుభ్‌మన్ గిల్(5) విఫలమైనా...టాప్‌ఫామ్‌లో ఉన్న సాయి సుదర్శన్(41 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 57), జాస్ బట్లర్(22 బంతుల్లో 25), వాషింగ్టన్ సుందర్(23 బంతుల్లో 5 ఫోర్లు, ఓ సిక్స్‌తో 40నాటౌట్) రాణించి గుజరాత్ టైటాన్స్‌కు విజయం ఖాయం చేశాడు. గుజరాత్‌కు ఇది హ్యాట్రిక్ విజయం. పది మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో 12 పాయింట్లతో ఉంది. టాప్ ప్లేస్‌లో పంజాబ్ కొనసాగుతోంది.



# థామస్ కప్‌లో భారత్‌కు కాంస్యం

## సెమీఫైనల్లో ఫ్రాన్స్ చేతిలో క్లీన్‌స్వీప్

**హోర్సెన్స్ (డెన్మార్క్):** ప్రతిష్ఠాత్మక థామస్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీలో ఫైనల్ చేరాలన్న భారత్ ఆశలకు ఫ్రాన్స్ గండికొట్టింది. స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ గాయంతో అందుబాటులో లేకపోవడం జట్టు అవకాశాలను దెబ్బతీసింది. సెమీఫైనల్లో ఫ్రాన్స్ 3-0తో భారత్‌పై క్లీన్ స్వీప్ చేసి ఫైనల్ చేరింది. ఈ ఓటమితో భారత్ కాంస్యంతో సరిపెట్టింది. నాలుగేళ్ల గ్యాప్ తర్వాత మెడల్ అందుకుంది. 2022లో ఒకే ఒకసారి థామస్ కప్ విజేతగా నిలిచిన భారత్..1952, 1955, 1979, 2026లో సెమీస్ వరకు చేరి కాంస్య పతకాలు నెగ్గింది.

భారత ఏస్ ప్లేయర్ లక్ష యసేన్ గాయంతో దూరం కావడంతో తొలి సింగిల్స్ ఆడిన ఆయుష్ షెట్టి నిరాశ పరిచాడు. అతడు 11-21, 9-21తో వరుస సెట్లలో పోపోవ్ చేతిలో పరా జయం పొందాడు. తొలి సెట్ ఆరంభంలో చక్కని ప్రదర్శన ఇచ్చిన ఆయుష్.. ఆ తర్వాత లయ కోల్పోయాడు. రెండో గేమ్ లోనూ ఆయుష్ షెట్టి తేలిపోయాడు. ఇక రెండో సింగిల్స్‌లో లక్ష్యసేన్ స్థానంలో దిగిన కిదాంబి శ్రీకాంత్ పోరాడినా ఓటమి తప్పలేదు. శ్రీకాంత్‌పై లానియర్ 21-16, 21-18తో నెగ్గి ఫ్రాన్స్‌కు 2-0 ఆధిక్యం అందించాడు. రెండో సెట్‌లో శ్రీకాంత్ ఓ దశలో 16-14తో ఆధిక్యంలో నిలిచి సమం చేసే ఊపులో కనిపించాడు. అయితే లానియర్ అతనికి అవకాశం ఇవ్వలేదు. కచ్చితంగా గెలవాల్సిన మూడో సింగిల్స్‌లో అనుభవజ్ఞుడు ప్రణయ్ కూడా చేతులెత్తేయడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. ఈ మ్యాచ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 19-21, 16-21తో పోపోవ్ చేతిలో కంగుతిన్నాడు. కీలక సమయాల్లో ఒత్తిడికి లోనై మ్యాచ్ చేజార్చుకున్నాడు. దీంతో ఫ్రాన్స్ 3-0తో ఆధిక్యంలో నిలిచింది. దీంతో డబుల్స్ ఆడే అవసరం రాలేదు. సెమీస్‌లో ఓటమితో భారత్ ఖాతాలో కాంస్య పతకం చేరింది.

## కోస్టియుక్‌కు మాడ్రిడ్ ఓపెన్ టైటిల్



**ముతువా(మాడ్రిడ్):** ఉక్రెయిన్‌కు చెందిన మార్టా కోస్టియుక్.. మాడ్రిడ్ ఓపెనర్ మహిళల సింగిల్స్ టైటిల్ అందుకుంది. ఫైనల్లో ప్రపంచ నెంబర్8 ర్యాంకర్ మిర్రా ఆండ్రీవా(రష్యా)పై సంచలన విజయం సాధించింది. మొదటి సెట్‌ను 6-3తో అలవోకగా ముగించిన 23 ఏళ్ల కోస్టియుక్‌కు... రెండో సెట్‌లో ఆండ్రీవా నుంచి గట్టి పోటీ ఎదురైంది. ఇరువురు పోటాపోటీగా సర్వీసులు నిలబెట్టుకోవడంతో 5-5తో సమవుజ్జీగా నిలిచారు. ఈ దశలో ఆండ్రీవా సర్వీసును కొల్లగొట్టడమే గాక, తన సర్వీసును నిలుపుకుని రెండోసెట్‌ను మ్యాచ్‌ను ముగించింది. కోస్టియుక్‌కు ఇది మొదటి డబ్ల్యుటిఎ 1000 టైటిల్. అలాగే క్లే కోర్టుపై వరుస విజయాల సంఖ్యను 11కు పెంచుకుంది. డబ్ల్యూటిఎ ర్యాంకింగ్స్‌లో కోస్టియుక్ ప్రపంచ నంబర్ 23 నుండి... కెరీర్‌లోనే అత్యుత్తమమైన 15వ ర్యాంకుకు చేరుకుంది. మే 24న పారిస్‌లో పారంభం కానున్న ఫ్రెంచ్ ఓపెన్‌లో టాప్ కంటెండర్‌గా కోస్టియుక్ బరిలోకి దిగనుంది. మాడ్రిడ్‌లో టైటిల్ గెలుస్తానని ఎప్పుడూ అనుకోలేదని, అది నేరవేరినందుకు సంతోషంగా ఉందని కోస్టియుక్ ఆనందం వ్యక్తం చేసింది.



## బ్రిజ్ వల్ల నష్టపోయా: వినేశ్ ఫోగట్

**న్యూఢిల్లీ:** ఇప్పటికే రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ వల్ల తాము నష్టపోయామని స్టార్ మహిళా రెజ్లర్ వినేశ్ ఫోగట్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ టోర్నీలో తనకు గానీ, రెజ్లర్లకు గానీ ఏదైనా జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండాలో నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్ త్వరలో జరగనుంది. గోండా ప్రాంతంపై బ్రిజ్ భూషణ్ ప్రభావంఉందన్నారు. ఆయన తన సన్నిహితుల ద్వారా ఈ పోటీ ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉందని వినేశ్ పేర్కొన్నారు. గోండాలో జరగనున్న టోర్నమెంట్‌లో వినేశ్ 57 కేజీల విభాగంలో పోటీపడనున్నారు. 2026 ఆసియా క్రీడల్లో భారత్ తరఫున పోటీ చేయడానికి రెజ్లర్‌ల ఎంపికకు భారత రెజ్లింగ్ సమాఖ్య నిర్వహించే ఈటోర్నమెంట్ కీలకం కానుంది. రిజిస్ట్రేషన్ అంశంలో కూడా వివాదమైంది.




# ఎయిరిండియాకు రూ.22వేల కోట్ల నష్టం

## నష్టాల తగ్గింపుపై బోర్డు కీలక భేటీ

## ఏడో తేదీ అత్యవసర సమావేశం

**ముంబయి, మే 3:** నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న ఎయిరిండియాను గట్టెక్కించేందుకు ఖర్చులు తగ్గించే ప్రణాళికలపై ఎయిరిండియా బోర్డు సమావేశం కానున్నది. ఈనెల 7వ తేదీ ఎయిరిండియా బోర్డు సమావేశం అవుతుందని తెలిసింది. కొత్త సిఇఒ నియామకం, కంపెనీ ఆర్థిక వివరాలు వంటివి చర్చకు రానున్నాయి. ఎయిరిండియా గ్రూప్ ఈ ఆర్థికసంవత్సరంలోనే 22 వేల కోట్ల నష్టం చవిచూసింది. పశ్చిమాసియా యుద్ధం ప్రభావం ఎయిరిండియాపై ఎక్కువ చూపించింది. సింగపూర్ ఎయిర్ లైన్స్ గ్రూప్ సిఇఒ కాంప్‌బెల్ విల్సన్ ఈ ఏడాది పదవినుంచి దిగిపోతున్నట్లు ప్రకటించడంతో ఇపుడు కొత్త సిఇఒ ఎంపికపైనా చర్చకు రానున్నది. టాటాసన్స్ ఛైర్మన్‌ఎన్‌చంద్రశేఖరన్ అధ్యక్షతన ముంబయిలో ఈనెల 7వ తేదీ జరిగే సమావేశం అత్యంత కీలకం కానున్నది. జెట్ ఇంధన ధరలు అంతర్జాతీయంగా భారీగాపెరగడంతో ఎయిరిండియా ప్రస్తుతం టికెట్లనుంచి భోజనసదుపాయం లాంజ్ యాక్సెస్ వంటివి తొలగిస్తోంది. బిజినెస్ క్లాస్ ప్రయాణీకులకు ఈ తొలగింపు వర్తిస్తుంది. అలాగే పశ్చిమాసియా వివాదంతో గగనతల ఆంక్షలు కూడా పెరిగిపోయాయి. దీనివల్ల అంతర్జాతీయ రూట్లలో దూరం భారీగా పెరిగి ఇంధన భారం పెరిగింది. ఎయిరిండియాలో 25.1శాతం వాటా ఉన్న సింగపూర్ ఎయిర్ లైన్స్ నుంచి ప్రాతినిధ్యం వహించిన కాంప్‌బెల్ స్థానంలో కొత్త సిఇఒను కూడా ఎంపికచేయాలి. ఈసారి యూరోపియన్ అభ్యర్థులను సిఇఒగా నియమించాలని భావిస్తున్నారు. చంద్రశేఖరన్, విల్సన్‌లు కాకుండా సింగపూర్ ఎయిర్‌లైన్స్ సిఇఒ గోహ్ చూన్ ఫాంగ్ మరో నలుగురు బోర్డు డైరెక్టర్లుగా ఉన్నారు. సంజీవ్‌మెహతా, అలైస్ వైద్యన్; పిఆర్ రమేష్; పిబి బాలాజీలు ఎయిరిండియా బోర్డులో సభ్యులుగా ఉన్నారు. ఈనెల ఒకటవ తేదీనే ఎ యిరిండియా సిఇఒ సంస్థకు జెట్‌ఇంధన సమస్య సవాల్‌గా మారుతున్నదని హెచ్చరించారు కూడా. ఈపరిస్థితుల్లో ఎయిరిండియా బోర్డు సమావేశానికి ఇపుడు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. ఏప్రిల్ నెలతోపాటు మేలో కూడా అంతర్జాతీయ రూట్లను కొన్ని కుదించింది. జూన్;జులైనెలలకు కూడా కొన్ని షెడ్యూళ్లను కుదించాలనినిర్ణయించింది. గతనెల 26వ తేదీనే భారత్‌లో అత్యధిక సర్వీసులున్న ఎయిరిండియా, ఇండిగో, స్పైస్‌జెట్‌లు ధరల పెంపుదలతో తాము సర్వీసులు నడపలేమని కూడా లేఖరాసాయి. అంతర్జాతీయ విమానాలకు మే ఒకటో తేదీనుంచి ఐదుశాతం జెట్‌ఫ్యూయల్ ధరలు పెంచింది. రానున్న నెలల్లో ఇంధన ధరలు కూడా భరించలేనిస్థాయికి పెరుగుతాయని కూడా ఎయిరిండియా భావిస్తోంది.




## టాటాసన్స్ లిస్టింగ్‌కు రిజర్వ్ బ్యాంక్ కొత్త నిబంధనల బ్రేక్!

**ముంబయి, మే 3:** స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ ఆపేందుకు టాటా సన్స్ చేస్తున్న ప్రయత్నాలకు ఆర్బీఐ బ్రేకులు వేసింది. టాటా గ్రూప్ కంపెనీల నుంచి వచ్చే నిధులను పరోక్షంగా ప్రజల నిధుల కిందే పరిగణించాలని ఆర్బీఐ కొత్త రూల్స్ తీసుకొచ్చింది. పెట్టుబడి కంపెనీగా డీరిజిస్టర్ చేయాలని టాటా సన్స్ పెట్టుకున్న దరఖాస్తుపై ఈ నిర్ణయం ప్రభావం చూపించనుంది. జులై 1 నుంచే అమలులోకి ఈ కొత్త నిబంధనలు రానున్న క్రమంలో టాటా సన్స్ భవిష్యత్ ప్రణాళికలపై ప్రభావం పడుతుంది. టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ తన ఫైనాన్స్ లైసెన్సును సరెండ్ చేస్తే తప్పనిసరి స్టాక్ మార్కెట్ లిస్టింగును తప్పించుకోవచ్చనే వాదననూ ఇటీవలి ఓ నోటిఫికేషన్ ద్వారా ఆర్బీఐ తోసిపుచ్చింది. రిజర్వ్ బ్యాంక్ మార్గనిర్దేశాల ప్రకారం డెట్ మార్కెట్‌తో సంబంధాలు ఉన్న గ్రూప్ కంపెనీలు, అనుబంధ సంస్థల నుంచి ఈక్విటీని పొందిన క్రమంలో పరోక్షంగా ప్రజా నిధులను పొందినట్లుగానే పరిగణించనున్నారు. న్యాయ నిపుణుల అంచనాల ప్రకారం టాటా సన్స్‌కు చెందిన టాటా మోటార్స్, టాటాపవర్, టాటాస్టీల్, ఇండియన్ హోటల్స్, టాటా కెమికల్స్ తమ హోల్డింగ్ సంస్థల నిధులను అందజేసిన సమయంలో డెట్‌మార్కెట్ల ద్వారా నిధులను సమీకరించాయి. మరోవైపు రూ.1000 కోట్ల ఆస్తుల్లోపు ఉన్న ఎన్‌బీఎఫ్‌సీలకు మాత్రమే డీరిజిస్ట్రేషన్ మార్గాన్ని కొత్త నిబంధనలు సూచిస్తున్నాయి. టాటా సన్స్ స్టాండలోన్ ఆస్తులు రూ.1.75లక్షల కోట్లుగా ఉన్నాయి. అంటే ఈ పరిమితిని దాటి ఉన్నట్లు తెలుస్తోంది. అంతకుముందు లక్ష కోట్లకు పైగా ఉన్న కంపెనీలను అప్పర్ లేయర్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా వర్గీకరిస్తారని ఆర్బీఐ ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. సెప్టెంబర్ 2022న మొదటి సారి ఆర్బీఐ అప్పర్ లేయర్ లిస్ట్ విడుదల చేసింది. అప్పుడు టాటా సన్స్ ఒక్కటే తప్పనిసరి లిస్టింగ్ చేయకుండా ఉన్న కంపెనీగా మినహాయింపు పొందింది. టాటా సన్స్ లిస్టింగ్ విషయంలో టాటా ట్రస్ట్స్‌లో విభేదాలు కనిపించిన విషయం తెలిసిందే. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయల్ టాటా లిస్టింగ్ కు వ్యతిరేకంగా ఉన్నారు. వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసం, విజయం సింగ్ లిస్టింగ్ చేయాలని కోరుతున్నారు. గతనెలలో షాపూర్జీ పల్లోంజీ మిస్త్రీ, వేణు శ్రీనివాసన్ లు టాటా సన్స్ లిస్టింగ్ కు మద్దతు పలికి అత్యవసరమైన ప్రక్రియగా పేర్కొన్నారు. లిస్టిం గ్‌ప్రక్రియ ద్వారా గ్రూప్ లో పాలన, పారదర్శకత, బాధ్యత బలోపేతం అవుతుందని వారు వాదిస్తున్నారు.

## 21.3శాతం తగ్గిన అంతర్జాతీయ ప్రయాణాలు

**ముంబయి, మే 3:** పశ్చిమాసియాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం భారత విమానయాన రంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీనివల్ల ఈ ఏడాది మార్చిలో భారత్ నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు గణనీయంగా తగ్గాయి. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదిక ప్రకారం గత నెలల వృద్ధితో పోలిస్తే మార్చిలో విదేశాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య 18.5 శాతం మేర క్షీణించింది. మొత్తం అంతర్జాతీయ విమాన రాకపోకల్లో 21.3 శాతం తగ్గుదల నమోదైంది. పశ్చిమాసియాలో అమెరికా, ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా పలు దేశాలు తమ గగనతలాలను మూసివేశాయి. దీంతో దుబాయ్, ఖతార్ వంటి ప్రధాన రవాణా కేంద్రాలకు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఐరోపా, అమెరికా వెళ్లే విమానాలు సుదీర్ఘ మార్గాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీనికి తోడు, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎటిఎఫ్ ధరలు గతేడాదితో పోలిస్తే 34 శాతం పెరిగాయి. ఈ పరిణామాలతో విమానయాన సంస్థలకు నిర్వహణ ఖర్చులు భారీగా పెరిగాయి. అందువల్లనే పలు అంతర్జాతీయ సర్వీసులను తగ్గించుకుంటున్నట్లు ఎయిర్ ఇండియా ఇప్పటికే ప్రకటించింది.

## డీమార్ట్ నికరలాభం రూ.656.6 కోట్లు




**ముంబయి, మే 3:** దేశంలో డీమార్ట్ పేరిట స్టోర్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్ మార్ట్స్ నాలుగో త్రైమాసికంలో నికరలాభం రూ. 656.6 కోట్లుగా నమోదైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే లాభం19శాతం పెరిగింది. గత ఏడాదిఇదేకాలంలో లాభం రూ.550.90కోట్లుగా ఉంది. మరోవైపు కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.17,684 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలానికిగాను సంస్థ ఆదాయం రూ. 14,872 కోట్లుగా ఉండగా 19శాతం మేర పెరిగింది. ఇక కంపెనీ ఎబిటా కూడా పెరిగింది. వార్షిక ప్రాతిపదికన ఇది 26.7 శాతం పెరిగి రూ.1210.5 కోట్లకు చేరుకుంది. అంతకు ముందు ఏడాదిలో ఎబిటా 955.1 కోట్లుగా ఉండేది. చివరి త్రైమాసికంలో 58 కొత్త స్టోర్లను తెరిచి మొత్తం 500 స్టోర్ల మార్కును చేరుకుంది. మార్చి 2026లో పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలోకొనుగోళ్లదారుల సెంటిమెంట్ బలపడిందని దీంతో కొనుగోళ్లు పెరిగాయని పేర్కొంది. ఇకపూర్తి ఆర్థిక సంవత్సరానికిచూస్తే డీమార్ట్ మొత్తం ఆదాయం 15.9శాతం పెరిగి 66,968 కోట్లకు చేరుకుంది. ఎబిటా 15.7 శాతం పెరిగి 5,255 కోట్లుగా నమోదైంది.

## నాలుగు సంస్థల్లో 2.20 లక్షలకోట్లు ఎంక్యాప్ వృద్ధి

**ముంబయి, మే 3:** మార్కెట్లలోని టాప్ పది కార్పొరేట్ సంస్థల్లో నాలుగు సంస్థల మార్కెట్ విలువలు 2.20 లక్షలకోట్లు పెరిగాయి. శెలవులతో వారం తగ్గినప్పటికీ మార్కెట్లర్యాలీతో ఈ షేర్లు పుంజుకుని కంపెనీ టర్నోవర్‌ను భారీగా పెంచింది. అయితే ఈ పెరుగుదలను రానున్న రోజుల్లో ముడిచమురు ధరల పెరుగుదల కట్టడిచేస్తుందని నిపుణుల అంచనా. ఆసియా మార్కెట్ల ధోరణులు, ఎఫ్‌పిఐల విత్‌డ్రాలు, డాలర్‌రూపాయి మారకం విలువలతో భారీ మార్పులు ఉండవచ్చన్న అంచనాలున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.1,39,655.8కోట్లుపెరిగి రూ.19,36,303.30 కోట్లకు పెరిగింది. భారతీ ఎయిర్‌టెల్ విలువలు రూ.43,503.51కోట్లుపెరిగి రూ.11,49,222.13కోట్లకు చేరింది. టిసిఎస్ విలువలు కూడా 27,569.83 కోట్లుపెరిగి రూ.8,94,933.95 కోట్లుకు చేరుకోగా బజాజ్‌ఫైనాన్స్ విలువలు కూడా రూ.9432.32కోట్లు పెరిగి రూ.5,83,123.13 కోట్లకు చేరింది. ఇక ఐసిఐసిఐబ్యాంకు మార్కెట్ క్యాపిటల్ మాత్రం రూ.45,364.62 కోట్లు క్షీణించి రూ.9,04,980.78 కోట్లకు చేరింది.



## ఈఎల్వీ నిబంధనలతో ఆటోరంగంపై రూ.25వేల కోట్ల భారం

**న్యూఢిల్లీ, మే 3:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎండ్‌ఆఫ్‌లైఫ్ వాహనాల ఇ ఎల్ వి నిబంధనల కారణంగా భారత ఆటోమొబైల్ రంగంపై భారీ ఆర్థిక భారం పడనున్నట్లు తెలుస్తోంది. 2025లో కేంద్ర పర్యావరణ, అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ ప్రకటించిన కొత్త నిబంధనల వల్ల 2026లో ఆటో కంపెనీల లాభాలపై సుమారు రూ.25,000 కోట్ల ప్రభావం పడే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. పర్యావరణ పరిరక్షణ (ఎండ్‌ఆఫ్‌లైఫ్ వాహనాలు) రూల్స్, 2025లోని రూల్ 4(6) ప్రకారం, ఒక వాహన తయారీ సంస్థ కార్యకలాపాలు నిలిపివేసినా, అప్పటివరకు మార్కెట్లో విక్రయించిన వాహనాలపై ఉత్పత్తిదారు బాధ్యతలను కొనసాగించాల్సి ఉంటుంది. ఈ నిబంధన కారణంగా ఇండ్ ఎఎస్ 37అకౌంటింగ్ ప్రమాణం అమల్లోకి వస్తుందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. దీని ప్రకారం, గత 20 సంవత్సరాల్లో విక్రయించిన ప్రైవేట్ వాహనాలు, 15 సంవత్సరాల్లో విక్రయించిన కమర్షియల్ వాహనాల కోసం కంపెనీలు పర్యావరణ పరిహారం ఖర్చులకు ముందుగానే నిధులు కేటాయించాల్సి ఉంటుంది. దీంతో ఆటో కంపెనీలు మార్కెట్ నుంచి నిష్క్రమించే ఉద్దేశం లేకపోయినా, గతంలో విక్రయించిన వాహనాలకుగాను భారీ మొత్తంలో ప్రొవి జన్లు ఏర్పాటు చేయాల్సి వస్తుందని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రాథమిక అంచనాల ప్రకారం, 2025-26లో మొత్తం ఆటో పరిశ్రమపై ఒకేసారి సుమారు రూ.25,000 కోట్ల స్థూల ప్రభావం ఉండొచ్చని, డిస్కౌంటెడ్ ప్రాతిపదికన ఇది సుమారు రూ.9వేల కోట్ల వరకు ఉండవచ్చనిసియామ్ తెలిపింది. ఈ సమస్య పరిష్కారానికి రూల్ 4(6)లో మార్పులు చేయాలని పరిశ్రమ కోరినప్పటికీ, మార్చి 27న విడుదలైన సవరణ నోటిఫికేషన్‌లో సంబంధిత క్లాజ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పరిశ్రమ అంచనాల ప్రకారం, నాలుగు చక్రాల వాహన తయారీదారులపై ఈ నిబంధనల ప్రభావం సుమారు రూ.14,623 కోట్లు ఉండగా, రెండు మరియు మూడు చక్రాల వాహన తయారీదారులపై సుమారు రూ.9,650 కోట్ల ప్రభావం ఉంటుందని దీనివల్ల ఆటో రంగ లాభాలను గణనీయంగా దెబ్బతీసే అవకాశం ఉందని, కొత్త టెక్నాలజీల్లో పెట్టుబడులు పెట్టే సామర్థ్యాన్ని మరియు భవిష్యత్ వృద్ధి ప్రణాళికలను కూడా ప్రభావితం చేయవచ్చని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.